జూన్ - 2024

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD

142

JUNE - 2024



UNESCO Site Inscription : 1983 - TAJ MAHAL

VOL 12వ వసంతంలో

142 ISSUES నూట నలభై రెండవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- సాగర్ అన్వేషణకు సరికొత్తగా.. సముద్రయాన్
- ఒకపాట వంద జ్ఞాపకాలు
- ఆంత్రపోసీన్ యుగంలో వ్యవహార జ్ఞానం
- సర్వీస్ కమిషన్లు - తప్పిదాలు



**VOL 12 వ వసంతంలో**

**142 ISSUES నూట నలభై రెండవ సంచిక**

**పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్**







దక్కన్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2024 జూన్ సంచికతో 142 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




Tajmahal, Agra, Uthar Pradesh, India

Date of Inscription: 1983 Category : Cultural (monument)

## తాజ్ మహల్ అందాలు

పరిపూర్ణ సామరస్యం, అద్భుతమైన శిల్పకళ ద్వారా, ఇండో-ఇస్లామిక్ సమాధి ఆర్కిటెక్చర్ ఈ మొత్తం శ్రేణిలో, సమతుల్యత, సమరూపత, వివిధ అంశాల సామరస్య సమ్మేళనంలో ప్రత్యేకమైన సౌందర్య లక్షణాలతో అత్యుత్తమ నిర్మాణ, కళాత్మక సాధనను తాజ్ మహల్ సూచిస్తుంది. శతాబ్దాలుగా కవులు, యాత్రికులతో ఎంతగానో ప్రశంసించబడిన తాజ్ మహల్ నిస్సందేహంగా భారతదేశ అత్యంత ప్రసిద్ధ స్మారక చిహ్నం. తెల్లని పాలరాతి వైభవంతో తాజ్ మహల్ నేడు ప్రేమకు చిహ్నంగా నిలుస్తోంది. సామాన్య శకం 1632లో మరణించిన తన ప్రియమైన భార్య ముంతాజ్ మహల్ కోసం మొఘల్ చక్రవర్తి షాజహాన్ దీనిని పవిత్ర సమాధిగా నిర్మించాడు.

ఈ కల్చరల్ మాన్యుమెంటు UNESCO చే 1983లో గుర్తించబడింది.

*ప్రత్యేక వ్యాసం : 29, 30 పేజీలో చదవండి.*

TELANGANA RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## చౌరస్తాలో ప్రజాస్వామ్యం

ఏప్రిల్ దక్కన్ ల్యాండ్ పత్రికలో తెలంగాణకు సంబంధించిన అరుదు అయిన వ్యక్తుల గురించి అచ్చు వేసినందుకు కృతజ్ఞతలు. ముందుగా ప్రస్తావించాల్సింది కాటం లక్ష్మీ నారాయణ. నిజానికి కాటం లక్ష్మీ నారాయణ లాంటి వాళ్ళు ఉమ్మడి రాష్ట్రంలో విస్మరణకు గురి అయ్యారు. ప్రజాస్వామిక చారిత్రక నేపథ్యం ఉన్న తెలంగాణ చరిత్ర బయటకు రాలేదు. అంత మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమంలో 1969 జనవరి 13 ఫామ్ అయిన ఒక సంస్థకు చైర్మన్‌గా కూడా పని చేశారు. ఆయన తెలంగాణ ఉనికికి మూలంగా నిలిచిన ఉర్దూ అకాడమీకి అధ్యక్షుడుగా పని చేసిన మేధావి.

తెలంగాణ వారసత్వ కట్టడాలలో రామప్పనే కాకుండా సలేశ్వరం , వెయ్యి స్తంభాల గుడి లాంటివి కూడా ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నం చేయాలి. అంబేద్కర్ జయంతి సందర్భంగా చౌరాస్తాలో ప్రజాస్వామిక ప్రయత్నం అని అనిపిస్తుంది. స్వయంగా ప్రధాన మంత్రి దేశం లోని ఒక సెక్షన్ ప్రజల పైన విపరీత వాఖ్యలు చేయడం, ఒక బాధ్యతాయత వ్యక్తి ఇలాంటి వాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నది.

– **భారత అవినాష్,** జనగామ

❖ ❖ ❖

## శాలిబండ కథలు

పరవస్తు లోకేశ్వర్ రాసిన 'రాచిప్పల పచ్చిపులుసు' కథ చదివి చాలా ఎంజాయ్ చేశాం. మళ్లీ బాల్యంలోకి వెళ్లి వచ్చినట్లు అయ్యింది. నాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడమైనది. నాటి రోళ్ళు, రోకలి బండ, రాతి జాడీలు, మట్టి కుండలు గుర్తుకు వచ్చాయి. కల్తీలేని నాటి పచ్చళ్ల (తొక్కులు), పచ్చి పులుసు, మజ్జిగ, అప్పటి అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) జ్ఞాపకం వచ్చాయి. రచయిత పుణ్యాన మళ్లీ ఒకసారి జుమ్మేరాత్ బజార్, రూప్‌లాల్ బజారు, ట్రూప్ బజార్, పురానాపూల్, ధూల్‌పేట, పేట్లా బురుజు, సిటీ కాలేజి అలా పాత బస్తీ అంతా మళ్లీ కలయ తిరిగినట్లు అయ్యింది. పచ్చడి పెట్టే విధానం, పోపు (తిరగమోత) గురించి వారు వర్ణించిన విధానాన్ని చదువుతుంటే నోట్లో నీరు వూరుతుంది. నాటి జీవన యానం గురించి గుర్తుసిన లోకేశ్వర్‌గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**–ఖాజా మొహియినుద్దీన్,** హైదరాబాద్

❖ ❖ ❖

## బాలల హక్కులు

ప్రొఫెసర్ శాంత సిన్హా బస్తీలలో వుండే బాలబాలికల లింగ ప్రవర్తన గురించి, వారి జీవన విధానం గురించి చాలా విపులంగా తెలిపారు. అబ్బాలు హానికరమైన ప్రవర్తనను ఆశ్రయిస్తే, అమ్మాయిలు పితృస్వామ్యం, లింగ హింస నుండి బయటపడటానికి విద్యను ఒక మార్గం ఎంచుకుంటారు. ఈ అణగారి వర్గాల పిల్లల కోసం నగరం మరియు వాటి పరిసరాలను చూపించి, హానికరమైన వాతావరణం నుండి వారిని రక్షించాలి. వారికి అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలి. వాళ్లకిష్టమైన పనులు చేసుకునే అవకాశాలను కల్పించాలి. ఆట స్థలాలను కల్పించి, పాఠశాలలను అందుబాటులో ఉంచాలి. కమ్యూనిటీ సెంటర్లు మొదలగు ఇతర సదుపాయాలు కల్పించాలి.

**–ఎన్. గోవర్ధన్,** మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## కనుమరుగవుతున్న కళారూపాలు

జాతి, కుల, వంశ, వైశిష్ఠతను కాపాడేది కళారూపం. భిన్న మతాలకు, కలఋఆలకు నిలయమైన మన భారతీయ సంస్కృతిలో అట్టడుగు వర్గాలు మాత్రమే సంస్కృతిని పరిరక్షిస్తున్నాయి. సమాజ మార్పుకు దోహదపడే కొన్ని కళలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. పగటి వేషం, ఫకీరు సాహెబుల వేషం, హరిదాసు వేషం, ఆది భైరాగి వేషం, అర్ధనారీశ్వర వేషం, రంభ, శుక మహాఋషి వేషం, ఎరుకలసోది వేషం, కోయ వేషం, గొల్లబోయడి వేషం, బుడబుక్కల వేషం, పొట్టల దొర వేషం బాగా జనాదరణ పొందినవి. నేడు అవి కనుమరుగువుతున్నవి. ఈ కళల్ని కనీసం ప్రత్యేక సమయాల్లోనూ, పర్వదినాల్లోనూ ప్రోత్సహించం అలవచ్చుకుంటే వాటిని కాపాడుకున్నట్లు అవుతుందని రచయిత భీమమ్మ కోరడంలో ఎలాంటి సందేహం లేదు.

**–సి. నాయక్,** కర్నూలు ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 12 సంచిక : 10 పేజీలు : 60

జూన్ - 2024



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాషా**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

కవర్‌పేజీ

**తాజ్‌మహల్**



layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com

**కృతజ్ఞతలు**


దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


విషయసూచిక

# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో



ఎల్లలెరుగని పక్షులం!
కల్లలెరుగని జీవులం!!



నీలమొక్కటి చాలు


భాగ్యరెడ్డి వర్మ ........ డా॥ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 6

తెలంగాణ చరిత్ర ....... (ఎడిటోరియల్) ........ వేదకుమార్. యం ........ 7

నీలమొక్కటి చాలు ........ చకిలం వేణుగోపాల్‌రావు ........ 9

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది ........ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ........ 12

ఒక పాట వంద జ్ఞాపకాలు ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13

ఆంత్రపోసీన్ యుగంలో వ్యవహార జ్ఞానం ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 19

సాగర అన్వేషణకు సరికొత్తగా..!! సముద్రయాన్ ........ పుట్టా పెద్దఓబులేసు ........ 21

సర్వీస్ కమిషన్లు - తప్పిదాలు ........ తడకమల్ల వివేక్ ........ 25

తమిళనాడు రాష్ట్రంలోని జియో హెరిటేజ్ స్థలాలు ........ కమతం మహేందర్‌రెడ్డి ........ 27

తాజ్ మహల్ అందాలు ........ అమితా బేగ్ ........ 29

సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలబెట్టుకున్న తెలంగాణ ........ శ్రీధర్‌రావు దేశ్‌పాండే ........ 31

సాహిత్యం న్యాయమూర్తులకి కూడా ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 35

గద్వాల జిల్లాకు ప్రత్యేక విద్యా ప్రణాళిక ........ ఆర్. వెంకట్‌రెడ్డి ........ 37

బాల కార్మిక నిర్మూలన ........ దక్కన్ న్యూస్ ........ 40

కరీంనగర్ జిల్లాలో పురాతన నాణేల చారిత్రక ప్రాముఖ్యత ........ డా॥ దెమె రాజారెడ్డి ........ 41

ప్రకృతితో ఐక్యమయ్యేది యోగ ........ సత్య ప్రసన్న ........ 44

ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామ నామాలు ........ డా॥ మండలస్వామి ........ 45

చారిత్రక నగరం ఆకునూరు ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 47

టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్ గ్రహీత కమతం మహేందర్‌రెడ్డి ........ మహమ్మద్ గౌస్ ........ 50

ఎల్లలెరుగని పక్షులం! కల్లలెరుగని జీవులం!! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 51

భూతాపం భవిష్యత్తు తరాలకు శాపంగా మారుతోందా! ........ డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి ........ 55

భూమి పునరుద్ధరణ ........ ఎసికె. శ్రీహరి ........ 57


కాలుష్యంపై యుద్ధం (కథ) ........ బి. తనుశ్రీ ........ 58


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# భాగ్యరెడ్డి వర్మ

అంబేద్కర్ 125వ జయంత్సుత్సవాలు దేశ, విదేశాల్లో ఘనంగా జరుపుకొంటున్నాం. ఆయన రచనలన్నీ ఇప్పుడు వివిధ భాషల్లో ఉచితంగా అందరికీ అందుబాటులోకి వచ్చాయి. తెలుగు యూనివర్సిటీ ప్రచురించిన తెలుగు సంపుటాలు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. అంబేద్కర్‌ని భిన్న పార్శ్వాల్లో దర్శించడానికి ఆయన రచనలు దారి చూపిస్తున్నాయి.

అయితే అంబేద్కర్ కన్నా ముందే దేశవ్యాప్తంగా 'ఆదిహిందువు'ల, నిమ్నజాతుల (హరిజన అనే పదాన్ని భాగ్యరెడ్డి వర్మ నిర్ద్వందంగా వ్యతిరేకించిండు) వారి నాయకుడిగా గుర్తింపు పొందినవాడు భాగ్యరెడ్డి వర్మ. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు మొదలు ఎం.సి. రాజా వరకు ఎందరో మన్ననలు అందుకున్న ఆయన 128వ జయంతి మే 22న జరుపుకున్నాం. తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని భాగ్యరెడ్డి వర్మ గురించి కొంత సమాచారం వెలుగులోకి వచ్చింది. భాగ్యరెడ్డి వర్మ కుమారుడు 1952లోనే హైదరాబాద్ అసెంబ్లీకి ఎన్నికైన గౌతమ్ 'భాగ్యోదయం' పేరిట ఇంగ్లీషులో చిన్న పుస్తకాన్ని వెలువరించాడు. ఈ పుస్తకానికి మాతృక అంతకముందు 1921లోనే వడ్లకొండ నరసింహారావు రాసిన రచన. ఈ పుస్తకం ఇప్పుడు తెలుగు పాఠకులకు కూడా అందుబాటులోకి వచ్చింది. సంతోషం.



అయితే భాగ్యరెడ్డి వర్మ రచనలు, ఉపన్యాసాలు, సంపాదకీయాలు, సృజాత్మక రచనలు ఇంతవరకూ పుస్తక రూపంలో రాలేదు. వాటి గురించి చాలా తక్కువ మందికి తెలుసు. గతంలో ఒకరిద్దరు భాగ్యరెడ్డి వర్మ రచనల్ని ఈ వ్యాసకర్త నుంచి తీసుకొని ముద్రించడానికి ప్రయత్నం చేసినారు కాని అది ముందుకు సాగలేదు. ఆ రచనల్ని ఆంగ్లంలోకి కూడా తర్జుమా చేసి ఆయన గొప్పతనాన్ని జాతికి చాటి చెప్పాలి.

నిజానికి ఈ దేశ మూలవాసులు దళితులేనని బోధిస్తూ, వారి పట్ల సమాజం చూపిస్తున్న వివక్షా వైఖరిని ఖండిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ఉద్దేశంతో 1906లోనే 'జగన్మిత్రమండలి' అనే సంస్థను నెలకొల్పి దాని ద్వారా కృషి చేసిండు. 50 సంవత్సరాల జీవితంలో 32 యేండ్లు ప్రజాశ్రేయస్సుకోసం వినియోగించిన భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. నిజాం ప్రభుత్వంతో పోరాడి దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలు, బ్రహ్మసమాజ్, ఆర్యసమాజ్, సంఘసంస్కార నాటక మండలి, దేవదాసీ నిర్మూలనోద్యమం, ఆదిహిందువుల ఐక్యత, రాజకీయ వాటా కోసం, దళితుల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం ఆయన చేసిన కృషి ఇప్పటికీ గుర్తింపుకు నోచుకోలేదు.

ఇక అసలు విషయానికొస్తే నేను ఎంతో శ్రమకోర్చి సేకరించిన / కాపాడిన భాగ్యరెడ్డి వర్మ రచనలు త్వరలో పుస్తక రూపం దాల్చనున్నాయి. నిజానికి ఇప్పటి వరకు భాగ్యరెడ్డి వర్మ ఒక దళితోద్యమ నాయకుడిగానే అందరికీ తెలుసు. అయితే ఈయన భాగ్యనగర్, ఆదిహిందూ పత్రికల్ని నడిపించడమే గాకుండా దళితుల హక్కుల కోసం పోరాటం చేసిన తొలి నాయకుల్లో ప్రథముడు, హక్కులు కాపాడడంలో భాగంగానే 1938లోనే ఆదిహిందూ పత్రికలో "ప్రాథమిక హక్కులు" అనే సంపాదకీయం రాసిండు.

ఆ కాలంలో తెలంగాణాలో మొత్తం చదువుకున్న తెలుగువారి జనాభా ఐదారు శాతానికి మించదు. ఇందులో దళితుల అక్షరాస్యతా శాతం మరీ అధ్వాన్నం అయితే నిమ్నజాతుల వారి గోడు అగ్రకులాల వారికి కూడా తెలియాలి. ముందు వారు సమస్యను సానుకూలంగా అర్థం చేసుకునేందుకు పత్రికా రచన ఉపయోగపడుతుందని నమ్మి దాన్ని నిర్వహించిన వినయ సంపాదకుడు భాగ్యరెడ్డి వర్మం. పత్రికల్లో రాజారామ్‌మోహన్‌రాయ్, బ్రహ్మసమాజ్, బుద్ధ జయంతి సందర్భంగా రాసిన సంపాదకీయాలు ఆనాటి అనేక విషయాల్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.

"గ్రామ హిందువులు, ఆది హిందువుల బాలురను స్కూళ్లకు పంపిచింనందున వారి బావులలో గాజునూనెను పోసి పారదోలిరి. మరొకచోట నూనెతో భక్ష్యములు చేసుకొనినందున అతనిని చావతన్ని అన్న ఆహారములకు మన్నుగప్పిరి. ఇంకొకచోట సర్కారువారితో ఆజ్ఞను పొంది గోధుమ రొట్టెలు చేసుకొని విందారగించు సమయమున హిందువులు తండోపతండాలుగా వచ్చి ఆహారమునంతయు మట్టిలో కలిపి దుడ్డుకర్రలతో చావమోదిరి.

మరొకచోట కూరలలో నెయ్యిని వాడినందులకు, ఊరేగింపులో గుర్రమెక్కినందులకు, సైకిళ్ళపైనెక్కి దారిన పోవుచుండ ఆవులను చూచి దిగిదండము పెట్టనందులకు, మొన్న నర్సాపురం

(తరువాయి 8వ పేజీలో)

# తెలంగాణ చరిత్ర ఆధిపత్య వ్యతిరేక పోరాటాల చరిత్ర



తెలంగాణ చరిత్ర ఆధిపత్య వ్యతిరేక పోరాటాల చరిత్ర. తెలంగాణకు మరోపేరు పోరాటాల పురిటి గడ్డ. ప్రపంచంలో జరిగిన, జరుగుతున్న ఉద్యమాలకు పాఠాలు చెప్పిన ప్రజా ఉద్యమాల చరిత్ర తెలంగాణా రాష్ట్ర సాధన చరిత్ర.

నాగరికత అంటే ప్రకృతి వనరులను వినియోగించుకోగలిగిన సామర్థ్యం. సంస్కృతి అంటే ప్రజల జీవన విధానం. ప్రతి ప్రాంతానికీ తమదంటూ నాగరికత, సంస్కృతి వుంటాయి. ప్రకృతి వనరులను ఎంతబాగా వినియోగించుకోగలిగితే అంతగా నాగరికత అభివృద్ధి చెందుతుంది. ఆ నాగరికత ప్రజల జీవన విధానంలో పలు మార్పులు తెచ్చి సంస్కృతీ భాగాలైన సాహిత్యం, కళలు, వేష, భాషలు యిలా జీవితంతో సంబంధం వున్న ప్రతి అంశంపై ప్రభావం చూపుతుంది.

ప్రకృతి వనరులు ప్రజలందరికీ సమానంగా అందకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు అవరోధంగా నిలుస్తాయి. పల్లెల సాధికారత, కుల వృత్తుల మనుగడ ప్రశ్నార్థక మవుతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మృగ్యమవుతాయి. దీనివల్ల ప్రతి రంగంలో అసమానతలు బలీయంగా పెరుగుతాయి. సామాన్యుడి రోజు వారీ జీవితం గడవటమే కష్టమవుతుంది.

ప్రకృతి వనరులైన నీళ్లు, ఆర్థిక పరమైన నిధులు, పరిపాలనా అంశమైన నియామకాలు తెలంగాణ ప్రజలకు ఎందుకు దూరమయ్యాయో ప్రజలు తెలుసుకున్నారు. తమవి తమకే చెందాలన్న చైతన్యం పెరిగింది. ఈ అస్తిత్వ చైతన్యమే తెలంగాణా మలిదశ ఉద్యమానికి ఊపిరిపోసింది. ప్రతి పల్లె, ప్రతి యిల్లు, యింట్లోని ప్రతి మనిషి ఉద్యమానికి అంకితమయ్యారు. కుల, మత బేధాలు, స్త్రీ పురుష తేడాలు, చిన్నా పెద్ద వయో పరిమితులను అధిగమించి సకలజనులు రాష్ట్ర సాధనకోసం ఒకే గొంతుకై, ఒకే పిడికిలై నిలిచారు. ధూంధాంలు, సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ, ధర్నాలు, ఊరూరా నిరాహార దీక్షలు, పాదయాత్రలు, సెమినార్లు, మిలియన్ మార్చ్, సాగర హారం, సదస్సులు, నిరంతర చర్చలు చరిత్రలో అజరామరంగా నిలిచిన ఉద్యమ రూపాలు.

బలిదానాలు, త్యాగాలు ఉద్యమాన్ని నిరంతరం నిత్యాగ్నికీలగా నిలిపాయి. ఈ ఉద్యమాలే రాష్ట్రాన్ని యిచ్చామన్నవారి, తెచ్చామన్నవారి రాజకీయ ప్రక్రియను వేగవంతం చేసాయి. అనివార్యతను కల్పించాయి. రాష్ట్రాన్ని సాధించాయి.

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ విజయోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంలో ఏ ప్రజా ఆకాంక్షలు ఉద్యమ కారకాలయ్యాయో అవి ఎంత వరకు నెరవేరాయో, నెరవేరక పోతే నెరవేరడానికి యిప్పుడు మనం ఏం చెయాల్సి వుందో పునరాలోచించాల్సి వుంది. వాటి సాధనకు కృషి చేయాల్సి వుంది.

ప్రజలు చైతన్యవంతులు. చరిత్ర తిరగరాసే శక్తి ప్రజలకెప్పుడూ ఉంటుంది.

వేదకుమార్.ఎం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

*(6వ పేజీ తరువాయి)*

తాలూక తూర్పుతాళ్ళ శివారు శిరంశెట్టిల యింట్లో జరిగిన ఆదిమాంధ్రుల వివాహ సందర్భమున పెండ్లి వారు పీటలపై కూర్చొని యుండగా, గడ్డిబుట్టలతో పోవు కాపులను కండ్లు కనబడుటలేదాయని" దుర్భాషలాడుతూ ఊరుకాపులందరు యేకమై వచ్చి తలుపులు విరగగొట్టి దాగుకొనిన వారందరినీ చావమోదిరి. అనేకులకు గాయములనలొర్చిరి. కొల్లాబత్తుల వెంకన్న తల పగులగొట్టిరి. కుండలమధ్య దాగుకొనిన 80 సంIIల ముసలమ్మ నడుము విరగొట్టిరి. చేతులు జోడించి మొక్కబోయినవారికి చేతులు విరగొట్టిరి. స్త్రీలను, వృద్ధులను, పిల్లలను వారి ఇష్టము వచ్చినట్లు కొట్టగా గాయములు పొందినవాడు ఆసుపత్రిలో చికిత్స బడయుచున్నట్లు స్థలాంతరమున ప్రకటించిన వార్తవలన తెలియుచున్నది" అని ఆంధ్రా ప్రాంతంలో జరిగిన దాడులను ఏకరువు పెడుతూనే, అలాంటివి తెలంగాణలో జరుగకుండా నిజాం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక హక్కులు పేరిట రాసిన సంపాదకీయంలో అభిప్రాయపడ్డారు.

దీనితో పాటుగా ఆదిహిందూ వార్షిక సభల సందర్భంగా చేసిన సుదీర్ఘ ఉపన్యాసాలు ఇది వరకే కొన్ని చిన్న చిన్న బుక్‌లెట్స్‌గా ప్రచురింపబడ్డాయి. వాటిలో పోలీసు, సైనిక విభాగాల్లో ఆదిహిందువులను చేర్చుకోవడంలో చూపిస్తున్న వివక్ష, వెట్టి చాకిరీలను విమర్శిస్తూ చేసిన ఉపన్యాసాలు తర్వాతి కాలంలో వ్యాసాలు పత్రికల్లో అచ్చయ్యాయి.

అలాగే ఆంధ్రమహాసభ వాళ్ళు ప్రతి యేటా 1930 నుంచి నిర్వహించిన సభలకు భాగ్యరెడ్డి వర్మ తప్పనిసరిగా హాజరయ్యేవారు. ఆయా సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు కూడా ఆ కాలంలో పత్రికల్లో అచ్చయ్యాయి. ఖమ్మం సభకు తాను వెళ్ళలేక పోయినప్పటికీ తన ఉపన్యాసాన్ని రాసి పంపించడంతో అక్కడ చదవడం జరిగింది. ఇవేగాకుండా సందర్భానుసారంగా వివిధ విషయాలపై భాగ్యరెడ్డి వర్మ దాదాపు 1911 నాటి నుంచి వివిధ పత్రికలకు వ్యాసాలు రాసేవారు. అలా ఆయన రాసిన మొదటి వ్యాసం ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో 1911లో అచ్చయింది.

వీటితో పాటుగా మొత్తం తెలుగులోనే మొట్టమొదటిసారిగా కథలు రాసిన దళితుడు భాగ్యరెడ్డి వర్మ. మాదిగల వెట్టి చాకిరి జీవితాల పట్ల చలించి 'అజ్ఞాతవాసి' అనే పేరిట 1931లోనే 'వెట్టి మాదిగ' అనే కథను భాగ్యరెడ్డి వర్మ రాసిండు. వీటితో పాటుగా గణపతి తత్వం అనే సెటైరికల్ నాటికను కూడా ఈయన రాసిండు.

నిజానికి భాగ్యరెడ్డి వర్మ రచనలు చాలా వరకు అలభ్యంగా ఉన్నాయి. భాగ్యరెడ్డి వర్మ తన పేరు, హైదరాబాద్ పేరూ రెండూ వచ్చే విధంగా ఏర్పాటు చేసిన 'భాగ్యనగర్' పత్రిక ప్రతులు నాలుగైదు సంచికలు మించి ఇప్పుడు అందుబాటులో లేవు. నిజానికి ఈ భాగ్యనగర్ ప్రతులన్నింటినీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన కునుమ ధర్మన్నకు ఇచ్చినట్లు ఈ వ్యాసకర్తతో గతంలో గౌతమ్ గారు చెప్పారు. అయితే ఆ ప్రతులన్నీ అగ్ని ప్రమాదంలో కాలిపోయి ఉండవచ్చనే అనుమానాన్ని కూడా ఆయన వ్యక్తం జేసిండు. భాగ్యనగర్, ఆదిహిందూ పత్రికా ప్రతులు దొరికినట్లయితే భాగ్యరెడ్డి వర్మ రచనలపై మరింత లోతుగా పరిశీలన చేయడానికి వీలవుతుంది.

ఇప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భాగ్యరెడ్డి వర్మ మీద ఒక ఎంఫిల్ పరిశోధన జరిగింది. నిజానికి నాలుగైదు పిహెచ్‌డీలు చేయగలిగినంత సమాచారం, ఉన్నతి ఉన్న వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

**-డాII సంగిశెట్టి శ్రీనివాస్**
m : 9849220321
e: sangishettysrinivas@gmail.com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సంIIలకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా చెల్లించవచ్చు.

**Account Details:**
Bank Name : Canara Bank
A/c No. : 30101010003714
BracnH : Ashoknaar, Hyderabad
IFSC Code : CNRB0013010




చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో, మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 1990 మరియు 1991 సంవత్సరములలో వెలువడిన 'బాలచెలిమి' పిల్లల వికాస పత్రిక మంచి ఆదరణ పొందినది.
బాలల్లో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన వినోదాలను అందించాలన్న లక్ష్యంతో 'బాలచెలిమి' జనవరి 2024 ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ (52) పేజీలతో పత్రికను పునరుద్ధరించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

**మా చిరునామా :**
**బాలచెలిమి**
'చంద్రం' 3-6-712/2,
స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029,
తెలంగాణ.
Mobile : 9030626288
Email: desk.chelimi@gmail.com
website : www.balachelimi.com

# నీలమొక్కటి చాలు

*'నిక్కమయిన మంచి నీలమొక్కటి చాలు,*
*తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల*
*చదువ పద్యమరయ జాలదా యొక్కటి*
*విశ్వదాభిరామ వినురవేమ'*

ఈ వేమన పద్యం తెలియని తెలుగు వారు ఉండరేమో. ఇక్కడ ప్రస్తావించిన నీలము ఒక మహారత్నంగా అందరికి పరిచయం. నవరత్నాలలో దీన్ని విశేషంగా పేర్కొన్నారు. శనితో అనుసంధానించబడటం వల్ల ఈ రత్నం కొంత భయాన్ని, అప్రతిష్ట కూడా మూటకట్టుకుంది.

**నీలమణి చరిత్ర**

ప్రారంభం నుండి మానవ నాగరికతకు సుపరిచితం. గరుడపురాణం ప్రకారం సంహరించబడిన బలి చక్రవర్తి శరీరభాగాలు భూమిపై పడి రత్నాలుగా మారాయి. అందులో కన్నులు నీలలుగా, కండలు కనక పుష్యరాగాలుగ మారినట్లు చెప్తారు. అగ్నిపురాణం లోను, శివపురాణం లోను నీలాల ప్రసక్తి ఉంది. అర్థశాస్త్రంలోను, బృహత్సంహితలోను ఇవి ప్రస్తావించబడ్డాయి.



నీలమణి రావణగంగా నదికి సమీపంలోని పద్మకరదేశంలో కనివిస్తుంది అని వరాహమిహిరుడు తన బృహద్సంహితలో వివరించాడు. నరహరి తన రాజనిఘంటువులో "లోహితక వజ్రమౌక్తికా మరకత నీలమహోపలః పంచ.." అనగా ఐదు గొప్ప విలువైన రాళ్లు మాణిక్యం, వజ్రం, ముత్యం, మరకతం మరియు నీలమణి అని పేర్కొన్నాడు. ఇంద్రనీల, మహేంద్రనీల, మహానీల, మయూరనీల, శౌరీరత్న మొదలైన పేర్లతో కూడా ఇవి వ్యవహరించబడుతాయి.

నీలమణి బల్లలపై పది ఆజ్ఞలు (టెన్ కమాండ్మెంట్) చెక్కబడి ఉన్నాయని ప్రాచీన హెబ్రీయులు విశ్వసించారు. కానీ చరిత్రకారులు బైబిల్లో ప్రస్తావించబడిన నీలిరంగ రత్నాలు లాపిస్ లాజురి కావచ్చు అని నమ్ముతారు.

గ్రీకు లాటిన్ భాషలలో సఫిరస్, సఫిరోస్ అంటే నీలి రంగు కలది అని అర్థం. సఫైర్ అనే పేరు ఈ విధంగా వచ్చింది. అయితే సఫైర్లు అన్నీ నీలిరంగులో ఉండవు. రూబీ మరియు సఫైర్ రెండు కొరండం యొక్క రత్నం ప్రభేదాలు. క్రోమియం జాడలు కలిగ ఉన్న కొరండం ఎరువు రంగు సంతరించుకొని రూబీగా పిలువబడుతోంది. జాడలలో ఫెర్రస్ వంటి ఇతర మూలకాలు ఉంటే కొరండం వేరే రంగులను సంతరించుకుంటుంది. కొరండంలోని ఎరుపు మరియు ఎరుపు షేడ్స్ మాణిక్యాలు అయితే ఇతర రంగులలో ఉన్న కొరండంను సఫైర్‌గా వ్యవహరిస్తారు. వీటిలో రంగులేని తెల్లని నీలమణి, వివిధరకాల నీలిరంగులతో కూడిన నీలమణి ఉన్నాయి. పసుపురంగులో ఉండే నీలమణిని కనక పుష్యరాగం అంటారు. పసుపు నీలం కలిసి ఉన్న దానిని పీతాంబరి అంటారు. ఈ నీలమణి ఆకుపచ్చ రంగుతో సహా వివిధ రంగులలో లభిస్తుంది. ప్రస్తుతం నీలమణి అనే పదాన్ని రత్నాలకు మాత్రమే కాకుండా అనేక వ్యుత్పన్న అర్థాల్లో ఉపయోగిస్తున్నారు. వ్యక్తి పేరు, పర్వతాల పేరు మరియు వివిధ రకాల మామిడి కాయల పేర్లు మొదలైనవి ఇందులో ఉన్నాయి. శ్రీకృష్ణ నామంగా కూడా ఇది ప్రసిద్ధం.

**ఉపయోగాలు మరియు ఖనిజ సమాచారం**

నీలమణి (Sapphire)లో కొరండం, ఇనుము, టైటానియం, క్రోమియం, వెనాడియం లేదా మెగ్నీషియం వంటి రకరకాల ఖనిజ మూలకాలతో కూడిన అల్యూమినియం ఆక్సైడ్ ($Al_2O_3$)ను కలిగి ఉంటుంది. ఇది సాధారణంగా నీలం రంగులో ఉంటుంది. కానీ సహజమైన "ఫాన్సీ" నీలమణి పసుపు, నారింజ, ఆకుపచ్చ రంగులలో కూడా ఉంటుంది. "పార్టి నీలమణి" రెండు లేదా అంతకంటే ఎక్కువ రంగులను చూపుతుంది. పింక్ కలర్ కొరండంను ప్రాంతాన్ని బట్టి రూబీ లేదా నీలమణిగా వర్గీకరిస్తారు. సాధారణంగా సహజమైన నీలమణిని సానపట్టి రత్నాలుగా నగలలో ధరిస్తారు.

పెద్ద క్రిస్టల్ బౌల్స్‌లో పారిశ్రామిక లేదా అలంకరణ ప్రయోజనాల కోసం వాడుతారు. ప్రయోగశాలలలో వాటిని కృత్రిమంగా కూడా సృష్టించవచ్చు.

నీలమణి విశేషమైన కాఠిన్యం కారణంగా మోహ్స్ స్కేల్‌లో 9, (వజ్రం తరువాత మూడవ కఠినమైన ఖనిజం) ఇన్ఫ్రారెడ్ ఆప్టికల్ భాగాలు, అధిక-మన్నిక విండోస్‌లో నీలమణిని ఉపయోగిస్తారు. రిస్ట్ వాచ్ స్ఫటికాలు, కదలిక బేరింగులు, సున్నితంగా ఉండే ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇంకా ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, జీఎయన్-ఆధారిత బ్లూ ఎల్ఇడిలు వంటి వాటిలో ఉపయోగిస్తారు.

**నీలం-రసాయన ఫార్ములా**

aluminium oxide, $Al_2O_3$. రంగు- Every color including parti-color, except red (which is ruby). స్ఫటిక ఆకృతి- massive and granular. స్ఫటిక వ్యవస్థ-Trigonal.

చీలిక– None ఫ్రాక్చర్, Conchoidal, splintery. కఠినత్వం– 9.0. ద్యుతిగుణం– Vitreous. వక్రీభవన గుణకం –1.762– 1.778 విశిష్ట గురుత్వం 3.95–4.0

### కొరండం రకాలు

కొరండం రెండు రత్నాల రకాల్లో నీలమణి ఒకటి. మరొకటి రూబీ (ఎరుపు కొరండం). నీలం బాగా తెలిసిన నీలమణి రంగు అయినప్పటికీ, అవి బూడిద, నలుపుతో సహా ఇతర రంగులలో కుడా ఉంటాయి. కొన్ని రంగులేనివిగా ఉంటాయి. నీలమణి ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, కంబోడియా, కామెరూన్, చైనా (షాన్డాంగ్), కొలంబియా, ఇథియోపియా, ఇండియా (కాశ్మీర్), కెన్యా, లావోస్, మడగాస్కర్, మాలావి, మొజాంబిక్, మయన్మార్ (బర్మా), నైజీరియా, రువాండా, శ్రీలంక, టాంజానియా, థాయిలాండ్, యునైటెడ్ స్టేట్స్ (మోంటానా), వియత్నాంలలో లభ్యమవుతాయి. రూబీ, నీలమణి రెండూ మయన్మార్ యొక్క మొగోక్ స్టోన్ ట్రాక్ట్‌లో కనిపిస్తాయి. నీలమణి గ్రానైటిక్ పెగ్మాటైట్స్ లేదా కొరండం సైనైట్లలో దొరుకుతుంది.

### కొరండం నిల్వలు మరియు వనరులు

NMI డేటా ప్రకారం కొరండం మొత్తం నిల్వలు మరియు వనరులు 294 వేల టన్నులుగా అంచనా వేయబడింది. ఇందులో నీలమణి నిలువలు 450 కిలోలు మాత్రమే, జమ్మూ కాశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.



భారతదేశంలో కొరండం రూబీ మరియు నీలమణి కోసం అన్వేషించడానికి అపారమైన సంభావ్యత ఉంది. ప్రస్తుతం అధికారిక రికార్డు ప్రకారం ఉత్పత్తి శూన్యం.

### కాశ్మీర్ నీలం

నీలమణులలో కాశ్మీరీ నీలం ను ఉత్తమమైనదిగా పరిగణిస్తారు. వైలెట్–బ్లూ కాశ్మీర్ నీలమణి వేలంలో $ 2,42,000 మిలియన్ల ధరకు విక్రయించబడింది. ఈ నీలమణులు నాణ్యతతో కూడిన ఉన్నతమైన కార్న్‌ఫ్లవర్ నీలం రంగును కలిగి ఉంటాయి. నీలమణిని కలిగి ఉన్న శిల చినాబ్ లోయలో 1880వ సంవత్సరంలో ఒక షికారి ద్వారా మొదటిసారిగా కనుగొనబడింది. సుంజమ్ మరియు మాచెల్ గ్రామం సమీపంలో ల్యాండ్ స్లిప్ కారణంగా పదార్ పొరుగున గ్నీస్‌లోని ఇంటర్‌కలేటెడ్ క్రిస్టలిన్ సున్నపురాయి బహిర్గతమైంది.

FR మాలెట్ ఈ సమాచారాన్ని GSI రికార్డులలో ప్రచురించాడు.

"ఈ నీలాలు ఎక్కువగా డబుల్ షట్కోణ పిరమిడ్‌లు తరచుగా ఎగుడు దిగుడు ఆకారంలో ఉంటాయి. క్షితిజ సమాంతర స్ట్రైషన్స్‌తో చాలా చదునుగా మరియు లోతుగా గీతలతో ఉన్నాయి. పెద్ద సంఖ్యలో ఇవి పాల మరియు లేత నీలం బూడిద రంగులో ఉన్నాయి. చాలా వరకు సిల్మనైట్ ద్వారా అసంపూర్ణంగా కనిపిస్తాయి. అక్కడక్కడ టూర్మాలిన్ లోకి నీలమణి చొచ్చుకుపోయి కనిపిస్తుంది".

1882 నుండి 1905 వరకు ఓల్డ్ కాశ్మీర్ గనుల్లో నీలాలు దొరికాయి. 1905లో వీటిని మూసివేశారు. 1906 నుండి 1927 వరకు 39,209 తులాల నీలమణులు పాత (ఓల్డ్) మరియు కొత్త గనుల్లో కలిపి ఉత్పత్తి జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత అధికారికంగా ఎలాంటి ఉత్పత్తి జరిగినట్లు సమాచారం లేదు. మార్కెట్‌లో మాత్రం అక్కడ అక్కడ ఇవి కనిపిస్తూనే ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ గనుల్లో దొరికే నీలాలు అన్ని ఓల్డ్ కాశ్మీర్ గనుల్లో నీలాల వలె విలువైనవి కావు. పాత కాశ్మీర్ గనుల నుండి నీలమణి మరియు POK మరియు జమ్మూ ప్రాంతాల నుండి వచ్చిన నీలమణుల మధ్య తేడాను గుర్తించడంలో జాగ్రత్తగా ఉండాలి.

### నీలమణి నిర్మితి

మైక్రోస్కోప్ ద్వారా పరిశీలిస్తే కాశ్మీర్ నీలమణిలో పెద్ద సంఖ్యలో సూదులవంటి పార్గసైట్ స్ఫటికాలు చిన్న ప్రిస్మాటిక్ డ్రావిట్‌లు, అంచులు స్పష్టంగా లేని జిర్కాన్‌లు పునశ్శోషణం చేయబడిన ఫెల్డ్‌స్పార్, ధూళిని, దుమ్ము మేఘాలను మరియు బ్రష్ యొక్క స్ట్రోక్‌లను పోలి ఉండే దుమ్ము తెరలను గుర్తించవచ్చు. ఇలాంటి నిర్దిష్ట చేరికలు ఇతర నీలాలలో ఉండవు.

మృదువైన నీలం రంగు మరియు కంటి శుభ్రమైన అపారదర్శకత ఈ నీలమణి యొక్క ప్రత్యేక లక్షణం. కాశ్మీర్ నీలమణి యొక్క అధిక విలువ కారణంగా అమ్మకం దారులు ఇతర నీలమణిని కాశ్మీర్ నీలమణిగా నమ్మించటానికి ప్రయత్నించవచ్చు. కొన్ని శ్రీలంక నీలమణి ముఖ్యంగా రత్నపురా నుండి 12 కిమీ దూరంలోని ఎలిగుడాలోని గని నుండి వచ్చిన నీలమణి కాశ్మీరీ నీలమణిని పోలి ఉంటుంది. తరచుగా పెద్ద ల్యాబ్‌లు భౌగోళిక స్థానాన్ని సరిగ్గా ధృవీకరించడంలో విఫలమవుతాయి.

### మోంటానా నీలమణి

ఇవి నీలమణిలో ఒక విశేష స్థానాన్నికలిగి ఉన్నాయి. మృధువైన కార్న్‌ఫ్లవర్ బ్లూ మరియు వివిధ రకాల ఇతర రంగులు మోంటానా నీలమణి యొక్క ప్రత్యేకత. మోంటానా మరియు యోగో నీలమణి రెండూ మోంటానాకు చెందినవి. ఇవి కాకుండా శ్రీలంక నీలమణి, బర్మీస్ నీలమణి కూడా మార్కెట్‌లో గౌరవించబడుతున్నాయి.

### కనక పుష్యరాగం

ఈ రత్నం అన్ని నవరత్నాలలో అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది.

గురు రత్నంగా దీనికి జ్యోతిష్య ప్రాముఖ్యత ఉంది. ఖనిజ



శాస్త్రపరంగా ఇది కొరండం కుటుంబానికి చెందిన నీలమణి. ఈ రత్నాలు ముఖ్యంగా శ్రీలంక ద్వారా సరఫరా చేయబడతాయి మరియు దక్షిణ భారతదేశంలో బాగా ప్రాచుర్యం పొందాయి.

**స్టార్ సఫైర్**

రత్నం యొక్క ఉపరితలంపై నక్షత్రం వలె కనిపించే ఆప్టికల్ దృగ్విషయం కారణంగా నక్షత్ర నీలమణికి ఆ పేరు వచ్చింది. ఇది సూదుల వంటిరూటైల్ చేరికల కారణంగా సంభవిస్తుంది. ఈ నక్షత్రం నీలమణి విలువను పెంచుతుంది.

**రంగు మార్పు నీలమణి (Colour change sapphire):**

కొన్నిసార్లు నీలమణి వేర్వేరు కాంతిలో రంగు మారుతూ ఉంటుంది. వివిధ మూలకాల చేరికలు తరంగదైర్ఘ్యాల శోషణలో వ్యత్యాసాన్ని కలిగిస్తాయి. నీలమణి యొక్క నీలం రంగు గులాబీ రంగులోకి వివిధ కాంతి పరిస్థితులలో మారుతుంది. దీనిని రంగు మార్పు నీలమణి అంటారు. ఈ లక్షణం వల్ల దానికి మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుంది.

**చరిత్రలో నీలమణి**

పూర్వ ఆధునిక భారతదేశపు రత్నాల ప్రస్తావన ప్రయాణికుల ఖాతాలో కనిపిస్తుంది. Pliny భారతదేశంలోని అనేక రత్నం మైనింగ్ స్థలాల గురించి ప్రస్తావించారు. పర్షియన్ యాత్రికులు భారతదేశంలోని రత్నం వాణిజ్య కేంద్రాల గురించి కూడా ప్రస్తావించారు. అల్బెరూని భద్రత కోసం ఉత్తర భారతం నుండి దక్షిణాదికి తీసుకెళ్లిన భారతీయ రత్నాల గురించి ప్రస్తావించారు. అమీర్ ఖుస్రూ (1252-1325) దక్షిణం నుండి దోచుకున్న రత్నాల గురించి వివరంగా వివరించాడు. వాటిలో నీలమణి ప్రస్తావన ఉంది. Thakur Pheru (1270) అల్లావుద్దీన్ ఖిల్జీ యొక్క విస్తారమైన రత్నాల సేకరణను వివరించాడు, ఇందులో ఇతర రత్నాలతో పాటు నీలమణి కూడా ఉంది.

ఒడెరోడో బార్బోసా (1519). విజయనగరం రత్నాల మార్కెట్‌లోని రత్నాల గురించి వివరంగా వివరించాడు. అందులో శ్రీలంకకు చెందిన నీలమణిలు కూడా ఉన్నాయి. టావెర్నియార్ గోవాను రత్నాల వ్యాపారానికి పెద్ద కేంద్రంగా వివరించాడు. అందులో నీలమణి కూడా ఉన్నాయి. మొఘలులు రత్నాలను ఇష్టపడేవారు. అక్బర్ తన ఖజానా ఒక క్రమపద్ధతిలో నిర్వహించాడు. జహంగీర్ రత్నాలను బాగా ఇష్టపడేవాడు.

ఔరంగజేబు ఆధీనంలో ఉన్న రత్నాలను పరిశీలించడానికి టావెర్నియర్‌కు అనుమతించబడింది.

ఔరంగజేబు ఖజానాలోని విస్తారమైన రత్నాల సేకరణలో ఒక పెద్ద ఓరియంటల్ అమెథిస్ట్ (నీలమణి)తో కూడిన గొలుసు ఉంది. టావెర్నియార్ ఒక పెద్ద 158 క్యారెట్ "ఓరియంటల్ పుష్పరాగాన్ని" (పసుపు నీలమణి) కూడా వివరించాడు. అది అష్టభుజి ఆకారంలో ఉంది. పట్టాభిషేకం సమయంలో ఔరంగజేబు దానిని తన టోపీలో ధరించాడు.

నెమలి సింహాసనం గురించి వివరిస్తున్నప్పుడు టావెర్నియర్ (1605-1689) నెమలి యొక్క ఎత్తైన తోకలో పొదిగిన నీలమణుల గురించి ప్రస్తావించాడు.

**చరిత్రలోని ప్రసిద్ధ నీలమణులు**

**రాక్‌ఫెల్లర్ నీలమణి:**

1934లో భారతీయ మహారాజు నుండి పొందిన దీర్ఘచతురస్రాకార స్టెప్ కట్ 62 క్యారెట్ బర్మీస్ నీలమణి

**స్టార్ ఆఫ్ ఇండియా:**

శ్రీలంక నుండి 536 క్యారెట్ల పెద్ద కాబోకాన్ కట్ గ్రే బ్లూ స్టార్ నీలమణి. అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ NYలో ప్రదర్శించబడింది.

**లోగాన్ నీలమణి:**

422.99 క్యారెట్ శ్రీలంక నీలమణి ప్రస్తుతం స్మిత్‌సోనియన్ మ్యూజియం వాషింగ్టన్‌లో ప్రదర్శించబడింది.

**బొంబాయి స్టార్:**

ప్రస్తుతం స్మిత్‌సోనియన్ మ్యూజియం వాషింగ్టన్‌లో ప్రదర్శించబడిన శ్రీలంక నుండి 182 క్యారెట్ల పెద్ద కాబోఛాన్.

**ఆడమ్ యొక్క నక్షత్రం:**

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద నక్షత్రనీలమణి. శ్రీ లంకలోని రత్నపురా గనుల్లో నుండి తవ్వినది. దీని బరువు 1404.49 క్యారెట్లు.

Mr. AJ హోప్ తన సుప్రసిద్ధ నీలమణి Merveilleuxని ప్రదర్శించాడు. ఇది పగటిపూట నీలి రంగు మరియు రాత్రికి అమెథిస్ట్ వలె రంగు మారుతుంది." అని S. M ఠాగూర్ తన "మణిమాలలో" పేర్కొన్నాడు.

-చకిలం వేణుగోపాలరావు,
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com



# ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది ఇప్పుడు నిట్ట నిలువుగా చీలింది!

ఇందుర్తి. ఆ ఊరిపేరుతో చాలా ఊర్లున్నాయి. ప్రస్తుతం మనం మాట్లాడుకునే గ్రామం మాత్రం మర్రిగూడ మండలం, నల్లగొండ జిల్లాలో ఉంది. అటు మునుగోడు నుంచి ఇటు మాల్ నుంచి వెళ్లొచ్చు. ఆచార్య అండమ్మగారి ఆహ్వానంపై వాళ్లూరు కొరిటికల్ గ్రామంలోని లక్ష్మీనరసింహాలయాన్ని చూచి, ఆమె కారులోనే ఇందుర్తి వెళ్లాం. అక్కడున్న కొందరు మిత్రులు గ్రామంలోని చారిత్రక ఆనవాళ్లకు తీసుకెళ్లారు. కొంత కారు, కొంత మోటారు సైకిల్, మరికొంత కాలినడక. పల్లెటూరి పొలంగట్లు, చెరువుకట్ల వెంట తిరుగుతుంటే, చెట్లూ, గట్టుల పలకరింపులతో ఒళ్లంతా పులకింతలే.

ముందుగా గ్రామంలోని శిథిల శివాలయానికి తీసుకెళ్లాడు ఆ ఊరి మిత్రుడు నరసింహ. చుట్టూ కంపచెట్లు. పక్కనే పెంటపోగు. రోడ్డు వెంట పడిపోయిన ఆలయ రాళ్లు, ఇటుక రాతి ముక్కలు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్‌గారు నాకు వివరించిన శిథిల శిల్పాలు.

ఓపిగ్గా ముళ్ల కంచెలోంచి ఆలయంలోపల అడుగుబెట్టాం. గర్భాలయం ఒక మూలన మట్టిలో సగం కూరుకుపోయిన తల తెగిన నంది విగ్రహం. నిధుల వేట గాళ్ల గడ్డపారలకు బలై, జాలిగా చూస్తున్న గర్భాలయం, నేనూ అంతే నంటున్న అర్ధమండపం. నిత్యనైవేద్యస్థానంలో నిండు నైరాశ్యం. మనిషినే కాదు దేవునికి కూడా బాధలుంటాయన్న నిజం తెలిసింది. బయటికొచ్చిచూస్తే, ఎవరో దాడి చేస్తేనో ప్రకృతి భీభత్సం ముంచుకొస్తేనో తప్ప, చెల్లా చెదురుగా పడి ఉన్న ఆలయ శిఖ శకలాలు.

గతంలో ఒకసారి ఈ ఆలయాన్ని గురించి చెప్పిన చరిత్రకారుడు డా. ద్యావనపల్లి సత్యనారాయణ గారిని మళ్లీ సంప్రదించి గాలింపు మొదలు బెడితే, ఊరు బయట శిథిల శివాలయం, గ్రామంలో చెన్నకేశవాలయం, పొలాల్లో వీరగల్లు శిల్పాలు, శివలింగాలు, ఒద్దికగా కుదురుకున్న నంది, కళ్యాణీ చాళుక్య కొత్తశాసనం, నాగదేవతలు, ఇందుర్తి చరిత్రకు తరగని, చెరగని సాక్ష్యాలు. ఇందుర్తి గ్రామంలోనూ, పొలిమేరల్లోనూ ఉన్న అన్ని ఆనవాళ్లను తడిమి చూచి, చరిత్ర అనుభూతుల్ని పొంది, ఒకపక్క ఆ గ్రామ చారిత్రకగాథ, నిర్లక్ష్యానికి గురౌతున్నాయన్న వ్యథ ఒక్కసారిగా నాముందు ముసురుకున్నాయి. బాధ్యత లేదా అంటూ మౌనంగా కసురుకొన్నాయి. మిత్రులతో కలిసి మొదట చూచిన శిథిల శివాలయానికి మళ్లీ వచ్చాను. అక్కడున్న గ్రామస్తులకు గ్రామంలో క్రీ.శ. 9 నుంచి క్రీ.శ.14వ శతాబ్ది ఆనవాళ్లను కాపాడుకోవాలని విన్నవించుకొన్నాను. నా బాధను వాళ్లతో పంచుకొన్నాను. రేచర్ల పద్మనాయకులు రాచకొండ నుంచి ఠీవిగా పాలించినప్పుడు కట్టిన ఆలయమని వారికి వివరించాను. నిలువునా చీలిన ఈ ఆలయాన్ని పదిలపరచుకోవాలన్న నాగోడును వారికి విన్నవించాను. అమాయకంగా వారు నా వైపు చూచిన చూపులు, నాలో వేల ప్రశ్నలను పుట్టించాయి. జవాబుల కోసం, ఆకసం వంక చూస్తూ, ఆచార్య అండమ్మగారి కారులో హైదరాబాదు చేరుకొన్నాం. కళ్ల ముందు అవే శిథిలాలు, అవి వేస్తున్న వేల ప్రశ్నలు, దొరకని సరైన సమాధానాలు.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# ఒక పాట వంద జ్ఞాపకాలు

**బా**ల్యంలో మన లేత చిగురాకుల వంటి పెదాలపై తొలిసారి, ఓం ప్రథమంగ, ఒకానొక సువర్ణ ఘడియలో పలికిన, పాడినపాట ఏవైవుంటుంది? మిమ్మల్ని మీరు ఎవుడైనా ప్రశ్నించుకుని, ఆలోచించారా? ఆ పాటను మీరు పట్టుకున్నారా? మళ్లీ మీ పెదాలపై ఆ పాట నర్తనమాడిందా? ఇక అక్కడ నుండి జీవితాంతం పాటల పల్లకీలో ప్రయాణిస్తూనే ఉన్నాం కదా! పాటల లోకంలో ఊరేగుతునే ఉన్నాం కదా! మన "అమ్మలు" మనకు పాలు, పాట ఏక కాలంలోనే పరిచయం చేసారు. ఉగ్గుపాలతోనే పాట మన వెంబడి తోడుగా, నీడగా ఇంత కాలం నడిచి వచ్చింది కదా!

నా వరకైతే నా మూడేళ్ల వయసులో మొదటిసారి నేను పాడింది ఒక హిందీ పాట.

*"దేఖ్ తెరి సంసార్ కీ హాలత్*

*క్యా హెూగయీ భగవాన్*

*కిత్ నా బదల్ గయా ఇన్సాన్"*

(1954లో వచ్చిన "నాస్తిక్" అనే హిందీ సిన్మాలోని పాట. దేశ విభజన విషాదాలను ఆ సిన్మా చూపించింది). హీరో అజిత్. మన హైద్రాబాద్, గోల్కొండలో పుట్టి పెరిగిన వాడే.




నా మాతృభాష తెలుగు. మరి హిందీ పాట నా పెదాలపైకి ఎట్లా వచ్చింది? ఇప్పటికీ నేను ఉర్దూ, హిందీ పాటల "షౌకీన్" నే. ఆ పాట నా పెదాలపై ఎట్లా పుట్టిందో చెప్పక తప్పదు.

నేను పుట్టింది హైదరాబాద్ పాతనగరంల కుర్మగూడెం బస్తీ. అలియాబాద్ దర్వాజాకు వెళ్లే తోవల కుడివైపు ఒక చిన్న కమాన్. అందులోకి వెళ్లి తిరిగి ఎడమవైపు మళ్లంగనే కుర్మగూడెం బస్తీ. దాన్ని దాటి సీదా వెళ్లితే గాజీబండ బస్తీ. నేను పుట్టిన బస్తీల కురుమ కుటుంబాలే అధికం. వాడకట్టు మధ్యల పురాతనమైన రావిచెట్టు ఊడలు విస్తరించి ఉండేది. ఆ చెట్టు చుట్టూ సిమెంటు గచ్చుతో చేసిన గుండ్రటి విశాలమైన వేదిక. వటవృక్షపు చల్లని ఛత్రచ్ఛాయల క్రింద "చావిడిలా" ఉండేది. దాని పక్కన అమ్మవారి గుడి. మైసమ్మనో, పోశమ్మనో, ముత్యాలమ్మనో కావచ్చు. కురుమోళ్లు చెప్పే ఒగ్గు కథను మొదటిసారి నేను విన్నది ఆ చావిడి దగ్గరే. ఆ రావిచెట్టు ఎదురుంగనే మా "గరీబ్ ఖానా". నేను ఇంట్ల ఉండేది తక్కువ, బజార్ల ఉండేది ఎక్కువ. ఒగ్గు కథను ఆ కురుమ కళాకారులు డోలు, మేళ తాళాలతో, కాళ్ల గజ్జెలతో దరువులు వేస్తూ లయబద్ధంగా గుండ్రంగా తిరుగుతూ, లంఘించి కుప్పి గంతులు వేస్తుంటే బస్తీమొత్తం దద్దరిల్లి ఆబాలగోపాలం యావత్తూ మంత్రనగరిలోకి మాయమైపోయేవారు. మా చిన్నప్పుడు ఒగ్గు కథని మేం "డిల్లం-బల్లం" అనేవారం.

ఒకసారి ఆషాడమాసంలో బోనాల పండుగ వచ్చింది. జనం జాతర జజ్జనకరి జనారేలా వుంది. రావి చెట్టు కొమ్మకు ఒక లౌడ్ స్పీకర్ (పుంగీ) తగిలించారు. క్రిందనున్న గ్రామ్‌ఫోన్‌తో దానికి కనెక్షన్ ఇచ్చి నల్లని రికార్డు వేసారు. అది గుండ్రంగ తిరుగుతుంటే పుంగీల నుండి పాట ప్రవాహంలా ప్రవహించింది. ఆ పాటనే "దేఖ్ తెరీ సంసార్ కి హాలత్".

ఆ రెండు రోజుల జాతరల ఆ పాట పదే పదే వేసారు. నేను పెద్ద "కాన్ సేన్"ను కదా విని విని ఆ పాట నాకు కంఠోపాఠం అయ్యింది. ఇగ అంతే సంగతులు. చిత్తగించవలెను. ఆ పాట రాగం ఒకటి మాత్రమే పట్టుకుని, అపభ్రంశ పదాలతో ఘోరంగా ఉచ్చరిస్తూ వినని వారికీ, వినే వారికి ఇద్దరికి మాత్రమే "తాన్‌సేన్"లా వినిపించసాగాను. హిందీ భాష తెలిసిన వారిని గాయపరిచేలా పెద్ద గాయకుణ్ణి ఐపోయాను. ఒక రోజు మా పెద్దక్క అత్తారింటి నుండి పుట్టింటికి వచ్చింది నా గానంతో అందరినీ గాయపరుస్తున్నా నన్న వార్త ఆమెకు కూడా తెలిసింది. "ఒరే లోకీ ఆ పాట పాడరా" అని హఠాత్తుగా ఆమె అడగగానే నాకు సిగ్గు ముంచుకొచ్చింది నా నిక్కర్లు కూలబడినయి. నోరు పెగిలి పాట ఇవతలి లోకి రాలేదు. ఆమె మళ్లీ బ్రతిమిలాడింది. నేనింకా నాలోకి నేను ముడుచుక పోయినాను. ఒప్పులకుప్ప, సిగ్గుల మొగ్గ ఐనాను. నా అవస్థ గమనించి ఆమె "పోనీ ఆగోడ చాటుకు పోయి పాడు" అని కనికరించింది. నేను ఒక్క గంతులో గోడ వెనుక దాగి "దేఖ్ తెరి సంసార్ కి హాలత్" అన్న పాటను ఒ దునియా తే రఖ్ వాలే స్థాయిలో గొంతుపెంచి ఏడు కొండలపై నున్న వాడికి కూడా వినబడేలా విజృంభించి పాట కచేరి ప్రారంభించాను.

ఆ తర్వాత కొద్దిరోజులకు జండాపండుగ వచ్చింది. అంటే

"పంద్రాగస్టు" అన్న మాట రావిచెట్టుకు మళ్లీ "పుంగీ" తయార్. నేను జారుతున్న చెడ్డీ పైకి లాక్కుంటూ అమ్మవారి గుడి దగ్గర హాజర్. ఈ సారి తెలుగు పాట.

*"ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా*
*నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా"*
(1955, రోజులు మారాయి సినిమా)

టక్కున పాత పాటను వదిలి ఈ కొత్త పాటను లంకించుకుని మళ్లీ శ్రోతల కర్ణభేరీలను పగుల గొట్టటం ప్రారంభించాను.

ఇంతటితో ఐపోలేదు. ఎండాకాలం బడులకు సెలవులని మా రంగన్న మడికొండ నుండి పట్నం వచ్చాడు. వాడు నా కంటె చాలా పెద్ద. ఒక్క చదువు తప్ప అన్ని కళల్లోనూ, విద్యల్లోనూవాడు ఆరితేరినాడు. వాడు ఆవారా పోరగాడని మా అమ్మా బాపులకు కోపం. వాడితో దోస్తీ చేస్తే నేను కూడా చెడిపోతానని వాళ్ల భయం. నాకేమో వాడంటే చాలా ఇష్టం. గిలేర్‌తో పిట్టలను, ఉడతలను కొట్టటం, బొంగరాలు గిరగిర్రా తిప్పటం, గోలీలు ఆడటంలో (రంగు రంగుల గాజు గోలీలు) వాడు అవ్వల్ దర్జా నంబర్ వన్ ఆ గోలీలల్ల రంగురంగుల పువ్వులు ఎట్లా పెట్టారో అని నా సందేహం. అవి వాడి నిక్కర్ జేబులో ఒకదానికొకటి వొరుసుకుని గలగలా చప్పుడు చేసేవి. వాటిల్లోని రంగులపువ్వుల రహస్యాలు తెలుసుకోవాలని నా కుతూహలం. ఓ రోజు ఒక గోలీని రాయితో పగులకొట్టినం. రంగుల్లేవ్, పువ్వుల్లేవ్ ఉత్తగాజుపొడితప్ప.




దానితో నాకు శంకరాచార్యుల వారి మాయావాదమే కాక విశ్వరహస్యం కూడా బోధపడింది.

వాడు ఆడే గోలీలాట మన రెండు కళ్లతో చూసి తరించవలసిందే. దూరాన ఒక గుంటలో ఒక గోలీని నిలబెట్టి మరికొంత దూరంలో మోకాళ్ల ముడుచు కు కూచుని, కుడి చేతి బొటన వేలు చూపుడు వేలు మధ్యన మరో గోలీని బిగించి పట్టుకుని ఒక కన్ను మూసి ఇంకో కన్ను తెరిచి తీక్షణమైన ఒంటికంటి చూపుతో ఎడమ చేయి చూపుడు వ్రేలుతో ఆ గోలీని బాణంలా విసిరేవాడు. అది గురి తప్పకుండా గుంతలో వున్న గోలీని తాకి టక్కున ఎగర కొట్టేది. వాడు ఆడుతున్నంత సేపు వాడి పెదాలపై ఒక పాట పల్లవిస్తుండేది. వాడున్నన్ని రోజులు ఆ పాటే పాడుతుండేవాడు.

*"గోరే గోరే గాల్ గాల్ పే*
*ఉల్ జే ఉల్ జే బాల్*
*ఓ తెరా క్యా కహెనా"*
(1957, తుమ్ సా నహీ దేఖా సినిమా)


సెలవులు ఐపోగానే వాడు, వాపస్ వెళ్లి పోయాడు. నా గుండె గూడు ఖాళీ అయి దిగులు నిండుకుంది. వాడు ఆడి పాడిన వాకిలిని చూస్తూ అక్కడున్న అరుగులపై ఒక్కడినే ఒంటరిగా, మనాదితో కూచునేవాడిని. ఒక దినం హఠాత్తుగా ఎక్కడ్నుండో రేడియోలో 'గోరే గోరే గాల్ గాల్ పే" గానా వినబడింది. వాడు యాదికొచ్చి మనసంతా పానీ పానీ ఐపోయింది. మా రంగన్న తెగిన గాలి పటంలానే అర్థాయుస్సులోనే మరణించాడు. "గోరే గోరే గాల్ గాల్ పే". ఎప్పుడు విన్నా రంగన్నే నాకు జ్ఞాపకం వస్తాడు.

తర్వాత మేం కుర్మగూడెం ఖాళీచేసి శాలిబండ దగ్గరలోని రూప్‌లాల్ బజార్‌లో ఒక పాత పెంకుటిల్లును కొనుక్కున్నాం. ఆ బస్తీ ఒక మినీ ఇండియా. మా గల్లీలో ముస్లింలు, మరాఠీలు, వెనక దిక్కు కన్నడిగులు, బొందిలీలు, కాయస్తులు, జోషీలే కాక మంగలి, గొల్ల, వడ్రంగి, బ్రాహ్మణ కులాల వారు కూడా ఉండేవారు. ఆ కాలంలో రేడియో కొంతమంది ఇండ్లలోనే ఉండేది. అది ధనికుల వాడుకునే విలాసవంతమైన సాధనం. మా వెనక ఇల్లు జోషీలది. వాళ్ల రేడియోలోని పాటలన్నీ మా మీది దయతో మా ఇంట్లకు మలయ మారుతంలా ప్రవహించేవి.

వారానికోసారి "బినాకా గీత్ మాలా". అమీన్ సయానీ మంద్రమైన, మత్తు గొంతుతో రాత్రిపూట వచ్చేది. మేం చేద బావి ప్రక్కన మల్లె పందిరి క్రింద మంచాలల్ల పడుకుని ఆ పాటలన్నీ వినేది. "జంగ్లీ" సినిమాలో షమ్మీకపూర్ పాట "చాహె కొయి ముజె జంగ్లీ కహే" అని రఫీసాబ్ గొంతు చించుకుని పంచమ స్వరంలో పాడుతుంటే మా మనసులు మానససరోవరంగా మారిపోయేవి. "మేరా జూతా హై జపానీ, ఏ పంట్లోన్ హిందుస్థానీ" పాట అర్థం కాకున్నా ఆ స్వర మాధుర్యానికి, సంగీతానికి "దిల్‌ఖుష్" ఐపోయేది. అప్పటికీ ముఖేష్, శంకర్ జై కిషన్, శైలేంద్రల పేర్లు కూడా తెలియవు. హీరోలే ఆ పాటలన్నీ పాడుతారని నమ్మే అమాయకపు సత్తె కాలం అది.

మా ఇంటి వెనుక యాపచెట్టు పక్కన ఒక బొందిలోళ్ల ఉమ్మడి కుటుంబం ఉండేది. 1857 సిపాయిల తిరుగుబాటు విఫలం కాగానే ఉత్తర భారత దేశపు బుందేల్‌ఖండ్ ప్రజలు ప్రాణాలను అరచేతులల్ల పెట్టుకుని వింధ్యపర్వతాలను దాటి నైజాం రాజ్యంలకు వలస వచ్చారు. వారిలో అత్యధికులు నిజాం కొలువులో సైనికులుగా చేరారు. ఆ ఉమ్మడి కుటుంబంలో అమ్మాయిపెళ్లి కుదిరింది. ఇక ఊరంతా ఒకటే హడావుడి. రాత్రిపూట పెళ్లి. ఆ ఇంటికి ఇంద్రధనస్సు లాంటి రంగులు వేసారు. పండు వెన్నెల్లాంటి పెట్రోమాక్సు లైట్ల వెలుగుల్లో ఇల్లు ఇల్లంతా ధగధగమని చమక్

చమక్ మని మెరిసింది. పిలవని పేరంటంలా నేనక్కడ హాజర్. పెద్ద వెండిప్లేట్‌లో అమర్చిన గాజుగ్లాసులల్ల రంగు రంగుల చల్లని షర్బత్ పానీయాలను అతిథులకు అందిస్తున్నారు. ఆ సేవకులు నాకూ ఓ గ్లాసు ఇచ్చారు. దానిని సేవించిన తర్వాత నాచూపు యాపచెట్టు క్రింద బల్లపీట చుట్టూ మూగిన గుంపు మీదికి మళ్లింది. నేను కూడా వెళ్లి ఆ గుంపులో చొరబడి మెడలు నిక్కించి మిటమిట చూసాను. గ్రామ్‌ఫోన్, దానిపై నల్లని రికార్డు. చెట్టుకొమ్మమీద తెల్లని పుంగీ అంటే లౌడ్‌స్పీకర్. కరెంట్ వైర్ల కనెక్షన్ కూడా ఉంది కాని ఎక్కడో లోపం వల్ల పాట వొస్తలేదు. కుక్క బొమ్మ ఉన్న నల్లటి హెచ్‌ఎంవి రికార్డు ప్లేయర్ గిరగిరా తిరుగుతుంది కాని పాట మాత్రం వొస్త లేదు. అందరూ దానితో కిందా మీదా కుస్తీ పడుతున్నారు. క్యా ఫాయిదా? గానా నహీఁ ఆరా. ఒకాయన దానికి కుంజీ ఇవ్వాలని చెప్పి ఏదో పనిముట్టు దానిలో దూర్చి చెయ్యి, బుజం నొప్పి పుట్టేలా గిరగిరా తిప్పాడు. చెమటలు పట్టాయి కాని పాట మాత్రం రాలేదు. గ్రామ్‌ఫోన్ మూగనోము వ్రతం పట్టినట్టుంది. నాకు విసుగు, నిద్రా ముంచుకొచ్చి ఇంటికి నిరాశగా వెళ్లి ముసుగుతన్ని నిద్రపోయాను.




తెల్లారి నిద్రలేవంగనే పాట, పుంగీ యాదికొచ్చి యాపచెట్టు క్రిందికి ఉరికిన బల్లపీట ఖాళీగా కనబడింది. పుంగీ అట్లనే ఉంది కాని గ్రామ్‌ఫోన్ మాత్రం లేదు. రిపేరు కోసం పట్నం తీసుక పోయింద్రట. కొండంత నిరాశతో నేను బడికి తయారై వెళ్లిపోయిన. బడికి పోయి చదువులల్ల పడంగనే "పుంగీ" సంగతి పాట సంగతి యాది మర్సిన. అన్నం బెల్లుల భీ యాదికి రాలే. ఆఖరీల బడి ఇడిసిపెట్టినంక భీ గుర్తుకు రాకపాయె. గల్లీలల్ల నడుసుకుంట వాడకట్టుకు రాంగనే.....

"ఖోయా ఖోయా చాంద్

ఖులా ఆస్మాన్

ఆఖోఁ మే సారీ రాత్ జాయెగీ

తుమ్ కో భీ కైసే నీంద్ ఆయేగీ"

(1960, కాలాబజార్ సీన్మాలో దేవానంద్ పాట)

అన్న పాట కర్ణానందంగ నా చెవులకు సోకింది. ఆ పుంగీ పుణ్యమా అని ఆ పాట నాలుగు దిక్కులను ఒక్కటిగ చేస్తుంది. నేను ఇంట్లకు పోయి పుస్తకాల బట్ట సంచీని గూట్లె విసిరి కొట్టి మళ్లీ యాపచెట్టు క్రిందికి ఉరికిన. ఇక మళ్లీ వారం దినాల దాకా నా పెదవుల మీద నుండి "ఖోయా ఖోయా చాంద్" పాట పోనే లేదు. ఆ పాట ఇప్పటికీ మనసు నుండి మాసిపోలేదు. చెదిరిపోలేదు.

ఇక 1960ల నా హృదయం రాజ్ కపూర్ కే అంకితం ఐపోయింది. అప్పటికి నా వయస్సు నవవసంతాలు. లేత చిగురాకు వంటి హృదయం ఏది విన్నా ఏది చూసినా రెపరెపలాడే మనసు. ఒకరోజు మా ముగ్గురక్కలు గుసగుసలాడుకుని ముస్తాబులు మొదలు పెట్టారు. నేను నా "జాసూసీపనా"తో విశయం పసిగట్టాను. ముందే వెళ్లి శాలిబండా చెట్టుక్రింద వాళ్లు రిక్షా ఎక్కే రోడ్డు మీద కాపలా కాసాను. ఆఖరికి ముగ్గురు దొంగలు రెడ్‌హాండెడ్‌గా నాకు దొరికారు. నా ఉక్రోషపు ఎర్రటి ముఖాన్ని చూసి వారికి నవ్వు కూడా వచ్చింది. తర్వాత దయ కలిగింది.

అట్లా చార్మినార్ దాటి గుల్జార్ హౌజ్ క్రిష్ణా టాకీసుల రాజ్ కపూర్ సీన్మా "జిస్ దేశ్ మే గంగా బహతీహై" చూసే భాగ్యం అక్కల పుణ్యమా అని నాకు లభించింది. చీకట్లలో మేం తడుముకుంటూ వెళ్లి కుర్చీలల్ల కూచునేసరికే రాజ్ కపూర్ డప్పు కొట్టుకుంట "మేరా నామ్ రాజు" పాట చిన్న తెప్పపై నిలబడి గంగా నదిలో పాడుతున్నాడు. కాశీలోని ఘాట్‌లు, దేవాలయాలు, రిషికేష్ లక్ష్మణ్ జులా, దూరాన హిమాలయాలు కనబడుతున్నాయి. "లవ్ ఎట్ ఫస్ట్ సైట్" నేను రాజ్‌కపూర్ ప్రేమలో పడిపోయాను. ఇప్పటికీ ఇవతలికి రానేలేదు. సీన్మా నుండి ఇంటికి వచ్చినంక ఆ తెల్లారి బియ్యం డబ్బామీది గుండ్రటి రేకుమూతను తీసుకుని దానినే డప్పుగా భావించి చేతులతో కొట్టుకుంట "మేరా నాం రాజు" పాటతో ఇంటిని హోరెత్తించాను. తెల్లపేపర్ ఏది కనబడినా 'హిమలయాలను, గంగానదిని, అందులో పడవను, అందులో నిలబడ్డ మనిషి చేతిలో ఒక గుండ్రటి డప్పును చిత్రించే వాడిని. మరాఠీల ఇంటిల లేదా జోషీల ఇంటి రేడియోలో "జిస్ దేశ్ మే" పాటలు వస్తుంటే హడావుడిగా పరిగెత్తి వారి ఇంటి కిటికీల వద్ద నిలబడి చెవులప్పగించి ఆ పాటలను, ఆ రాగాలను విని ఊహలలో తేలిపోయే వాడిని.

నేను మొదటిసారి కాశీకి వెళ్లినప్పుడు దశాశ్వమేధ్ ఘాట్ మెట్లపై కూచుని గంగానది అలలను చూస్తూ "హమ్ ఉస్ దేశ్ కే వాసీహై, జిస్ దేశ్ మే గంగా బహతీ హై' పాట పెద్దగా తన్మయత్వంతో పాడుకున్నాను. ఆ సీన్మాలో నాయిక పద్మిని "ఓ బసంతీ పావన్ పాగల్' పాట రాతి కొండలపై, బండలపై అద్భుతంగా నృత్యం చేస్తూ పాడుతుంది. క్రింద లోయలో ఏదో ఒక నది ఆమె లాగే వొంపులు తిరుగుతూ పాములా ప్రవహిస్తుంది. ఆ కొండలు, బండలు ఎక్కడుంటాయని, అది ఏం నది అని చాలా మందిని అడిగాను. ఎవరూ చెప్పలేదు. చివరికి బిన్నీ రూబెన్ రాసిన రాజ్‌కపూర్ జీవిత కథ పుస్తకంలో అవి జబల్‌పూర్‌కు దగ్గరలోని "బేడేఘాట్"లో ఉన్న పాలరాతి కొండలనీ, క్రింద

ప్రవహించేది నర్మదానది అని తెలిసింది. 65 సంవత్సరాలు దాటినంక నేను ఆ ప్రాంతానికి వెళ్లి ఆ పాలరాతి బండలపై కూచుని పద్మినిని, రాజ్‌కపూర్‌ను ఆ నృత్య దృశ్యీకరణను గుర్తు చేసుకున్నాను. క్రింద నర్మద ఉధృతంగ పారుతుంది. షూటింగ్ కోసం వారందరూ బస చేసిన గెస్ట్‌హౌజ్‌ను కూడా చూసాను. అప్పుడు ఆ రోజులలో అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేసిన ఒక స్థానిక వృద్ధుడితో మాట్లాడి అతను చెప్పిన ఆ నాటి ముచ్చట్లన్నీ విన్నాను.

“మేరే మన్ కీ గంగా, తేరే మన్‌కీ జమునాకా” పాట దేశాన్ని, పిచ్చిగా ఊపేస్తున్నప్పుడు (1964 సంగం సీన్మా). నేను పదమూడు టీన్ ఏజ్ లోకి ప్రవేశించాను. ఆ పంచరంగుల సీన్మా సుల్తాన్ బజార్ దిల్షాద్ టాకీసులో చూసిన (అదిప్పుడు లేదు) తర్వాత రంగుల లోకాలలోకి ఎగిరి పోవటం మొదలయ్యింది. పెద్ద పెద్ద విమానాల అందం, లండన్, రోమ్, ప్యారిస్, స్విట్జర్లాండ్ నగరాల, ఆల్ప్స్ పర్వతాల సౌందర్యం, నయాగారా జలపాత ఉధృతం నన్ను మంత్రించి మాయచేసాయి. నేలమీద కాలు నిలవకుండా పగటి కలలు కనటం మొదలయ్యాయి. తర్వాత్తర్వాత కాలాలలో ఆ విశ్వనగరాలన్నింటినీ దర్శించి ‘కల నిజమాయెగా’ అని పాడుకున్నాను. రాజ్‌కపూర్‌ను యాది చేసుకున్నాను.




నాకు సిగ్గూ శరమూ అస్సలు లేవని మాపెద్దక్క ద్వారా నాకు మొదటిసారి తెలిసివచ్చింది. అదేల అనగా షమ్మీకపూర్ నటించిన “ఎన్ ఇవినింగ్ ఎన్ ప్యారిస్” (1967) విడుదలైన రోజు నా హెచ్ఎస్‌సి ఫలితాలు వచ్చి నేను అన్ని సబ్జెక్టులలోనూ విజయవంతంగా విఫలమయ్యాను. నేను ఫెయిల్ కావటం ఖాయం అని పరీక్షలు రాయకముందే నాకు తెలుసు కావున చింత ఏల అని శుభ్రంగా ఆ రోజే విడుదలైన ‘ఎన్ ఇవినింగ్ ఇన్ ప్యారిస్”కు క్రిష్ణా టాకీసులో మార్నింగ్ షోకు వెళ్లినాను. ఇంటికి వచ్చాక “నీకు సిగ్గూ శరమూ లేవారా” అన్న మాటల ద్వారా మా పెద్దక్క నాకు జ్ఞానోదయం కలిగించింది. “నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు” టైపు మనిషిని నేను.

“దునియా కీ సైర్ కర్‌లో,
దునియా కీ సైర్ కర్‌లో
దునియా కీ సైర్ కర్ కే
ఇన్సాన్ సే ప్యార్ కర్‌లో”
(1967 అరౌండ్ ది వరల్డ్, సీన్మా పాట).

ఈ పాట పుణ్యమా అని చెడిపోయిన్నో, బాగు పడిన్నో నాకైతె తెలియదు కాని కెనడా, పశ్చిమ యూరపు దేశాలు, లండన్, మధ్య ఆసియా నాలుగు దేశాలు (ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో భాగం) చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండు, బూటాన్ దేశాలను తర్వాత కాలంలో ‘చల్ ఉడ్ జారే పంఛీలా’ పర్యటించాను. అందులో నా “సిల్కురూట్ యాత్ర” శీర్షమాణిక్యంలా నిలిచిపోయింది.

“అయ్యయ్యో చేతిల డబ్బులు పోయేనే
అయ్యయ్యో జేబులు ఖాళీ అయెనే”
(కులగోత్రాలు, 1952)

ఈ పాట ఇప్పుడు, ఈ ఏడుపదులు దాటిన వయస్సులో విన్నా నా పెదవులపై చిర్నవ్వులు చిందుతాయి. మళ్లీ పన్నెండేళ్ల కౌమారదశకు వెళ్లిపోతాను. నవ్వు ఏడుపు కలగలిసి ఏక కాలంలో వస్తాయి. కులగోత్రాలు సీన్మా చూడడటం కోసం నేను పడిన తపన, వేదన కార్చిన కన్నీళ్లు ఒకచిన్న ముచ్చట కాదు. అదేలయనగా....

నా కప్పుడు పదకొండు ఏండ్లు. ఒకరోజు ప్రొద్దున్నే నిద్ర లేచిన కాని పక్క మీద నుండి లేవలేదు. చేదబావి దగ్గర చేసుకుంట అమ్మా బాపు సంతోషంగా మాట్లాడుకుంటున్నారు. కండ్లు మూసుకుని రెండు చెవులూ అటు వైపు అప్పగించాను. చివరాఖరికి తెలిసిందేమనగా క్రితం రాత్రి మేమందరం పిల్లలం నిద్రపోయిన తర్వాత వారిద్దరూ ఆబిడ్స్ దగ్గరున్న సాగర్ టాకీసుకు వెళ్లి (అదిప్పుడు లేదు) ఎన్‌టిఆర్, సావిత్రి నటించిన ‘ఆత్మబంధువు’ సీన్మా చూసొచ్చారని! ఇక అంతే ఒక్కసారిగా నాలో కోపం, ఉక్రోషం, అవమానం, ఆత్మాభిమానం పొంగుకొచ్చాయి. దిగ్గున పక్కమించి లేచి తపతపా అడుగులు నేల మీద కొట్టుకుంటూ వెళ్లి బావి గచ్చుమీద కథాకళి, భరతనాట్యం, శివతాండవం ప్రారంభించాను. “ఇంత మోసమా” మీరిద్దరే టింగురంగా అని దొంగల్లాగ, రహస్యంగ సీన్మాకు పోతరా” అని అరుపులు, కేకలు. హఠాత్తుగా వచ్చిన ఈ తిరుగుబాటుకు వాళ్లిద్దరూ భీరిపోయారు. తుఫానులా విరుచుకుపడేసరికి వారి ఆనందమంతా ఆవిరయ్యిపోయింది. తప్పు చేసినట్లు అపరాధభావంతో ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. జన్మకో శివరాత్రి అన్నట్లు వారిద్దరూ కలిసి సీన్మాలకు పోవటమే చాలా అరుదు. పోకపోక పోయినందుకు, దొంగల్లాగ దొరికిపోయి, బావి దగ్గర “బోనులో ముద్దాయిల్లాగ” నిలబడాల్సి వచ్చింది.

“సరే లేరా నిన్ను కూడ తీసుకపోతంలే అని బాపు లైట్‌గ తీసుకుని మత్పరించబోయిండు”

నేను మొండి ఘటం కదా “ఎప్పుడు?” అని కోర్టు మార్షల్ విచారణ శురూ చేసిన.

"ఎప్పుడంటే ఇప్పుడే ఎట్ల చెప్పను? పైసలు లేవు. జీతాలు రావాలి కదా" అని నీళ్లు నములుకుంట సంజాయిషీ ఇచ్చిండు.

ఒకటో తారీఖు ఎప్పుడని మనస్సులనే లెక్కలేసుకున్న, ఇంకా ఇరవైదినాలని తేలింది.

"అమ్మో ఇంకా ఇరవై దినాలే అంత వరకూ ఎట్లా ఆగాలి." అని నా ఓపలేనితనాన్ని తెలియచేసి "ఎక్కడైనా అప్పు తేరాదా" అని పెద్ద మనిషి తరహాలో సలహా ఇచ్చాను.

"అరేయ్ ఈపు పగుల్తది" అని అమ్మ కలకత్తా కాళిక అవతారంలో రంగంలోకి దిగింది.

ఇక ఆ సుప్రభాత సమయాన దేహశుద్ధి తప్పదని (పూర్వానుభవాలు చాలా వున్నాయి లెండి) ఒకడుగు వెనకకు వేసి రాజీ మార్గం ఆచరించాను.

బొటాబొటా కన్నీళ్లు కారుతుంటే "తొందగర తీస్కపోవాలె" అని ఏడుపు కంఠంతో కీచుగా, దీనంగా అడిగాను.




సర్లే. ముందు పోయి ఆ పాచిపండ్లు తెల్లగ తోముకో అని అమ్మ నిర్దయగ ఒక బోడి సలహా ఇచ్చే సరికి నాకు ఒళ్లు మండి "జీవితాంతం వండ్లే తోముకోను" అని మనసులోపలే శపథం తీసుకున్న. దుఃఖభారంతో తలవంచుకున్న.

ఇదే సందని ఇద్దరూ సడి చప్పుడు చేయకుండా, చల్లగా మనసాలలోకి జారుకున్నారు. దుఃఖంతో వున్న నన్ను ఒంటరిగా వదిలేసి!

"సీన్మా, సీన్మా" అని ఆ దినం నుండి మనాది మొదలయ్యింది. బాకీ కోసం సత్యహరిశ్చంద్రుడిని వెంటాడి వేధించిన నక్షత్రకుడి వలె దొరికినపుడల్లా బాపును పట్టుకుని సీన్మా? సీన్మా? ఎప్పుడు? ఎప్పుడు? అని గుర్తు చేస్తున్న. ఇక ఆయనేమొ పురుసత్‌గ దౌడకు పాన్ పెట్టుకుని నములుకుంట నోరు విప్పితే రసం కారి క్రిందకు జారిపడుతుందన్న భయంతో తలపైకెత్తి "చూద్దాం, చూద్దాం" అని ఒకసారి "పోదాం పోదాం" అని మరోసారి, జేబుల ఒక్క చిల్లిపైస కూడ లేదు అని ఇంకోసారి ఆకుకు అందని, పోకకు పొందని మాటలు మాట్లాడసాగాడు. ఇక నా ఓపిక "బర్దాష్ కే బాహర్" వచ్చేసింది. అమ్మ ఏం పని చెప్పినా సహాయ నిరాకరణం, రాత్రి పూట "బూఖ్ హర్తాల్" (నిరాహార దీక్ష) సాగించిన. మా వాళ్ల కఠినమైన రాతి గుండెల ముందు నా గాంధీగారి అహింసాయుధాలన్నీ ఘోరంగా విఫలమైనాయి. ప్రతిరాత్రి నిండా ముసుగు కప్పుకుని ఎవరికీ కనబడకుండా, వినబడకుండా లోలోపలే ఏడ్చి కన్నీళ్లు కార్చి పక్క దిండు తడిపి ఎప్పుడో నిద్రలోకి జారుకునే వాడిని.

నెల గడిచింది. జీతం వచ్చింది. ఆ నెలల దసుర పండుగ. అందరికీ కొత్త బట్టలు కొనాలె. పై నుండి పండుగ ఖర్చులు. ఎట్లరా దేవుడా అని అమ్మాబాపు తసబిస అవుతున్నరు. అన్నింటినీ గమనిస్తున్న అయినా ధైర్యం చేసి ఒక రోజు "సీన్మా" అన్న అంతే అమ్మ ఖఃయ్యిమని అరిచి పొయ్యిల ఊదుతున్న గొట్టం చేతిల బట్టుకుని నా మీదికి లేసింది. ఒక్క అంగల నేను వంటింట్ల నుండి గంతువేసి మనసాలలకు వచ్చిన ఆమె కూడా నా వెనకే వచ్చింది. అప్పుడు నేను చర్మ సంరక్షణా నిమిత్తమై అర్రలకు చొర్రబడ్డ. ఆమెకు కోపం ఇంకా ఎక్కువయ్యింది. అండ్లకు కూడా రాంగనే నేను మెరుపు వీరుడిలా బావి గచ్చుమీదికి దూకి అక్కడ కూడా ఆగకుండా మల్లెపందిరి కింద నుండి ఉరికి పెద్ద దర్వాజా దాటి వాకిట్లకు ప్రవేశించిన. అయినా ఏం లాభం? అప్పటికే ఊదుడు గొట్టం గాలిలో రామబాణంలా రయ్యఃమని తేలి వచ్చి నా వీపును సాపు చేసింది. సీన్మాసీన్మా అని జిద్దు చేసినందుకు వీపు మీద పెద్ద దద్దు వచ్చింది.

అపుడు నాకు జీవితం మీద విరక్తి ముంచుకొచ్చింది. రెండు రోజుల తర్వాత నేనూ, మా మూడో అక్క అంటే సుశక్క బజారుకు పోతున్నం. మేమిద్దరం జిగ్రీ దోస్తులం. మా మధ్య ఏ రహస్యాలు ఉండకపోయేది. "అక్కా కొంచెం ఆగు" అన్న ఎందిరా లోకి అని ఆగి నా ముఖంల ముఖం పెట్టి చూసింది. "నేను చచ్చిపోతనే" అని భళ్లున ఏడ్చేసిన. అప్పటికే సుశక్కకు నా బాధ నా మనాది తెలుసు.


"వొద్దురా. నవ్వు చచ్చిపోతే నెనెట్ల బ్రతుకుతరా" అని ఆమె కూడా నాకంటె ఎక్కువగా ఎక్కెక్కి ఏడిచింది. ఇద్దరమూ ఒకర్నొకరం పట్టుకుని ఏడ్చేసరికి చేతిల ఉన్న పాలగ్లాసు నేలమీదికి ఒలికి పోయింది.

మరో నాలుగు రోజుల తర్వాత బ్రతుకమ్మ పండుగ వచ్చింది. కొత్త బట్టలు కట్టుకున్నం. గారెలు, పులిహోర, పూరీలు, కోడిమాంసం కడుపునిండా ఆరగించినం. సాయింత్రం "జమ్మి"కి పోయి వచ్చినంక బాపు చిర్నవ్వులు చిందించుకుంట మా పిల్లలందర్నీ దగ్గరికి పిలిసిండు.

ఒసే వెంకటమ్మా (మా రెండవ అక్క) రేపు ఈ పిల్లలందర్నీ మ్యాట్నీ ఆట సీన్మాకు తీసుకపోవే అని అన్నడు.

అందరం "అహా అహా ఒహో ఒహో" అని అర్సుకుంట గంతులేసినం చిందులు తొక్కినం. చిరకాల కోరిక నెరవేరుతుందన్న సంతోషంతో నాకు ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. తెల్లారి మధ్యాహ్నం భోజనాలయినంక మా రెండో అక్క నాయకత్వాన

(అప్పటికే ఆమె టీచర్ ట్రేయినింగ్ చేస్తుంది) నేను, సుశక్క, పెద్ద తమ్ముడు జ్ఞాని కొత్త బట్టలు కట్టుకుని సీన్మాకు బయలు దేరినం. రూప్‌లాల్ బజార్ గల్లీలల్ల నడుసుకుంట శాలిబండ చెట్టు క్రింది రోడ్డుకు వచ్చినం. దీపక్ టాకీస్, నారాయణ గూడాకు ఒక రిక్షా మాట్లాడుకున్నం. సీన్మా కంటె ముందు రిక్షా ప్రయాణమే ఒక అందమైన అనుభవం. రిక్షాలో పురుసత్‌గ చక్లంముక్లం కూచుని రిక్షా వాడి కాళ్ల క్రింద భూమి (సడక్) జర్రుజర్రున జారి వెనుకకు పోతుంటే కళ్లప్పగించి చూస్తూ పట్నాన్ని, దుకాణాలను, వాటి సైన్ బోర్డులను చదువుకుంట, పెద్ద పెద్ద భవంతులను చూడటం చిన్న అనుభవమా? మోఘల్‌పురా దాటంగనే దూరంగ చార్మినార్ నాలుగు చేతులు చాచి మమ్మల్ని, ఆహ్వానించేది. గుల్జార్ హౌజ్, మదీనా హెూటల్ దాటి కొత్త పూల్ ఎక్కేవాళ్లం. వంతెన మీద తెల్లటి గుండ్రటి బల్దియా లైటు బుగ్గలు, క్రింద ముచికుందమ్మ నది, గౌలిగూడల శంకర్‌షేర్ హెూటల్, కోఠీల అప్పుడే కట్టిన కొత్త ఆంధ్రాబ్యాంక్ భవనం, సుల్తాన్ బజార్, బడీ చావిడీల చీరల దుకాణాలు తిలకిస్తూ కాచీగూడ చౌరస్త దాటంగనే కుడివైపు బసంత్ టాకీసు కనబడింది. (అదిప్పుడు లేదు). అక్కడ "సిరి సంపదలు" సీన్మాబోర్డు కనడింది. అది కూడా అక్కలిద్దరికీ ఇష్టమైన అక్కినేని నాగేశ్వరరావు సీన్మానే. ఒక్క నిముషం రిక్షా ఆపి అక్కలిద్దరు చర్చించుకుని దీపక్‌ల "కులగోత్రాలు" సీన్మానే సెలక్టు చేసుకుని రిక్షాను ముందుకు పొమ్మని చెప్పింద్రు. నారాయన్‌గూడ చౌరస్తాల మాడపాటి హన్మంతరావు బాలికల ఉన్నత పాఠశాల దాటి సుదీర్ఘ ప్రయాణం తర్వాత దీపక్ టాకీసు దగ్గర రిక్షా దిగినం.






సీన్మాహాలు ప్రవేశద్వారం వద్దే పెద్ద పెద్ద హెూర్డింగులు నాగేశ్వరరావు, కృష్ణకుమారిల నిలువెత్తు రంగుల బొమ్మలు. ఎంత చూసినా తనివి తీరని పోస్టర్లు. టిక్కట్లు తీసుకుని లోపలికి వెళ్లాం. పేకాట సీన్‌లో రమణారెడ్డి డబ్బులన్నీ పోగొట్టుకుని తలమీద తడిగుడ్డ వేసుకుని పశ్చాత్తాప భారంతో పాట ప్రారంభించాడు. అతడిని ఓదారుస్తూ రేలంగి. మిగతా బృందం వంత పాడారు.

"అయ్యయ్యో చేతిల డబ్బులు పోయెనే
అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే"

పాట రాగానే హాలు మొత్తం నవ్వుల పువ్వుల తోటగా మారింది. నేను నా తమ్ముడు జ్ఞాని నవ్వినవ్వి నొప్పితో కడుపులు చేత బట్టుకున్నాం. నాయికా, నాయకులు చేసిన భాంగ్రా నృత్యం మమ్మల్ని ఉర్రూతలూగించింది. సీన్మాలో హీరో అమ్మ చనిపోయే సీన్ రాగానే మా రెండో అక్క వెంకటమ్మ నేను, జ్ఞాని భయపడతామని తన చేరో చేత్తో మా కండ్లు మూసింది.

ఇంటికి వచ్చాక ఒక వారం పాటు ప్రతి ఒక్కరం సీన్మా ముచ్చట్లు, సీన్మా పాటలే. కాలం గిర్రున తిరిగింది.

మా చిన్నప్పుడు మాకు పుస్తకాలు, పాటలు, సీన్మాలను, లోకాన్ని పరిచయం చేసి ప్రభావితం చేసిన మా వెంకటమ్మ అక్క ఎనభై సం.ల వయసులో కాలం చేసింది. అప్పుడామె హిమాయత్ నగర్‌లో ఉండేది. స్వర్గపురి వాహనంలో మేమందరం ఆమెను అంబర్‌పేటలోని రుద్రభూమికి తీసుకు పోతున్నాం. సరిగ్గా దీపక్ టాకీసు ముందు నుండే! తలెత్తి చూసాను. అది మూతపడి ఉంది. కాని హాలుమాత్రం శిథిలావస్థలో అట్లనే ఉంది. ఆనాటి మా తీపిజ్ఞాపకాలకు గుర్తుగ! గతించిన కాలానికి జ్ఞాపకంగ!!

మృత్యువును చూసి భయపడతం అని ఆ రోజు మా రెండు కండ్లుమూసిన మా అక్క ఇప్పుడు నిర్జీవంగా ఉన్న తనను చూసి మేం బాధ పడతం అని లేచి మా కండ్లు మూయలేదు కదా!

ఆమె దశదిన కర్మనాడు మా సుశక్క మా అందరికీ రెండు రహస్యాలను విప్పి చెప్పింది. ఒకటి : నేను చచ్చిపోతా అని ఏడ్చిన సంగతి ఆమె ఆ రాత్రే మా వెంకటమ్మ అక్కకు చెప్పితే ఆమె దసుర నాడు ఆ సంగతి అమ్మా బాపుకు చెప్పిందట. రెండు : బొగ్గుల బస్తా (వంట కోసం) కోసం దాచిన డబ్బులను బాపు మాకు "కులగోత్రాలు సీన్మా" చూడటానికి ఇచ్చాడట.

ఆ పాత రహస్యాలను విని అందరం కన్నీళ్లు పెట్టుకున్నాం. మేమందరం ఆ రోజు సంతోషంగా సీన్మాహాల్లో "చేతిల డబ్బులు పోయెనే" పాట విని నవ్వుకుంటున్న సమయంలో సరిగ్గా అదే సమయాన ఇంట్లో మా బాపు "అయ్యయ్యో బొగ్గుల డబ్బులు పోయెనే" అని బాధ పడ్డాడా అని నాకు ఇప్పటికీ తీరని సందేహమే!

ఏం చేస్తాం? వెనక్కి తిరిగి చూస్తే వెయ్యి తప్పులు కనబడతాయి.


–పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

ద

# ఆంత్రపోసీన్ యుగంలో వ్యవహార జ్ఞానం

**త**న మూలాలను మరిచిపోయిన యుగంలో మనుషులు ఉన్నారు. అంతే కాదు తమ మనుగడకు అవసరమైన నీరు ఇతర వనరులు మానవాళి గుడ్డితనం, పట్టనితనం వల్ల బాధితమయ్యాయి అని పేర్కొంది. రాచెల్ కార్సన్ తన సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథంలో. ఇటీవలనే మహానగరాలకు సంభవించిన జలవిపత్తు గురించి ఆందోళన పడ్డాం. ముఖ్యంగా బెంగుళూరు లాంటి నగరం ఎదుర్కొన్న తాగునీటి సంక్షోభం గురించి తెలుసుకున్నాం. పర్యావరణానికి సంబంధించిన ప్రతి సమస్య, సంక్షోభం మనది కాదులే, మనకు రాదులే అనే ఉదాసీన వైఖరిని ప్రదర్శించటం అత్యంత ప్రమాదకరం. అంతే కాదు అది పర్యావరణ నేరస్థులుగా మనల్ని చూపుతుంది. లేదా బాధ్యతలేని పౌరులుగా నైనా నిలబెడుతుంది. ఒక్క రాచెల్ మాత్రమే కాదు, పర్యావరణ వేత్తలు చెప్పే ప్రతి మాటా వేయి చెవులతో ఆలకించదగ్గవి. వేల చేతులతో ఆచరణకు పూనుకోవలసినవి.

ఆంత్రపోసీన్ యుగాన్ని ఎదుర్కోవటమెలా? అనే విషయం ఎంతో చర్చ అంతర్జాతీయంగా జరుగుతూ ఉన్నది. ముఖ్యంగా శిలాజ పెట్టుబడి వల్ల భూ వ్యవస్థకు సంభవించిన సంక్షోభాలను తట్టుకుని నిలబడటం, మనగలగటం అనే అంశం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. శిలాజ పెట్టుబడి ఏమిటి అంటే శిలాజ ఇంధనంపై ఆధారపడసాగిన పెట్టుబడి, దాని ద్వారా సాధించిన అభివృద్ధి, ఆ అభివృద్ధి పర్యవసానాలు అన్నీ మనముందు సవాళ్లుగా నిలుస్తున్నాయి.




ఆంత్రపోసీన్ యుగం అంటే మానవ ప్రమేయం, జోక్యం ప్రకృతి విషయంలో పెరిగిన కాలానికి కొలమానం. మనిషి ప్రమేయం పెరగటంతో భూ వ్యవస్థలో వచ్చిన మార్పులు, తెచ్చిపెట్టుకున్న సంక్షోభాలు, వీటిని అధిగమించటం. ముఖ్యంగా మనం ఎంతగానో ప్రేమించి, సమర్థిస్తున్న పెట్టుబడిదారీ విధానికి విప్లవాత్మకమైన ప్రత్యామ్నాయాలను బదులుగా అన్వేషించుకోవటం ఈ నాటి అనివార్యత.

భూమి ఆవిర్భావ చరిత్రను నిర్ణయించే క్రమంలో భూగర్భ శాస్త్రవేత్తలు చేసిన కాల నిర్ణయం ప్రకారం హోలోసీన్ యుగం గడిచిపోయిన తరువాత ప్రవేశించిన కాలాన్ని 'ఆంత్రపోసీన్'గా వ్యవహరిస్తున్నారు. హోలోసీన్ యుగం నుండి విడిపోయాం. ఒక చీలిక లేదా పగులు ఏర్పడింది. దీన్ని 'ఆంత్రపోజెనిక్ రిఫ్ట్' అని పాల్ క్రట్జెన్ తన శాస్త్ర, పర్యావరణ శాస్త్ర చర్చలలో భాగంగా వాడాడు. క్రట్జెన్ ఒక క్లైమెటాలజిస్ట్. భవిష్యత్ భూ వ్యవస్థను ప్రభావితపరిచే మహాశక్తిగా మానవులు రూపుదిద్దుకున్నారనేది ప్రతిపాదన. అయితే ఆంత్రపోసీన్ యుగం ఎప్పుడు మొదలైందనే విషయంగా చర్చ సాగుతూనే ఉంది. 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవ కాలం నుంచి అని చెపుతున్నప్పటికీ 1940,1950లను పేర్కొంటున్నారు. 1950 అనేది మానవాళి పర్యావరణంపై చూపే ప్రభావంతో మహావేగవృద్ధిని పొందిందనేది ఒక వాస్తవం. అణ్వాయుధ పరీక్షల తర్వాత వచ్చిన భూ వ్యవస్థలోని మార్పులు దీనిని సూచిస్తున్నది.

ఆంత్రపోసీన్ అనేవి రెండవ ప్రపంచ యుద్ధానంతరం భూతలంపై జరిపిన అణ్వాయుధ పరీక్షలకు వ్యతిరేకంగా శాస్త్రవేత్తల బృందం జరిపిన ఉద్యమ ప్రారంభం నుంచి కనిపిస్తుందని అంటారు. భూ వ్యవస్థలను భంగపరచకుండా ఉండటం, భగ్నం చేయకుండా ఉండటం అనేది ఆధునిక పర్యావరణ ఉద్యమాలకు వాటి పరివృద్ధికి దోహదపడింది. ఆ తరువాత 1962లో రాచెల్ కార్సన్ తన సైలెంటోస్ప్రింగ్ రచనలో పర్యావరణ ఉద్యమం మరింత ఊపందుకుంది. గ్లోబల్ వార్మింగ్‌కు సంబంధించి ఈ గ్రంథం తొలి హెచ్చరికలను చేసింది. భూతాపాన్ని తగ్గించటం, వెనక్కి మరల్చటం సాధ్యం కాదు కనుక భూతాప వృద్ధికి దోహదపడే పరిస్థితులను కల్పించుకోవద్దనే హెచ్చరిక ఇది. భూ పరిణామ వ్యవస్థలో వచ్చిన చారిత్రక మార్పు దశను గుర్తించటం ఆంత్రపోసీన్ యుగంలో ప్రధానాంశం ప్రకృతి. సమాజాల సంపర్కంలో వచ్చిన, తెచ్చిపెట్టుకున్న అనర్థాలను ఎట్లా సరిచేసుకోవాలనేదే 'ఆంత్రపోసీన్' యుగం అనే చర్చ ఆలోచించవలసి ఉంది. శాస్త్రవేత్తలు, శాస్త్ర సంబంధ అవగాహనను ఎలాగూ కల్పిస్తారు. అయితే మనం గ్రహించాల్సిందేమిటి? మానవులు – పర్యావరణం ముఖాముఖి తలపడుతూ ఉండటంతో

వచ్చిన మార్పులు పెట్టుబడిదారీ వాదంతో తలెత్తినవీ, పారిశ్రామిక విప్లవం, ప్రపంచాన్ని వలసరాజ్యాలుగా విస్తరించటం, శిలాజ ఇంధనాల వాడకం ఒకదానినొకటిగా పెనవేసుకున్నవే.

ప్రకృతి మానవ చరిత్రను నడవటం లేదా శాసించటమో చేసింది. ఇప్పుడు మానవుడు ప్రకృతి, పర్యావరణ, భూవ్యవస్థల చరిత్రను శాసిస్తున్నాడు, ఈ శాపకత్వ స్థితి నుండి మనిషి తప్పుకోవాలి ఉపసంహరించుకోవాలి.



భౌతిక ఆవరణం, ఆ ఆవరణంపై ఆధారపడిన జీవం ఒకటికొకటి పరస్పరాధారితాలు. భూమిపై జీవం ఉద్భవించింది. ప్రాణిత్వాన్ని కలిగించింది భూమి. ఆ జీవం తిరిగి భూ పరిస్థితులను మారుస్తూవస్తున్నది. చర్య, ప్రతిచర్యల చక్రం జీవితానికి ఆవరణ వ్యవస్థల మధ్య తిరుగుతూనే ఉన్నది. అయితే బుద్ధిజీవి, ఆలోచనాశీలి అయిన మనిషి ఎందుకు పదే పదే దాడి చేస్తున్నాడు. భూ చరిత్రను ఎరిగిన ఎవరైనా జీవం, భౌతిక ప్రపంచం విడిగా మనలేవు. మనిషి లేకపోయినా ఆవరణవ్యవస్థ నిలవగలుగుతుంది. అసలు ఆ వ్యవస్థనే అంతం చేసుకుంటే మనిషి నిలబడే చోటేది?

జీవులకు, ఆవరణానికి మధ్య ఒక ఐక్యత, సంబంధం నిరంతరం ఉంటుంది. అట్లా ఉంటుందనే సంగతి మనకు తెలిసిందే. హానికారకమైన పనులు, పదార్థాలూ పర్యావరణంలోకి విడుదల చేయటం వల్ల కాలాంతరంలో అవి మానవాళికి సమస్యలను సృష్టించగలదనే విషయం కూడా తెలిసిందే కదా! ఒకటి వినా రెండవది ఉండదని తెలిసిన తరువాత కూడా మానవ ఆలోచన, ఆచరణ మారాలి ఆంత్రపోసీన్ యుగంలో మనిషి మరింత వివేకవంతంగా విచక్షణాయుతంగా వ్యవహరించాలి. ఆవ్యవహార జ్ఞానమే ఈనాడు మనకు పెరగాల్సింది.

**– డా॥ ఆర్. సీతారామారావు**
m : 9866563519
e: sitametaphor@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ

**– మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300    2 సం॥లకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |

# సాగర అన్వేషణకు సరికొత్తగా...!! @ సముద్రయాన్

మానవాళి యొక్క నేటి అత్యున్నత ప్రగతి ప్రస్థానం వెనుక సముద్రాలు వెలకట్టలేని పాత్ర పోషిస్తున్నాయి. మొత్తం మానవ జనాభాలో మూడింట ఒక వంతు (సుమారు 2.4 బిలియన్ల జనాభా) సముద్ర తీరాలకు 100 కి.మీ.ల లోపే నివసిస్తున్నారు. సముద్రాల ద్వారా సృష్టించబడే వార్షిక సంపద విలువ 2.5 ట్రిలియన్ డాలర్లు. ఇది ప్రపంచంలో 7వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు సమానం. ప్రపంచ ప్రజలకు కావలసిన పోషకాహారం, ఔషధాలు, ఖనిజాలు, సాంప్రదాయేతర ఇంధన వనరులను కూడా సముద్రాలు సమకూరుస్తున్నాయి. విభిన్న దేశాల మధ్య సరుకు రవాణాతో పాటు ఆదేశాల ప్రజల మధ్య సుహృద్భావ సంబంధాలను పెంపొందిస్తూ, వాటి ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించడంలో సముద్రాలు "సూపర్ హైవే"గా తోడ్పడు తున్నాయి. అందుకే 2021-2030 మధ్య కాలాన్ని యుఎన్ఓ సముద్ర విజ్ఞాన దశాబ్దం (Decade of ocean science)గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మనదేశం కూడా సముద్రగర్భాన్ని అమూలాగ్రం శోధించడానికి సముద్రయాన్ (డీప్ ఓషన్ మిషన్) పేరుతో ఓ సరికొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.




**సముద్రయాన్ (డీప్ ఓషన్ మిషన్) అంటే...**

సముద్రగర్భంలో మానవుడు ఇది వరకు చేరని ప్రాంతాలలో నిక్షిప్తమై ఉన్న ఖనిజాలు, విలువైన రాళ్ళు, జీవ మరియు నిర్జీవ అనుఘటకాలను అన్వేషించడానికి భారత ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను సముద్రయాన్ లేదా డీప్ ఓషన్ మిషన్ అంటారు. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్రం 2021లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2021-2026 వరకు మొత్తం 5సం॥రాలకు గానూ ఈ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం 4077 కోట్లు కేటాయించింది. 2021-22 సం॥రాలకు 150 కోట్లు, 2022-23 సం॥రాలకు 650 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మిషన్‌లో భాగంగా ముగ్గురు అక్వానాట్స్ (జలాంతర్గత పరిశోధకులు) దేశీయంగా నిర్మించిన "మత్స్య" అన్న జలాంతర్గామి ద్వారా 6000 మీ॥ లోతు వరకు ప్రయాణిస్తారు. మినిస్ట్రీ ఆఫ్ అర్త్ సైన్సెస్ మరియు భారత అంతరిక్ష పరిశోధనాసంస్థలు ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములుగా ఉన్నాయి.

**సముద్రయాన్ లక్ష్యాలు:**

- సముద్రయాన్ మిషన్‌కు 6 లక్ష్యాలు ఉన్నాయి.

సముద్రంలోని లోతైన ప్రాంతాలలో ఖనిజాల త్రవ్వకానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచడం మరియు మధ్య హిందూ మహాసముద్రంలోని పాలీ మెటాలిక్ నోడ్యూల్స్ అన్న ఖనిజాల త్రవ్వకం కొరకు సైంటిఫిక్ సెన్సార్‌లు, విభిన్న రకాలైన పరికరాలతో కూడిన ముగ్గురు జలాంతర్గత పరిశోధకులను సముద్రగర్భంలో 6000మీ॥ లోతువరకు తీసుకెళ్ళడానికి ఒక మానవసహిత జలాంతర్గామిని అభివృద్ధి పరచడం

- సముద్రాన్ని పలుమార్లు పరిశీలించడం, నమూనాలు రూపొందించుకోవడం ద్వారా భవిష్యత్‌లో సముద్ర వాతావరణ స్థితిగతులను అర్థం చేసుకోవడం, తద్వారా సముద్ర వాతావరణ సేవలను అభివృద్ధి పరచడం.
- లోతైన సముద్రగర్భంలోని జీవవైవిధ్యాన్ని అన్వేషించడం మరియు పరిరక్షించడం కొరకు మెరుగైన, వినూత్న సాంకేతిక ఉపకరణాలను ఆవిష్కరించడం
- మధ్య హిందూ మహాసముద్రంలోని సముద్రపు పాయల వెంబడి బహుళ లోహ హైడ్రో థర్మల్ సల్ఫైడ్స్ వంటి ఖనిజాలు కలిగిన ప్రాంతాలను అన్వేషించడం మరియు గుర్తించడం
- సముద్రం నుండి శక్తి మరియు స్వచ్ఛమైన నీటిని గణనీయంగా వినియోగించుకోవడం.
- ఓషన్ బయాలజీ (Ocean Biology), బ్లూ బయోటెక్నాలజీ (Blue Biotechnology) నందు ప్రతిభను ప్రోత్సహించడం మరియు సరికొత్త అవకాశాలను అన్వేషించేందుకు ఒక అధునాతన మెరైన్ స్టేషన్‌ను స్థాపించడం

**మత్స్య-6000అంటే ఏమిటి:**

- సముద్రయాన్ (డీప్ ఓషన్ మిషన్) అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం యొక్క మేళవింపుతో కూడిన ఒక అధునాతన ప్రాజెక్ట్. ఇందులో వినియోగించే మత్స్య-6000 అన్న జలాంతర్గామే అందుకు నిదర్శనం.
- మత్స్య-6000 అనేది సముద్రయాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా

సముద్రగర్భంలో 6000 మీ॥ లోతుకు వెళ్ళేందుకు వీలుగా తయారుచేయబడిన ఒక స్వదేశీ నిర్మిత జలాంతర్గామి. ఇది ముగ్గురు భారత జలాంతర్గత పరిశోధకులను (అక్వానాట్స్) ను 6000 మీ॥లోతుకు తీసుకువెళ్తుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ల సంయుక్త భాగస్వామ్యంతో మత్స్య-6000 నిర్మించబడింది.

- సముద్రగర్భంలోని విభిన్న ప్రదేశాలను పరిశీలించేందుకు, నమూనాలు సేకరించేందుకు, అక్కడి ప్రదేశాలను వీడియో మరియు ఆడియో రూపంలో రికార్డు చేసేందుకు, ప్రయోగాలు నిర్వహించేందుకు అవసరమైన అధునాతన సైంటిఫిక్ ఉపకరణాలు మత్స్య-6000లో అమర్చబడి ఉంటాయి.



మత్స్య -6000 2.1 మీ॥ వ్యాసంతో, గోళాకృతిలో ఉంటుంది. ఈ ప్రత్యేకమైన గోళంలో ముందే చెప్పుకున్నట్లు ముగ్గురు భారత జలాంతర్గత పరిశోధకులు ప్రయాణించేందుకు వీలుగా వసతిసౌకర్యాలు ఉంటాయి. ఈ ప్రత్యేకగోళం సుమారు 28 టన్నుల బరువు ఉంటుంది. ఈ గోళంలోకి ఆక్సిజన్ సరఫరా చేయబడి, అందులోని కార్బన్డై ఆక్సైడ్ వెలుపలికి పంపించే ఏర్పాట్లు ఉంటాయి. టైటానియం లోహ మిశ్రమంతో ఈ ప్రత్యేక గోళం 6000 బార్ల వరకు నీటిలోపలి ఒత్తిడిని తట్టుకోగలుగుతుంది. ఆరుదిశలలో కదలికలను ప్రదర్శించేందుకు వీలుగా ప్రొపెల్లర్లను కలిగి ఉంటుంది. ఈ గోళం యొక్క పరిసరాలను అందులోని సిబ్బంది రియల్టైమ్లో పరిశీలించేందుకుగాను 3 వీక్షణ ద్వారాలను కలిగి ఉంటుంది. ఇందులో 12 కెమెరాలు, 16 లైట్లు ఉంటాయి. లిథియం పాలిమర్ బ్యాటరీల ద్వారా వీటికి కావలసిన శక్తి అందించబడుతుంది. ఈ బ్యాటరీల సామర్థ్యం 1 KWH ఉంటుంది. ధ్వని ఆధారిత ఫోన్ మరియు మోడెమ్ ఇందులో ఉండడం వల్ల సమాచార ప్రసారం ధ్వని ఆధారంగానే జరుగుతుంది. అత్యాధునిక నావిగేషన్ పరికరాలు ఇందులో ఉంటాయి. దీని పొడవు 9 మీ॥, వెడల్పు 3 మీ॥, ఎత్తు 5 మీ॥ ఉంటుంది. నీటి అడుగున థ్రస్టర్లను ఉపయోగించి గంటకు 5.5 కి.మీ. వేగంతో కదులుతుంది. ప్రారంభదశలో అనగా రాబోయే సం॥లో మత్స్య-6000 ద్వారా 500 మీ॥ లోతులో ప్రయోగాలు, పరీక్షలు నిర్వహిస్తారు. తదుపరి రాబోయే రెండు, మూడు సం॥రాలలో



*మత్స్య -6000 లోపలి భాగంలో ఆక్వానాట్స్*

పూర్తిస్థాయిలో అనగా 6000 మీ॥లోతులో ప్రయోగాలు నిర్వహించడం జరుగుతుంది. మత్స్య 6000 ఏకధాటిగా 12 గం॥ల పాటు నీటి అడుగున విధులు నిర్వర్తించగలదు. అత్యవసర పరిస్థితుల్లో ఇది 96 గం॥లకు కూడా పొడిగించబడుతుంది. లోతైన సముద్రజలాల్లో ఇలాంటి మిషన్లను నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇప్పటికే యుఎస్ఏ, రష్యా, చైనా, ఫ్రాన్స్ మరియు జపాన్ సొంతం చేసుకోగా ఆత్మ నిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఇండియా కూడా ఈ సాంకేతికతను అభివృద్ధి చేసి ఆయాదేశాల సరసన చేరేందుకు సిద్ధంగా ఉంది.

**వరాహ అంటే ఏమిటి?**

సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా మనదేశం సొంతంగా అభివృద్ధి చేసిన స్వీయ చోదక, ట్రాకింగ్ ఆధారంగా సముద్రం అడుగున మైనింగ్ చేయు వ్యవస్థను 'వరాహ' అని పిలుస్తారు. ఇది ఫ్లెక్సిబుల్ రైజర్ టెక్నిక్ (Flexible riser technique) ద్వారా నిర్వహించబడుతుంది. హై స్ట్రెంత్ ఫ్లెక్సిబుల్ కోర్డ్ సిస్టమ్ (High strenght flexible cord system) ను ఉపయోగించి ఈ మైనింగ్ వాహనం సముద్ర పైభాగాన ఉన్న నౌక నుండి, సముద్ర అడుగుభాగానికి పంపబడుతుంది. సముద్ర అడుగు భాగానికి మైనింగ్ వాహనం చేరిన తరువాత, సముద్ర పైభాగంలో నౌక కదలికలకు అనుగణంగా ఇది కూడా కదులుతుంది. ముందే సర్వే చేసిన ఖనిజాలు అధికంగా ఉండే ప్రాంతంలో వరాహను నిలపడం జరుగుతుంది. సముద్ర అడుగుభాగంలో, విలువైన పాలీ మెటాలిక్ నోడ్యూల్స్ ఖనిజాలను వెలికితీసేందుకుగానూ వరాహ అధికశక్తి పీడన పంపు వ్యవస్థ (High power pressure pump system)ను వినియోగిస్తుంది. తద్వారా ఈ విలువైన నిజాలు సముద్ర అడుగుభాగం నుండి ఉపరితల నౌకకు పంప్ చేయబడతాయి.

గత సం॥రం మధ్య హిందూ మహాసముద్రంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (NIOT) 5270 మీ॥లోతులో వరాహ యొక్క లోతైన సముద్ర లోకో మోషన్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. 2.5 గం॥ల వ్యవధిలో ఉపరితల నౌక, వరాహతో కలిసి 120 మీ॥ దూరం ప్రయాణించింది. ఇది ఖనిజాల కోసం సముద్ర అడుగు భాగాన్ని అన్వేషించే మైనింగ్ మిషన్ల విన్యాసాలలో ప్రపంచంలోనే అత్యంత లోతైన విన్యాసంగా గుర్తింపు పొందింది.

వరాహ తన పనితీరును పరీక్షించే సమయంలో అది విజయవంతంగా పాలీమెటాలిక్ నోడ్యూల్స్ సముద్ర అడుగుభాగం నుండి సేకరించింది. ఇలా సేకరించే సమయంలో పర్యావరణంపై పడే ప్రభావాన్ని మదింపు చేసి ఆ నివేదిక అంతర్జాతీయ పరిశీలకులకు సమర్పించడం జరిగింది. తద్వారా మొదటిదశను విజయవంతంగా పూర్తి చేసింది. ఖనిజాల వెలికితీతలో భాగంగా రెండవ దశలో వరాహ ఇంకా ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా మన మైనింగ్ సిస్టమ్ అయిన వరాహ ఒక శక్తివంతమైన క్రషర్‌ని ఉపయోగించి సముద్ర అడుగుభాగంలో సముద్రపు నీటిలో పాలీ మెటాలిక్ నోడ్యూల్స్ కలపడం ద్వారా ఒక చిక్కటి ద్రవాన్ని (Slurry) తయారు చేయాలి. అప్పుడు ఆ చిక్కటి ఖనిజ ద్రవం ఒక రైజర్ (riser) ద్వారా (5000–6000మీ॥ల) పై భాగంలో ఉండే సముద్ర ఉపరితలానికి పంప్ చేయబడుతుంది. ఈ పనులన్నింటినీ చేయడానికి వరాహకు గంటకు 1 మెగావాట్ విద్యుత్, ఉపరితల నౌక నుండి సరఫరా చేయబడుతుంది. పంపింగ్ చాలా శక్తి వంతంగా ఉండాలి. ఖనిజాలను వెలికితీయడానికి స్లర్రీ (Slurry)ని సముద్ర పైభాగానికి రవాణా చేయాలి. ఈ విధంగా వరాహ విషయంలో భారత శాస్త్రజ్ఞులు సమగ్రంగా, నిశితంగా, పనిచేస్తున్నారు. పురోగతి ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే ఇంటర్నేషనల్ సీబెడ్ ఆథారిటీ (ISA) చైనా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా, దక్షిణకొరియాలతో పాటు ఇండియాకు కూడా డీప్ ఓషన్ మైనింగ్ కొరకు అనుమతినిచ్చింది.

### సముద్రయాన్ ప్రాధాన్యత:

భూగోళాన్ని 70% సముద్రాలు ఆవరించి ఉన్నాయి. ఈ సముద్రాలలో అనేకరకాలైన వనరులు పుష్కలంగా ఉన్నాయని శాస్త్ర వేత్తల అంచనా. అయితే ఈ సముద్రాలు ఆవరించి ఉన్న జలభాగంలో 95 శాతం వరకు వనరుల కోసం ఎలాంటి అన్వేషణా జరగలేదు. ఈ లోటును పూరించేందుకు భారత ప్రభుత్వం బ్లూ ఎకనామిక్ ఇనిషి యేటివ్‌ను తీసుకొచ్చింది. సముద్రయాన్ ప్రాజెక్ట్ వల్ల బ్లూ ఎకనామిక్ ఇనిషియేటివ్‌కు పూర్తిస్థాయి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది.

లోతైన సముద్ర అడుగుభాగాలలో వనరుల అన్వేషణ కొరకు తగు నియమనిబంధనలు రూపొందించడానికి ఐక్యరాజ్యసమితి తన నేతృత్వంలో ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ (ISA) అన్న సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా దేశాలకు సముద్ర అడుగు భాగాల్లో వనరుల అన్వేషణకు గాను లైసెన్స్‌లు మంజూరు చేస్తుంది. భారతదేశానికి ఈ సంస్థ 75 వేల చ॥ కి॥ల విస్తీర్ణంలో హిందూ మహా సముద్రంలో 15 సం॥రాల పాటు మైనింగ్ చేసేందుకు వీలుగా లైసెన్స్ మంజూరు చేయడంతో పాటు ఒక ఒప్పందం కూడా కుదుర్చుకొంది. ఈ ఒప్పందం కింద హిందూ మహా సముద్రం యొక్క లోతైన ప్రాంతాల్లోని పాలీమెటాలిక్ నోడ్యూల్స్‌ను వెలికి తీసే అవకాశం ఇండియాకు లభిస్తుంది. మధ్యహిందూ మహాసముద్రం యొక్క పరీవాహక ప్రాంతంలో 380 మిలియన్ మెట్రిక్ టన్నుల మాంగనీస్, కోబాల్ట్, ఐరన్, లెడ్, జింక్ మరియు కాపర్‌లతో కూడి పాలీ మెటాలిన్ నోడ్యూల్స్ ఉన్నాయని ఒక ప్రాథమిక అంచనా. వీటి విలువ సుమారు 110 బిలియన్ డాలర్లు. సముద్రయాన్ ప్రాజెక్ట్ ద్వారా వీటిని వెలికి తీయగలిగితే భారత ఆర్థిక వ్యవస్థకు గొప్ప ఊతం లభిస్తుంది.

### సముద్రయాన్ ప్రాజెక్ట్ వల్ల కలిగే ప్రయోజనాలు

భారతదేశం అధిక జనాభా కలిగిన అభివృద్ధి చెందుతూ ఉన్న దేశం. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించాల్సి ఉంటుంది. సముద్రయాన్ ప్రాజెక్ట్ వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి తగుతోడ్పాటు అందించే అవకాశం ఉంది.

### అరుదైన భూగర్భ లోహాల వెలికితీత:

సముద్రయాన్ ప్రాజెక్ట్ ద్వారా బ్యాటరీలు, సోలార్ ప్యానెల్స్, స్మార్ట్‌ఫోన్స్ మరియు ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వినియోగించే కాపర్, కోబాల్ట్, లిథియం, నికెల్ లాంటి అరుదైన లోహాలను వెలికి తీసే అవకాశం ఉంది. తద్వారా భారతదేశం ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది.

### టైడల్ ఎనర్జీని వినియోగించుకోవడం :

- సముద్రయాన్ ప్రాజెక్ట్ ద్వారా అలలశక్తిని వినియోగించుకొని వనరుల అన్వేషణ చేపట్టవచ్చు. ఈ ప్రక్రియ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఇంధన వనరులను వినియోగించు కోవడానికి దోహదం చేస్తుంది.
- భూకంపం మరియు సునామీ ముందస్తు హెచ్చరికల వ్యవస్థను అభివృద్ధి పరచడం.
- సముద్రయాన్ మిషన్ ద్వారా జరిగే సాగర మధనం వల్ల భూకంపాలు మరియు సునామీలను ముందస్తుగా అంచనావేసే పరిజ్ఞానం మరింత మెరుగవుతుంది. తద్వారా ముందస్తు హెచ్చరిక వ్యవస్థల సంసిద్ధతను మరింత కట్టుదిట్టం చేయవచ్చు.

### కొత్త వనరులను కనుగొనడం:

వైద్యరంగానికి సంబంధించిన సరికొత్త ఔషధాలు, ఆహారం మరియు ఇతర విలువైన ఉత్పత్తులకు సంబంధించిన కొత్త వనరులను ఈ మిషన్ ద్వారా కనుగొనవచ్చు. ఇది మనదేశంలోని వనరుల యొక్క ఆధార సామర్థ్యాన్ని విస్తరిస్తుంది.

### ప్రభావంతమైన పరిశోధన మరియు శ్రామిక శక్తి అభివృద్ధి:

- ఈ మిషన్ ద్వారా ఖనిజ వనరులను గుర్తించడంతో పాటు, వాటిని వెలికితీయడం కోసం మెరుగైన సాంకేతికత అభివృద్ధి చేయబడుతుంది. తద్వారా గనుల రంగంలో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించి శ్రామిక శక్తి అభివృద్ధి చెందుతుంది. మరియు అత్యున్నత స్థాయి పరిశోధన సౌకర్యాలు అందు బాటులోకి వస్తాయి.
- మనదేశం యొక్క సముద్ర పరిశోధనా స్థాయిని బలోపేతం చేయడం
- సముద్రయాన్‌మిషన్ సముద్ర పరిశోధనలో భారతదేశ స్థాయిని మెరుగుపరుస్తుంది. దాని సామర్థ్యాలను మరియు నైపుణ్యాలను మరింత పెంచుతుంది.



పసిఫిక్ మహాసముద్రంలో లభించిన
పాలి మెటాలిక్ నోద్యూల్స్

### పాలీమెటాలిక్ నోద్యూల్స్ అంటే

పాలీ మెటాలిక్ నోద్యూల్స్‌నే లేదా PMN లేదా రేర్ ఎర్త్ మెటల్స్ (అరుదైన భూగర్భ ఖనిజాలు) అని అంటారు. ఇవి బంగారం, వెండి మరియు జింక్ లాంటి విలువైన ఖనిజాలకు గొప్ప వనరు (Great Source)గా పరిగణింప బడుతున్నాయి. 19వ శతాబ్దం చివరి భాగంలో అట్లాంటిక్ మహాసముద్రంలో అంతర్భాగమైన కారా సముద్రంలో ఇవి కనుగొనబడ్డాయి.

### పీఎంఎన్‌లకు సంబంధించి మరికొన్ని వాస్తవాలు:

- పాలీమెటాలిక్ నోద్యూల్స్‌నే మాంగనీస్ నోద్యూల్స్ అని కూడా అంటారు. ఇవి భూకేంద్రం చుట్టూ ఇనుము మరియు మాంగనీస్ హైడ్రాక్సైడ్‌ల కేంద్రీకృత పొరలతో ఏర్పడిన రాతి సాంద్రత నిక్షేపాలు
- ఇవి బంగాళాదుంప ఆకారంలో, మధ్యలో రంధ్రాలను కలిగి ఉంటాయి.
- ఇవి 20 సెం॥మీ పరిమాణంలో ఉండే గుళికలకు అతుక్కొని సూక్ష్మదర్శిని కింద మాత్రమే కనిపించే అతి సూక్ష్మకణాలు.
- ఇవి సముద్ర అడుగు భాగంలో ఏ లోతుల్లోనైనా లభిస్తాయి. అయితే ప్రధానంగా 4000-6000 మీ॥ల మధ్య వీటి నిక్షేపాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటాయి.

### సముద్రయాన్ వల్ల పర్యావరణంపై పడే ప్రభావం:

- తక్కువ ఆక్సిజన్, తక్కువ సూర్యరశ్మి, అధిక పీడనం మరియు శీతల ఉష్ణోగ్రతలతో కఠినమైన వాతావరణంలో జీవించడానికి పరిణామం చెందిన ప్రత్యేకమైన జీవజాలం లోతైన సముద్రంలో కనిపిస్తాయి. తగుజాగ్రత్తలు తీసుకోకుండా సముద్రపులోతైన ప్రాంతాలలో మైనింగ్ నిర్వహించినట్లయితే ఈ జీవుల యొక్క సమతాస్థితి దెబ్బతినవచ్చు. లేదా వీటి ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చు.
- సముద్రం యొక్క లోతైన అడుగుభాగంలో వివిధ రకాల జంతుజాలం సహజ వాతావరణంలో నివసిస్తూ ఉంటుంది. ఈ ప్రాంతంలో నౌకల సంచారం పెరగడం, వాటి నుండి వెలువడే రసాయనాలు, లీకైన పెట్రోలియం తెట్టు మరియు నీరు, ధ్వని మరియు కాంతి కాలుష్యం వల్ల అవి సహజంగా జీవించే సామర్థ్యానికి హాని కలుగుతుంది.
- లోతైన సముద్ర ప్రాంతంలోని జీవవైవిధ్యం గురించి తక్కువ అన్వేషణ జరిగింది. మానవాళికి దీని గురించి పరిమిత స్థాయిలో మాత్రమే అవగాహన ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పర్యావరణ ప్రభావ మదింపును నిర్వహించడంలోనూ, దానికి తగు మార్గదర్శకాలు రూపొందించడంలోనూ సవాళ్ళు ఎదురుకావచ్చు.
- సముద్రంలో లోతైన ప్రాంతాలకు పరిమితమైన హానికర మూలకాలు సముద్ర ఉపరితలానికి చేరవచ్చు. తద్వారా అత్యున్నత నీటి పొరలలోని వడపోత సామర్థ్యానికి హాని కలిగించవచ్చు. అంతేకాకుండా అవి ఉత్పత్తి చేసే అవక్షేప ధూళి వల్ల నీటి కాలుష్యం జరుగుతుందేమోనన్న ఆందోళనలు ఉన్నాయి.

### సవాళ్ళు :

- సముద్ర అగాధాల్లో అత్యధిక పీడనం ఉంటుంది. ఈ పీడనాన్ని తట్టుకొని మనగలిగే విధంగా ఉపకరణాలు తయారు చేయడం కష్టసాధ్యమైనది.
- బురదతో కూడిన మెత్తగా ఉన్న సముద్ర అడుగు భాగంలో వాహక నౌకలను నిలపడం (ల్యాండ్ చేయించడం) సంక్లిష్టమైన విషయం.
- లోతైన ప్రాంతాల్లోని ఖనిజ వనరులను వెలికి తీయడానికి ఎలాంటి అవాంతరాలు లేని విద్యుత్ శక్తి మరియు ఇంధన వనరులు సమకూర్చడం కత్తిమీద సామేనని కొంతమంది నిపుణులు వ్యాఖ్యా నిస్తున్నారు.
- సహజ కాంతితో దృశ్య తీక్షణత తక్కువగా ఉండడం వల్ల సముద్రం అడుగు భాగానికి కొన్ని మీ॥ల లోతు వరకే వెళ్ళగలం.
- సముద్ర అడుగు భాగానికి వెళ్ళే కొద్దీ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు, తుప్పుపట్టడం కారణంగా లోహక్షయం పెరగడం, అధిక గాఢతతో కూడిన లవణీయత లాంటి సవాళ్ళు మరింత ఉధృతమవుతాయి. వాటిని ఎలా పరిష్కరిస్తారన్న విషయంపైన స్పష్టత లేదు.

### చివరిగా:

ఎలక్ట్రానిక్స్ రంగంలో విరివిగా వినియోగించే లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి లోహాల తవ్వకం, శుద్ధి, ఎగుమతుల్లో చైనాదే అగ్రస్థానం. డ్రాగన్ గుత్తాధిపత్యాన్ని ఎదుర్కోవడానికి సముద్రయాన్ ప్రాజెక్ట్ భారత్‌కు ఎంతో ప్రయోజనకారి అవుతుంది. సముద్రగర్భ అన్వేషణకు ప్రభుత్వ సంస్థలతో పాటు, ప్రైవేటు కంపెనీలకు కూడా ఆహ్వానం పలకాలి. ఇదే సమయంలో సముద్రగర్భ అన్వేషణ వల్ల జరిగే పర్యావరణ నష్టాలను జాగ్రత్తగా మదింపు చేసి, సముద్ర జీవజాలానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లయితే సముద్రయాన్ ప్రాజెక్ట్ భారత ఆర్థిక వ్యవస్థకు ఒక చోదక శక్తి కాగలదనడంలో ఎలాంటి సందేహం లేదు.

-పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప
m : 9550290047
e : obu.jmd@gmail.com

# సర్వీస్ కమిషన్లు – తప్పిదాలు

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రూప్ 1 పరీక్షలను టీఎస్‌పీఎస్‌సీ ద్వారా జూన్ నెలలో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రిక్రూట్‌మెంట్ ఇంతకు ముందు వివాదానికి గురై, హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు అయిన విషయం పాఠకులకు తెలిసిందే. గతంలో కూడా ఉమ్మడి రాష్ట్ర సర్వీస్ కమిషన్‌లో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. దీంతో వాటి కూర్పు, పనితీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశం మన సమాజానికి సామాజిక మూలధనాన్ని ఏర్పరిచే యువత ఆశలు, ఆకాంక్షలకు సంబంధించింది. కాబట్టి సమస్యను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

యూనియన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్లకు మూలాలు రాజ్యాంగంలోని 315-323 ఆర్టికల్స్‌లో ఉన్నాయి. ప్రభుత్వం సంకల్పించిన అభివృద్ధి, సంక్షేమ ఎజెండాను రూపుదిద్దడానికి, అందించడానికి పారదర్శక పద్ధతిలో ప్రతిభా వంతులైన యువతను ప్రజా సేవ కోసం ఉపయోగించుకోవడం కోసం అటువంటి ఏజెన్సీని ఏర్పాటు చేయాలనుకోవడమే దీనికి కారణం. ఉద్యోగ ఆవశ్యకతలతో సరితూగే అభ్యర్థులతో వాటిని భర్తీ చేసేందుకు తగిన పరీక్షా విధానం ద్వారా పబ్లిక్ సర్వీసెస్ కోసం దరఖాస్తుదారులు ఎంపిక అవుతారు. దీని ప్రకారం పరీక్షల స్కీమ్ లను ప్రభుత్వం రూపొందిస్తుంది. అవి సర్వీస్ కమిషన్ ద్వారా అమలు చేయబడుతాయి. ఇటీవలి కాలంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రిక్రూట్‌మెంట్ చేయదల్చిన ఉద్యోగాల ప్రయోజనం లేదా అవసరాన్ని తీర్చ లేని విధంగా స్కీమ్ లను సవరిస్తున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్ర గ్రూప్ II పరీక్ష స్కీమ్‌లో దరఖాస్తు దారుల రాత సామర్థ్యాలను పరీక్షించే వివరణాత్మక ప్రశ్నలకు సంబంధించిన పరీక్ష (లు) లేదు(వు). వివిధ విభాగాలలో ఈ ఉద్యోగాలకు రిక్రూట్ అయ్యే వ్యక్తులు పాక్షిక-న్యాయ విధులను నిర్వర్తించాలి. కార్యనిర్వాహక ఉత్తర్వులను ఆమోదించాలి. అందుకు రాత నైపుణ్యాలు అవసరం.

అటువంటి నైపుణ్యం అభ్యర్థులకు ఉందో లేదో పరీక్షించడం లేదు. అలాంటి ఆవశ్యకతను పరీక్షించకుండానే నియామకం చేయడం భవిష్యత్‌లో పాలనాపరమైన లొసుగులకు దారి తీసే వీలు కల్పిస్తుంది. అదేవిధంగా, గ్రూప్ I పరీక్ష నోటిఫికేషన్ చూసినట్లుగా, పరీక్షా స్కీమ్‌లో ఇంటర్వ్యూ ఒక భాగంగా లేదు. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ గత ప్రభుత్వం ఇంటర్వ్యూలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కొన్ని విధులను నిర్వర్తించ డానికి సభ్యులను ఎంపిక చేసి నియమించే ప్రభుత్వం వారిపై విశ్వాసం ఉంచకపోవడమే కాకుండా వారి చిత్త శుద్ధిని శంకించడం ఇక్కడ గమనార్హం! రాష్ట్ర స్థాయి పరీక్షల కోసం ఇంటర్వ్యూను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం వారి (సభ్యుల) అర్హతలు, యోగ్యతను ప్రశ్నిస్తూ రాష్ట్ర హైకోర్టులో దాఖలైన కేసు నేపథ్యంలో కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రతిభావంత యువతను ప్రజాసేవలో శ్రేష్ఠమైన విధుల కోసం నియమించాలని ఉద్దేశించిన రాజ్యాంగ సంస్థలోని సభ్యులను యోగ్యత, అర్హత లేని సాధారణ పద్ధతిలో ఎంపిక చేస్తున్నారని అనడం ఓ రాజ్యాంగ సంస్థతో వ్యవహరించే తీరుపై విచారకరమైన వ్యాఖ్యానం.

సాధారణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కు సంబంధించిన పరీక్ష స్కీమ్, సిలబస్ విషయానికొస్తే, ఇప్పటికే ఉన్న దాన్ని నేటి కాలానికి అనుగుణంగా ఉండేలా పునఃసమీక్షించడం, పునరుద్ధరించడం అత్యవసరం. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధత కోసం దరఖాస్తుదారుల వనరుల సద్వినియోగాన్ని గరిష్ఠం చేయడానికి, ఎంపిక అవకా శాలను పెంచే ఉద్దేశ్యంతో దీనిని యూపీఎస్సీకి బాగా అనుగుణంగా ఉండేలా చేయాలని కమి షన్ ఏర్పాటు చేసిన ఒక కమిటీ సిఫార్సు చేసింది. ఈ నివేదిక కూడా మిగితా అన్ని సిఫారసుల మాదిరిగానే ఏ బీరువాలోనైనా బయటకు రాకుండా భద్రంగా మూలుగుతుండవచ్చు.

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రారంభం నుంచి కూడా సిబ్బంది కొరత వేధిస్తోంది. దాని సామర్థ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడానికి బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు. గ్రూప్ I పేపర్ లీక్ దురదృష్టకర ఎపిసోడ్ దీని బలహీనతలను బహిర్గతం చేసింది. సిబ్బంది, పర్యవేక్షక ఉద్యోగుల పాత్రలు, బాధ్యతల గురించి ప్రశ్నలను లేవనెత్తింది. తనిఖీలు, విజిలెన్స్ అనేవి లేకుండా నమ్మకం ఆధారంగానే పనులు కొనసాగాయి.

కమిషన్ ఆర్థిక స్వయంప్రతిపత్తి గురించి పెద్దగా చెప్పాల్సింది ఏమీ లేదు. అది ప్రభుత్వ శాఖ హోదాకు తగ్గించబడింది. ప్రతీ చిన్న విషయానికి కమిషన్ ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. చిన్న పని కావాలంటే కూడా ప్రభుత్వ యంత్రాంగంతో రకరకాలుగా సంప్రదించాల్సి వస్తోంది. అలాంటప్పుడు అంతిమ ఫలితాలు ఎలా ఉంటాయో ఎవరైనా సులభంగా ఊహించుకోవచ్చు.




చాలా కాలంగా రిక్రూట్‌మెంట్ క్యాలెండర్ కోసం ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇస్తున్న హామీలు అమలు కావడం లేదు.

రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ కోసం రిక్రూట్‌మెంట్‌తో పాటు, వివిధ సాంకేతిక సేవల కోసం కూడా సిబ్బందిని కమిషన్ నియమిస్తుంది. అయితే అటువంటి ఉద్యోగాల కోసం సిబ్బందిని నియమించుకోవడానికి ప్రత్యేక బోర్డులు, ఏజెన్సీలను ఏర్పాటు చేసే ధోరణి ఇటీవలి కాలంలో పెరుగుతోంది. చాలా కాలంగా పోలీస్ డిపార్ట్ మెంట్ సిబ్బందిని, అధికారులను నియమించడానికి తన స్వంత బోర్డుని కలిగి ఉంది.

వైద్య నిపుణుల కోసం లేదంటే కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో విద్యావేత్తల కోసం కోసం వాటి సొంత నియామక ఏర్పాట్లు ఉన్నాయి. స్పెషలైజేషన్, రిక్రూట్‌మెంట్ వేగం ఆధారంగా అటువంటి ప్రత్యేక సంస్థల ఏర్పాటు ను కొందరు సమర్థిస్తున్నాయి. అయితే, అటువంటి ప్రత్యేక ఏజెన్సీల కూర్పు కూడా పరిశీలించాల్సి ఉంటుంది. అటువంటి ఏజెన్సీల విస్తరణ రాజ్యాంగంలో పేర్కొన్న రిక్రూట్‌మెంట్ మూలాన్ని, లక్ష్యాన్ని తగ్గించింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఈ రాజ్యాంగ సంస్థను ఏర్పాటు చేయాలి తప్పితే ఏదో హోదా అందించాలనే ఉద్దేశంతో కాదు. ఆ విధానమే ఈ సమస్యకు మూలంగా మారింది.

**మొత్తానికి ప్రభుత్వం వీటిని సవరించే వీలుంది:**

1. సాధారణ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్‌కు సంబంధించి పరీక్షల స్కీమ్, సిలబస్‌ను యూపీఎస్సీకి అనుగుణంగా తీర్చిదిద్దడాన్ని పునఃపరిశీలించడం.
2. ప్రతిభ, అర్హత, సమగ్రత ఆధారంగా కమిషన్ (ఛైర్మన్ & సభ్యులు) ఎంపిక, నియామకాన్ని బలోపేతం చేయడం
3. పాత్రలు, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించే నిబంధనలను రూపొందించడం
4. ఆర్థిక స్వయంప్రతిపత్తి, అవసరమైన సిబ్బంది సంఖ్యను నిర్ధారించడం.

ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడంతోపాటు క్యాలెండర్‌ను రూపొందించాలనే ఉద్దేశంతో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకుంటున్న వారిలో ఆశలు రేకెత్తిస్తోంది. మరి ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నడుస్తుందో లేదో చూడాలి.

– తడకమల్ల వివేక్,
టీఎస్ పీఎస్సీ మాజీ సభ్యుడు
m : 9391099727
e : tadakamallavivek@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330.
తగ్గింపు ధర రూ.300

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com



చార్నోకైట్ శిల - సెయింట్ థామస్ మౌంట్, పల్లవరము - తమిళనాడు

# తమిళనాడు రాష్ట్రంలోని జియో హెరిటేజ్ స్థలాలు

తమిళనాడు రాష్ట్రంలో కేంద్రప్రభుత్వం జియోలాజికల్ మాన్యుమెంట్స్‌గా గుర్తించిన స్థలాలు నాలుగు (4).

1) చార్నోకైట్ శిల, సేంట్ థామస్‌మౌంట్ వద్ద, చెన్నైలో.

2) సాత్తనూర్ ఫాసిల్‌వుడ్ పార్క్ - పెరంబలూర్ జిల్లా

3) తిరువక్కరై ఫాసిల్‌వుడ్ పార్క్ - విల్లుపురం జిల్లా

4) కరై బ్యాడ్ ల్యాండ్స్, పెరంబలూర్ జిల్లా

ఈ జియో హెరిటేజ్ స్థలాలు పూర్తి వివరణ క్రింద ఇవ్వబడినది.



సాత్తనూర్ ఫాసిల్‌వుడ్ పార్క్ - పెరంబలూర్ జిల్లా, తమిళనాడు

### చార్నోకైట్‌శిల, సేంట్ తామస్ మౌంట్, చెన్నైలో

ఈ చార్నోకైట్ శిల చెన్నైలోని సేంట్ థామస్ మౌంట్ వద్ద వున్నది. ఈ శిలకు చార్నోకైట్ అన్న పేరు రావడానికి కారణం ఏమిటంటే ఈ శిలను మొట్టమొదట కొలకత్తా నగరం స్థాపకర్త జాబ్ చార్‌నోక్ అనే వ్యక్తి యొక్క సమాధి కట్టడంలో వాడినందున అతని పేరు పెట్టారు. ఈ శిల యొక్క సమ్మూహంలో కొన్ని ఇగ్నియస్ శిలలు వివిధ రకాలుగా మెటమార్ఫిసమ్ చెందినవిగా గుర్తించబడినవి. గ్రాన్యులైట్ ఫేసిస్ మెటుమార్ఫిసమ్ వల్ల గ్రానైట్ నైసెస్ మార్పు చెంది చార్నోకైట్‌గా మారడం జరిగింది. ఈ శిలలో ముఖ్యమైన ఖనిజాలు, క్వార్ట్జ, ఫెల్స్ పార్ మరియు హైపర్థీన్ ఈ శిల రెండు పైరాక్సీన్ ఫేసీస్ మెటమార్ఫినంకు గురైనది. ఈ శిల సౌతర్న్ 'గ్రాన్యులైట్ టెర్రేన్'కు చెందినది.

### సాత్తనూరు ఫాసిల్‌వుడ్ పార్క్, పెరంబలూర్ జిల్లా

తమిళనాడు లోని పెరంబలూర్ జిల్లాకు చెందిన సొత్తనూరు అనే గ్రామంలో ఈ ఫాసిల్ వుడ్ పార్క్ కలదు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని జియో పార్క్‌గా గుర్తించినది. ఈ పార్క్‌లోని


తిరువక్కరై ఫాసిల్‌వుడ్ పార్క్ - విల్లుపురం జిల్లా, తమిళనాడు


కరై బ్యాండ్ ల్యాండ్స్ - పెరంబలూర్ జిల్లా, తమిళనాడు

అన్ని వృక్షాలు శిలలుగా మారిపోయినవి. వృక్షాలు పూర్తిగా పెట్రిఫికేషన్ ప్రాసెస్ ద్వారా శిలలుగా మారినవి. అందుకే వీటిని ఫాసిల్ వుడ్ అని అందురు. ఇవి క్రిటేశియస్ పిరియడ్‌కు చెందినవి (120 మిలియన్ సంవత్సరాలు). ఈ ఫాసిల్ వృక్షాల బుడం పొడవు 18 మీటర్ల వరకు కలదు. ఈ పాసిల్ వృక్షాలు తిరుచిరాపల్లి గ్రూపుకు చెందినవి. ఈ పార్క్ సొత్తనూరుకు ఉత్తరాన 100 మీటర్ల దూరంలో వున్నది. దీనిని చెన్నై-తిరుచిరాపల్లి రహదారి (ఎన్‌హెచ్-45) ద్వారా చేరవచ్చును. జియోలాజికల్ స్టడీస్ ద్వారా వెలువడిన విషయాలు ఏమిటి అంటే 120 మిలియన్ సంవత్సరాల క్రితం సొత్తనూరుకు 8 నుండి 10 కి.మీ. పశ్చిమ ప్రాంతం సముద్రం ఉప్పొంగి జలమయం కావడంతో అక్కడ వున్న వృక్షాలు చాలా కాలం నీటిలో వుండిపోయి క్రమేన జియోలాజికల్ టైమ్ పిరియడ్‌లో ఫాసిలైన్ కావడం జరిగినది.

**తిరువక్కరై ఫాసిల్ వుడ్ పార్క్, విల్లుపురం జిల్లా**

ఈ ఫాసిల్ వుడ్ పార్క్ విల్లుపురం జిల్లాలోని తిరువక్కరై గ్రామానికి ఒక కిలోమీటర్ తూర్పు దిశల కలదు. దీనిని తిండివనం - పుదుచ్చెరి రహదారి గుండా చేరవచ్చును. ఇది తిండివనం నుండి 35 కి.మీ. దూరంలో వున్నది. ఈ పార్క్‌లోని వృక్షాలన్ని శిలలుగా మారిపోయినవి. దీనిని జిఎస్ఐ ప్రతిపాదన మేరకు కేంద్ర ప్రభుత్వం జియోహెరిటేజ్ స్థలంగా గుర్తించింది. ఈ పార్క్‌ను జిఎస్ఐ మెయింటేన్ చేస్తున్నది. ఈ ఫాసిల్‌వుడ్ పార్క్ 247 ఎకరాలలో విస్తరించి వున్నది. ఇది మైయొసీన్ పీరియడ్‌కు చెందిన కడ్డలూర్ సాండస్టోన్‌లోని భాగం. ఈ పార్క్‌లో 200 ఫాసిల్ వృక్షాలు రకరకాల ఆకారాలలో 5 నుండి 15 మీటర్ల పొడవు మరియు 5 మీటర్ల లావు కల బుడములు కలవు.

**కరై బ్యాడ్ ల్యాండ్స్, పెరంబలూరు జిల్లా**

కరై బ్యాడ్ ల్యాండ్స్ అలాతూర్ -అరియలూర్ రహదారిలో కరై మరియు కొలొక్కనీతన్ గ్రామాల వద్ద కలదు. ఈ బ్యాడ్ లాండ్స్ మెరైన సెడిమెంట్స్‌తో కూడినది. ఇది 4 కి.మీ. ల పొడవు మరియు 2 కి.మీ. వెడల్పు కలదు. ఈ బ్యాడ్ ల్యాండ్ టోపోగ్రఫి ఎత్తు పల్లాలుగా వుంటుంది. మరియు కోనికల్ గుట్టలు వీటి మధ్యలో లోయలుగా వుంటుంది. ఆ ప్రాంతంలోని సెడిమెంట్స్ కరై ఫార్మేషన్‌కు చెందినవి. ఈ సెడిమెంట్స్‌లో ముఖ్యంగా జిప్శియస్ క్లే, సాండ్ స్టోన్, ఫాస్ఫేట్ నాడ్యుల్స్ యొక్క పాకెట్స్ మరియు సెలిసైట్‌తో కూడి యున్నది. వీటిలో ప్రముఖంగా వున్న ఫాసిల్స్ అమ్మొనైట్స్, బెలిమనైట్స్, వోర్మట్యూబ్స్, గ్యాస్ట్రో పాడ్స్ మరియు అయిస్టర్స్. ఇలాంటి జియోమార్ఫిక్ ఫీచర్ అరుదగా వుంటుంది. కావున జి.ఎస్.ఐ ప్రతిపాదన మేరకు దీనిని కేంద్ర ప్రభుత్వం జియో హెరిటేజ్ స్థలంగా గుర్తించింది.

- కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com


JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

వరల్డ్ హెరిటేజ్ సైట్



## యమునా నది కేంద్రబిందువుగా

# తాజ్ మహల్ అందాలు

## 1983లో UNESCO చే గుర్తింపు

**రాష్ట్రం:** ఉత్తర ప్రదేశ్, భారతదేశం
**ప్రకటన తేదీ:** 1983
**వర్గం:** సాంస్కృతికం (స్మారక చిహ్నం)


**అత్యుత్తమ సార్వత్రిక విలువ**

**తా**జ్ మహల్‌ను మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థం నిర్మించాడు. దీని నిర్మాణం 1632లో ప్రారంభమై 1648లో ముగిసింది. మసీదు, గెస్ట్ హౌస్, ప్రధాన దక్షిణ ద్వారం, బయటి ప్రాంగణం, దాని క్లోయిస్టర్‌లు తదనంతర కాలంలో జోడించబడ్డాయి. తాజ్ మహల్ విశిష్టతను చాటిచెప్పే నిర్మాణ వినూత్నతలలో తోటల ఉద్యాన ప్రణాళిక, సమాధుల కచ్చితమైన రేఖాగణిత సమరూపత, రాతి అలంకరణ కళ, నాలుగు ఫ్రీ-స్టాండింగ్ మినార్లు, గంభీరమైన ప్రధాన ద్వారం ఉన్నాయి. తాజ్ మహల్ ఒక పరిపూర్ణమైన, సౌష్టవంగా ప్రణాళికాబద్ధంగా రూపొందించబడిన భవనం. ప్రధాన విశిష్టతలు నెలకొన్న కేంద్ర అక్షంతో పాటు ద్వైపాక్షిక సారూప్యతకు కూడా ఇది ప్రాధాన్యం ఇస్తుంది.

**ప్రమాణాలు: (1)**


(1) పరిపూర్ణ సామరస్యం, అద్భుతమైన శిల్పకళ ద్వారా, ఇండో-ఇస్లామిక్ సమాధి ఆర్కిటెక్చర్ ఈ మొత్తం శ్రేణిలో, సమతుల్యత, సమరూపత, వివిధ అంశాల సామరస్య సమ్మేళనంలో ప్రత్యేకమైన సౌందర్య లక్షణాలతో అత్యుత్తమ నిర్మాణ, కళాత్మక సాధనను తాజ్ మహల్ సూచిస్తుంది.

శతాబ్దాలుగా కవులు, యాత్రికులతో ఎంతగానో ప్రశంసించబడిన తాజ్ మహల్ నిస్సందేహంగా భారతదేశ అత్యంత



ప్రసిద్ధ స్మారక చిహ్నం. తెల్లని పాలరాతి వైభవంతో తాజ్ మహల్ నేడు ప్రేమకు చిహ్నంగా నిలుస్తోంది. సామాన్య శకం 1632లో మరణించిన తన ప్రియమైన భార్య ముంతాజ్ మహల్ కోసం మొఘల్ చక్రవర్తి షాజహాన్ దీనిని పవిత్ర సమాధిగా నిర్మించాడు.

షాజహాన్ ఎల్లప్పుడూ ఆగ్రా కోట నుండి యమునా నది వెంట పొడవైన పడవలో తాజ్ నిర్మాణ ప్రదేశానికి ప్రయాణించే వారు. అందువల్ల, ఆయన ఈ స్మారక చిహ్నాన్ని నదీతీరం నుండి... దాని "స్వర్గానికి ఎగురు తున్న గోపురం" పొగమంచు కన్నా పైకి లేచింది, హిమాలయాల తాజా జలాలు కట్టడం అంచున ఉన్నాయి... అని ఊహించడం సహజం. నగరం వైపు నుండి సైట్‌ను సందర్శించే ప్రస్తుత సందర్శకులకు ఈ భావన తరచుగా కనిపించదు. రివర్ ఫ్రంట్ గోడ, ఒకప్పుడు గొప్పగా అలంకరించబడి, చెక్కబడింది. ఇప్పుడు మారుతున్న స్థితిగతులతో ఆనాటి అందం కోల్పోయింది.



షాజహాన్ రాతి ఛాంబర్ లోకి ప్రవేశించి ప్రార్థనలు చేయడానికి పాలరాతి మెట్లతో ఒక చిన్న తలుపు కూడా ఉంది. వేగంగా ప్రవహించే నదిని ఆయన తన గొప్ప ప్రణాళికకు కేంద్రంగా చేసుకున్నాడు. నదికి కుడి వైపున నిజమైన పవిత్ర స్థలంగా సమాధి, మరొక వైపు మెహతాబ్ బాగ్ లేదా మూన్‌లైట్ గార్డెన్‌ను ఆనంద ఉద్యానవనంగా కేటాయించి ఉండవచ్చు. ఇది ఖురాన్ గ్రంథాలకు అనుగుణంగా కచ్చితమైన సరైన దిశలో నిర్దేశించబడి ఉంది. సమాధులు దోషరహిత అమరికలో ఉన్నాయి. ప్రవేశద్వారం పిష్తాక్ (వంపుతో కూడిన ఓపెనింగ్ చుట్టూ ఉన్న దీర్ఘచతురస్రాకార ఫ్రేమ్)పై నగీషీ రాత కూడా దీన్ని ధ్రువపరిచేలా "ఎంటర్ థౌ మై ప్యారడైజ్" అని ఉంటుంది.

ఈ కళాఖండం నిర్మాణానికి ఇరవై రెండు సంవత్సరాలు పట్టింది. ఇది భారతదేశంలో అత్యున్నత మొఘల్ వాస్తుశిల్పంగా గుర్తించబడింది. తాజ్ మహల్ ప్రకాశం దాని స్వచ్ఛమైన, ప్రకాశించే తెల్లని పాలరాతి ముఖ భాగం, దానిపై చెక్కబడి, పొదిగిన అతి సూక్ష్మ డిజైన్లలోనే ఉంది. దీని కోసం 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న మక్రానా నుండి ఎంపిక చేసిన పాలరాయిని ఎద్దు బండ్ల వరుసల్లో రవాణా చేశారు. లాపిస్ లాజులి (అందమైన నీలం రాయి), అగేట్ (ఒక రకం విలువైన రాయి), కార్నెలియన్ (ఒక రకం రాయి) ఆఫ్ఘనిస్తాన్, అంతకంటే దూరంలో ఉన్న దేశాల నుండి తెప్పించారు. 20,000 మందికి పైగా కార్మికులు ఈ భవనాన్ని నిర్మించారు. వారితో పాటు ఎంతో మంది నిపుణులు, మేస్త్రీలు, శిల్పులు దీని నిర్మాణంలో పాలుపంచు కున్నారు. ఈ అత్యుత్తమ భవనాన్ని నిర్మించడానికి వారిని ఆగ్రాకు పిలిపించడంతో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు.

ఈ మొత్తం నిర్మాణంలో మధ్యలో ముంతాజ్ మహల్ సమాధి ఉంది. అది అల్లా తొంభై పేర్లతో పాటు పుష్పాలు, అరబెస్క్ కళాత్మక అలంకరణలతో కూడా చెక్కబడి ఉంది. దాని కింద రాతిగదిలో అసలు సమాధులు (ముంతాజ్ మహల్, షాజహాన్) ఒకేలా ఉంటాయి. ఇవి పూర్తిగా సాదా, ఎలాంటి ప్రత్యేకతలు లేని గదిలో ఉన్నాయి. ఇక్కడే ఒక మిస్టరీ ఉంది. షాజహాన్ తన కోసం ఏం ప్లాన్ చేసుకున్నాడు? నిశ్చయంగా అది ఆయన సమాధి మాత్రం కాదు. ఆయన సమాధి కూడా ముంతాజ్ మహల్ సమాధి పక్కన ఉంచబడి నప్పటికీ, వాస్తవానికి మొత్తం సముదాయంలో అది ఒక సరితూగని అంశంగా ఉందా? తాజ్‌లో ఇప్పటికీ ఎన్నో మిస్టరీలు ఉన్నాయి. వాటి లోతుల్లోకి వెళ్లేవారిని అవి ఆహ్వానిస్తూనే ఉంటాయి.

గత శతాబ్దంలో, తాజ్ మహల్‌ను రక్షించడానికి, పునరుద్ధరించడానికి గణనీయమైన కృషి జరిగింది. దాదాపు వంద సంవత్సరాల క్రితం చార్‌బాగ్ పూర్తిగా చదును చేయబడింది. కానీ దాని రూపకల్పన స్ఫూర్తిని అలాగే ఉంచారు. 1996లో ఒక చారిత్రాత్మక సుప్రీంకోర్టు తీర్పులో, పర్యావరణ కాలుష్యం ప్రభావం నుండి పాలరాయిని రక్షించడానికి కాంప్లెక్స్ చుట్టూ 500 మీటర్ల గ్రీన్ బెల్ట్ నిర్మించాల్సిందిగా ఆదేశించారు. నేడు, ఏఎస్ఐ దీన్ని నిర్వహిస్తోంది. నిరంతరం పెరుగుతున్న సందర్శకులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తోంది. అయినప్పటికీ, ప్రాముఖ్యత కలిగిన ఈ సైట్ నిర్వహణ ఇప్పటికీ ఆందోళన కలిగించే విధంగానే ఉంది.

– అమితా బేగ్

అనువాదం : ఎన్. వంశీ

# సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలబెట్టుకున్న తెలంగాణ

**2019** జూన్‌లో అమెరికా వెళ్ళినప్పుడు ఒక రోజు గ్రాండ్ కాన్యాన్ (Grand Canyan) కొలరాడో నదీ లోయ ప్రాంతాన్ని సందర్శించడానికి పోయాము. అంతకు ఒక వారం ముందు మా బిడ్డ చదువుకున్న Texas A&M Universityకి వెళ్ళాము. ఈ యునివర్సిటీకి నాలుగు చోట్ల కాంపస్‌లు ఉన్నాయి. మేము కామర్స్ అనే ప్రాంతంలో ఉన్న కాంపస్‌కు వెళ్ళాము. డల్లాస్ నుంచి ఒక గంట ప్రయాణం. సుందరమైన, విశాలమైన కాంపస్. ఈ కాంపస్‌లో చదువుకున్న వాళ్ళని లయన్స్ అని పిలుస్తారట. అందుకే కాంపస్‌లో సింహం కంచు విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. ఇది అమెరికాలో ఒక స్థాయి కలిగిన యూనివర్సిటీ. ఇక్కడ ఏర్పాటు చేసిన సింహం బొమ్మ దగ్గర ఒక శిలాఫలకం నన్ను ఆకర్షించింది. ఈ యూనివర్సిటీ ప్రాంతం ఒకప్పుడు కాడో (Caddo) అనే జాతికి చెందిన స్థానిక అమెరికన్ల (Native Americans) నివాస ప్రాంతం. వీరి నివాస ప్రాంతం నైరుతీ దిశలో ఆర్కాన్సాస్ వరకు, వాయవ్య దిశలో లూసియానా వరకు విస్తరించి ఉండేది. 16వ శతాబ్దానికే వీరు గ్రామాల్లో స్థిర వ్యవసాయం చేయడం ప్రారంభించారు. మొక్కజొన్న, కూరగాయలు పండించేవారు. జంతువులు, చేపల వేట కూడా చేసేవారు. వేటకు విల్లు, బాణాలు ఉపయోగించేవారు. వీరికి ప్రత్యేకమైన భాష, సంస్కృతి, పండుగలు, ఆచార వ్యవహారాలూ స్థిరపడినాయి. యూరప్ నుంచి వలసవాదులతో వ్యాపార లావాదేవీలు జరిపేవారు. 1889 ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయించడంతో వారిని ఒక్లాహోమా ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించారు. అక్కడ స్వయం ప్రతిపత్తి కలిగిన 'కాడో నేషన్' కూడా ఏర్పాటు చేసారు. టెక్సాస్ రాష్ట్రానికి ఆ పేరు కాడో జాతి వారి భాషలో ఉన్న టేషస్ (Tayshas) అనే పదం నుంచి ఉత్పన్నం అయ్యింది. అంటే స్నేహితులు అని అర్థం ఆ శిలాఫలకంలో ఈ వివరాలన్నీ రాశారు.



ఇటువంటి స్వయం ప్రతిపత్తి కలిగిన స్థానిక అమెరికన్ నేషన్స్ అమెరికా అంతటా చాలా ఉన్నాయి. యూరప్ వలస వాదులు అమెరికా ఖండాన్ని ఆక్రమించుకున్న తర్వాత ఇక్కడి స్థానిక అమెరికన్లతో జరిగిన ఘర్షణలు, ఆ ఘర్షణల్లో జరిగిన మానవ హననం అమెరికా ఖండ అభివృద్ధి చరిత్రలో మానని గాయం. ఈ వివరాలన్నీ హొవార్డ్ జిన్ రాసిన "అమెరికా ప్రజల చరిత్ర" (A Peoples History of the United States) పుస్తకంలో చదవవచ్చు. 15వ శతాబ్దంలో యూరప్ వలసవాదులు కొత్త భూభాగాల కోసం అన్వేషణ ప్రారంభించారు. భారత దేశానికి దారి కనుక్కునే క్రమంలో దారితప్పి కొలంబస్ అమెరికా ఖండానికి చేరుకున్నాడు. అదే ఇండియా అనుకున్నాడు. అక్కడి స్థానిక ప్రజలని ఇండియన్స్ అన్నాడు. వారి చర్మం రంగు ఎరుపుగా ఉండడంతో వారు 'రెడ్ ఇండియన్స్' అయ్యారు. అక్కడి నుంచి రెడ్ ఇండియన్స్‌కి యూరప్ వలసవాదులతో ఘర్షణల పర్వం మొదలయ్యింది. విల్లు, బాణాలతో చేసే వారి పోరాటాలు యూరోపియన్ల తుపాకుల ముందు నిలువలేకపోయినాయి. యూరోపియన్ వలసవాదులకు లొంగిపోయి బానిసలుగా మారినారు. దిక్కరించిన జాతులు ఊచకోతకు గురి అయినాయి. యూరోపియన్లు రాక మునుపు లక్షల సంఖ్యలో ఉండే స్థానిక జాతుల ప్రజలు వందల్లోకి తగ్గిపోయినారు. విశాలమైన భూఖండాన్ని అభివృద్ధి చేయడానికి వారికి మానవ శ్రమ కావలసి వచ్చింది. ఆఫ్రికా నుంచి వేటాడి తీసుకు వచ్చిన వేలాది మంది నల్లజాతి బానిసల శ్రమతో అమెరికా ఖండంలో వ్యవసాయం, గనులు, పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. అమెరికా అభివృద్ధి చరిత్ర అంతా రక్తసిక్త చరిత్ర అని ఆ పుస్తకం సోదాహరణంగా వివరించింది.

ఆరిజోనా రాష్ట్రంలో ఉన్న గ్రాండ్ కాన్యాన్ (Grand Conyon) అని పిలువబడే కొలరాడో నదీ లోయ ప్రాంతంలో కూడా అమెరికా ఫెడరల్ ప్రభుత్వం హూలాపై (Hualapai) జాతికి చెందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన హూలాపై నేషన్‌ను (Hualapai Nation)1883 లో ఏర్పాటు చేసింది. అక్కడకి చేరగానే welcome to Hualapai Nation అని ఆహ్వానం పలుకుతారు. అక్కడ మూడు జెండాలు ఎగరడం కనిపించింది. ఎత్తున అమెరికా ఫెడరల్ జెండా, మధ్యలో హూలాపై నేషన్ జెండా, చివరన కొంచెం చిన్నగా ఆరిజోనా రాష్ట్ర జెండాలు ఎగురుతున్నాయి. 2900 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన హూలాపై నేషన్ ప్రాంతంలో నమోదు చేసుకున్న మొత్తం జనాబా 2300. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు సుమారు 1350. గ్రాండ్ కాన్యాన్ పర్వత శ్రేణులు కొలరాడో నదీ లోయలో కొన్ని లక్షల సంవత్సరాల క్రితం అద్భుతమైన ఎర్రటి రాళ్ళతో నిర్మితమైనవి. 3 వేల అడుగుల లోతున ఈ రాతి కొండల నడుమ కొలరాడో నది ప్రవహిస్తుంది. ఇక్కడ గాజుతో నిర్మించిన "స్కై వాక్"

బ్రిడ్జి మీద నుంచి పర్యాటకులు గ్రాండ్ కాన్యాన్ అందాలను వీక్షిస్తారు. ఫోటోలు దిగుతారు. ఫోటోలు అక్కడి ఉద్యోగులు మాత్రమే తీస్తారు. వారంతా హూలాపై జాతికి చెందిన వారే. పర్యాటకం నుంచి వచ్చే ఆదాయం అంతా హూలాపై నేషన్‌కు చెందుతాయి. స్కై వాక్ బ్రిడ్జ్ మీదకు వెళ్ళే ముందు క్యూలైన్ గోడలపై వాలాపై జాతి ప్రజల చరిత్ర, వారి పోరాటాలు, వారు గతంలో ఉపయోగించిన వస్తువులు తదితర సామాగ్రిని, పోస్టర్లను ప్రదర్శనకు పెట్టారు. ఆ సమాచారం అంతటిని ఫోటోలలో బంధించాను. ఆసక్తితో చదివాను. గ్రాండ్ కాన్యాన్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణంలో ఒక హూలాపై ఆత్మకథ పుస్తకం నా దృష్టిని ఆకర్షించింది. ఆ పుస్తకాన్ని కొని చదివాను. అర్థం అయినది కొంచెం. అర్థం కానిది ఎక్కువ. ఈ ఆత్మకథలో బంగారం కోసం యూరోపియన్ల దాడులపై, ఓడిపోయిన వారి పోరాట చరిత్రపై ఒక చాప్టర్ ఉన్నది. గ్రాండ్ కాన్యాన్ వద్ద హూలాపై జాతి ప్రజలు వదిలేసిన ఊరును (Deserted Village) సందర్శకుల కోసం కాపాడుతున్నారు. వారి గుడిసెలు, పశువుల కొట్టాలు, వంట పాత్రలు, వ్యవసాయ పనిముట్లు తదితర సామాగ్రి అక్కడ దర్శనమిస్తాయి. పర్యాటకులు వాటి ముందు, లోపల ఫోటోలు దిగి తమ జ్ఞాపకాలను భద్రపరచుకుంటారు. స్థానిక వాద్యాలతో వారి పాటలను కొందరు వినిపిస్తూ ఉంటారు. పర్యాటకం వారికి ప్రధాన ఆదాయ వనరు. గ్రాండ్ కాన్యాన్ ప్రకృతి అందాలను, హూలాపై జాతి ప్రజల గ్రామాలను వీక్షించడానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తారు. స్థానిక అమెరికన్ గ్రామాలన్నీ ఇటువంటి పర్యాటక ప్రాంతాలుగా మారినాయి. 1970 వ దశకంలో హాలీవుడ్ బ్లాక్ బస్టర్ హిట్ సినిమా "మెకన్నాస్ గోల్డ్" షూటింగ్ ఇక్కడే జరిగిందని మిత్రుడు కొండపల్లి వేణుగోపాలరావు చెప్పాడు.




ఇప్పుడు ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే.. తెలంగాణ ఏర్పాటు అయిన పదేండ్ల తర్వాత ఇదంతా గుర్తు చేసుకోవడానికి పూర్వరంగం ఉన్నది. ఉద్యమ కాలంలో ప్రొ. జయశంకర్ గారు అనేక సభల్లో చేసిన ప్రసంగాల్లో తరచుగా భాష సాంస్కృతిక పరాయీకరణ గురించి చెప్పేవారు. 'ఒక జాతి ఆర్థికంగా నష్టపోతే పుంజుకోవచ్చు. కానీ సాంస్కృతికంగా నష్టపోతే జాతి అస్తిత్వం కనుమరుగు అవుతుంది. తెలంగాణ ఏర్పాటు కాకపోతే మన భాష, సంస్కృతి సాంప్రదాయాలు కనుమరుగు అవుతాయి. మన తర్వాతి తరం వారికి ఒకప్పుడు మనుగడలో ఉన్న తెలంగాణను, మ్యూజియంలలో భద్రపరచిన మన బతుకమ్మను, మన బోనాలను, మన సాంస్కృతిక చిహ్నాలను చూపించుకోవలసిన దుస్థితి వస్తుంది. అమెరికాలో రెడ్ ఇండియన్స్ లాగా. అట్లా మనం, మన సంస్కృతి మ్యూజియంలో వస్తువులుగా మారవద్దు అనుకుంటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుందాం. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ రాదు..' ఇట్లా సాగేది ఆ ప్రసంగాలు. అయితే ఆ దురవస్థ తెలంగాణకు పట్టకుండా తప్పిపోయింది. సమస్త తెలంగాణ సమాజం ఒక్క తాటిపై నిలబడి కలబడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నది. తెలంగాణ తన బాషా సాంస్కృతిక అస్తిత్వాన్ని సమున్నతంగా నిలబెట్టుకున్నది.

దాదాపు 15 ఏండ్ల పాటు సాగిన తెలంగాణ సాధనా పోరాటంలో సాంస్కృతికోద్యమం పోషించిన పాత్ర ఈ సందర్భంలో స్మరించుకోవలసిన అవసరం ఉన్నది. మలి దశ ఉద్యమం తెలంగాణ అంతటా ఒక సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఊపిరి పోసింది. జాతీయ ఉద్యమం సందర్భంగా దేశ వ్యాప్తంగా 'వందేమాతరం' నినాదం ప్రజల్లో ఎటువంటి ఉత్తేజాన్ని నింపిందో 'జై తెలంగాణ నినాదం' కూడా అట్లనే తెలంగాణను తట్టి లేపింది.

మరుగున పడిపోయిన చరిత్రను తవ్వి తీయడానికి అనేక మంది చరిత్ర పరిశోధకులు పలుగూ పారా పట్టుకొని పురా తవ్వకాలు చేసి ఘనమైన తెలంగాణ చరిత్రను వెలికి తీసినారు. వారు తెలంగాణ చరిత్రను పునర్నిర్మించే ప్రయత్నం చేసినారు. బహుజన వీరులు సర్వాయి పాపన్న, తుర్రేబాజ్ ఖాన్, సుద్దాల హనుమంతు, బందగి, కొమురం భీమ్, భాగ్యరెడ్డి వర్మ, వట్టికోట ఆళ్వారు స్వామి, మగ్దూం, కాళోజీ, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహాదూర్,... ఇట్లా తెలంగాణ వైతాళికులు అనేక మంది వెలుగులోకి వచ్చినారు. తెలంగాణ పై మగ్దూం చెప్పిన "ఇన్ఖిలాబ్ కా పైగంబర్ తెలంగాణ దాశరథి చెప్పిన "నా తెలంగాణ కోటి రతనాల వీణ", కాళోజీ చెప్పిన "మాటొక్కటి భాషొక్కటి, భారతాన వెలసి నిలుచు తెలంగాణ" అన్న కవితా పాదాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం పొందినాయి. దాశరథి కవితా పాదాలను అన్వయించి సాగునీటి ఇంజనీర్లు "మా తెలంగాణం – కోటి ఎకరాల మాగాణం" అన్న నినాదాన్ని రుపొందించినారు. ఈ క్రమంలో తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్ర, నిజామాంధ్ర మహాసభల చరిత్ర, హైదారాబాద్ విమోచనా చరిత్ర, దానిపై భిన్న దృక్పథాలు, హైదారాబాద్ రాజ్యంపై పోలీస్ చర్య పేరుతో జరిగిన సైనిక చర్యపై ప్రత్యక్ష కథనాలు, ఆపరేషన్ పోలో సందర్భంగా ముస్లింలపై జరిగిన ఊచకోతపై పండిట్ సుందర్ లాల్ నివేదిక, 1969 ఉద్యమ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విద్రోహ చరిత్ర, భారత రాష్ట్రాల ఏర్పాటు పరిణామ చరిత్ర... ఇట్లా తెలంగాణ చరిత్రపై ప్రభావశీలమైన పుస్తకాలు వెలువడినాయి.

మల్లెపల్లి లక్ష్మీరాజం మెమోరియల్ ట్రస్ట్ వారు ప్రొ. జయశంకర్ గారి "తెలంగాణలో ఏం జరుగుతోంది" పుస్తకం తెలంగాణ సమాజాన్ని జాగృతం చెయ్యడంలో అనితరసాధ్యమైన పాత్రను పోషించింది. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రచురించిన "కమ్యూనిజమా – కోస్తావాదమా" సిపిఎం తెలంగాణ వ్యతిరేక వైఖరిపై వ్యాసాల పుస్తకం వామపక్షాలపై తీవ్ర ప్రభావాన్ని కలుగజేసింది. ఆ పార్టీలు తెలంగాణపై తమ వైఖరిని మార్చుకోవడంలో దోహదం చేసింది. తే.వి.వే ప్రచురించిన ఆర్. విద్యాసాగరరావు గారి "నీళ్ళు – నిజాలు" పుస్తకం నీటి దోపిడి రాజకీయాలను ప్రజలకు వివరించడంలో సఫలమైంది. తలాపున గోదావరి, కృష్ణా నదులు పారుతున్నా తెలంగాణకు న్యాయంగా అందవలసిన నీటి వాటా ఎందుకు అందటంలేదో ఆయన వ్యాసాలు,

ప్రసంగాలు ప్రజలకు విప్పి చెప్పినాయి. నీళ్ళలో నిప్పులు రగిలించి ఉద్యమానికి నీళ్ళను ఒక ప్రధాన అంశంగా మార్చడంలో ఆయన కృషి విస్మరించలేనిది. 1956 లో వట్టికోట ఆళ్వారుస్వామి ప్రచురించిన "తెలంగాణం" రెండు సంపుటాల పునర్ముద్రణ జరిగింది. ఇందులో విలీనానికి పూర్వం హైదరాబాద్ రాష్ట్రం వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని వివరిస్తూ నిపుణులు రాసిన వ్యాసాలు వలసవాదుల వాదనలను తిప్పికొట్టడానికి ఉపయోగ పడినాయి. బిఎన్ శాస్త్రి రాసిన "రెండు తెలుగు రాజ్యాలెందుకు?" అన్న పుస్తకం కూడా పునర్ముద్రణకు నోచుకున్నది. ఆ పుస్తకం తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించడానికి ఉద్యమకారులకు ఉపయోగపడింది. తెలంగాణ జాగృతి వారు సురవరం ప్రతాపరెడ్డి ఆనాడు ప్రచురించిన 'గోలకొండ కవుల సంచిక'ను పునఃప్రచురించింది. చరిత్ర పరిశోధకులు జితేంద్ర బాబు సంకలించిన 'నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభల చరిత్ర'ను కూడా మూడు సంపుటాలుగా ప్రచురించి తెలంగాణ ప్రజలకు అపూర్వ కానుకలను అందించింది.



చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను వివరిస్తూ డా. బి.ఆర్ అంబేద్కర్ రాసిన వ్యాసాలు విస్తృతంగా చర్చకు వచ్చాయి. 'ఒక రాష్ట్రానికి ఒక భాష ఉండాలి. అయితే ఒక భాషకు ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలు ఉంటే తప్పు లేదు' అన్న అంబేద్కర్ సూత్రీకరణలు ఉద్యమ కారులకు దిశా నిర్దేశనం చేసినాయి. మహారాష్ట్ర నుంచి గుజరాత్ రాష్ట్రం విడిపోయినప్పుడు ముంబాయి నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలన్న గుజరాతీ పెట్టుబడిదారుల కుట్రలను అంబేద్కర్ తన పదునైన, సునిశితమైన వాదనలతో బద్దలు కొట్టిన విధానం హైదరాబాద్ నగరాన్ని తెలంగాణకు దక్కకుండా ఆంధ్రా పెట్టుబడిదారులు చేసిన కుట్రలను ఛేధించడానికి ఉపయోగపడినాయి. ప్రతీ శనివారం క్రమం తప్పకుండా తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC)వారు హిమాయత్ నగర్‌లో ఉన్న చంద్రం బిల్డింగ్‌లో ఉద్యమ ఆకాంక్షలపై TRC - CHARCHA లకు వేదికను కల్పించారు. ఈ వేదికపై జరిగిన ఈ చర్చలు ఉద్యమ విస్తరణకు, ఉద్యమ భావజాలం మరింత పరిపుష్టం కావడానికి దోహదం చేసినాయి. ఈ చర్చల్లో చాలా మంది ఉద్యమ నాయకులు ప్రసంగాలు చేసేవారు. కొన్ని చర్చల్లో ప్యానల్ సభ్యుడిగా ప్రసంగం చేసే అవకాశం కూడా నాకూ కలిగింది. కొన్ని వందల వారాల పాటు కొనసాగిన ఈ వేదిక కృషి తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి లాంటిది. ఈ చర్చలన్నిటిని ప్రత్యేక సంపుటాలుగా కూడా వేదకుమార్ గారు దక్కన్ ల్యాండ్ పత్రిక తరపున ప్రచురించారు. అవి ఉద్యమ చరిత్రను రాసే వారికి, పరిశోధకులకు విలువైన సోర్స్ మెటీరీయల్‌గా పనికివస్తాయి.

సీమాంధ్ర సాంస్కృతిక వలసీకరణలో అవహేళనకు, చిన్నచూపుకు గురి అవుతున్న తెలంగాణ భాషను సాహిత్య భాషగా మన కవులు, కథా రచయితలు నిలబెట్టినారు. మట్టిగొట్టుక పోయిన అద్భుత పద సంపదను, మన పలుకుబడులను, మన సామెతలను పని గట్టుకొని వెలికి తీసినారు. నలిమెల భాస్కర్ 'తెలంగాణ పదకోశం', రవ్వా శ్రీహరి గారి 'నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం', వేముల పెరుమాళ్ళు రాసిన 'తెలంగాణ సామెతలు' తదితర పుస్తకాలు తెలంగాణ భాష సాహిత్య భాషగా స్థిరపడటానికి దోహదం చేసినాయి. ఉద్యమం సందర్భంగా జానపద కళారూపాలకు ప్రాణ ప్రతిష్ట జరిగింది. అపురూపమైన తెలంగాణ జానపద కళారూపాలు తిరిగి ప్రజలకు దగ్గరయినాయి. వందలాది జానపద బాణీలు తెలంగాణ ఉద్యమ పాటలకు బాణీలైనాయి. ఒగ్గు కళాకారులు చుక్కా సత్తయ్య, మిద్దె రాములు, చిందు కళాకారిణి చిందు ఎల్లమ్మలను తెలంగాణ సాంస్కృతిక ప్రతీకలుగా ఉద్యమం నిలబెట్టింది. తెలంగాణ వ్యాప్తంగా వందలాది మంది ప్రతిభావంతులైన పాట కవులను వెలికితీసింది. ఎందరో కళాకారులు అద్భుతమైన కళా ప్రదర్శనలతో, రూపకాలతో, ఆటా పాటలతో, ధూమ్ ధాంలతో తెలంగాణ జనాన్ని ఉద్యమ బాటలోకి నడిపినారు. ఈ కళాకారుల ధూంధాంలు, ఆటా పాటా కార్యక్రమాలు తెలంగాణ గ్రామాలను, పట్టణాలను కదిలించి ఉద్యమ బాటన ఎక్కించినారు. ఈ క్రమంలో తెలంగాణలో వందలాది పాటల క్యాసెట్లు, సీడిలు వెలువడినాయి. వందలాది కవితా, కథా సంకలనాలు ప్రచురణ అయినాయి. ఈ సాంస్కృతిక వెల్లువలో చిత్రకారులు, కార్టూనిస్టులు, ఫోటోగ్రాఫర్లు తమవంతు కృషి చేసినారు. ఇదే కాలంలో తెలంగాణ సినిమా కూడా తన ఉనికిని చాటుకున్నది. సినిమాల్లో తెలంగాణ భాషను గూండాలకు, రౌడీలకు, సంఘ విద్రోహ శక్తులకు వాడడాన్ని ఉద్యమం తీవ్రంగా నిరసించింది. తెలంగాణ సినిమా రంగం మీదకు రావడానికి ఉద్యమ వాతావరణం ఎంతగానో దోహదం చేసింది. జై బోలో తెలంగాణ సినిమా సాధించిన అద్భుత విజయం తెలంగాణలో అనేక మంది ఔత్సాహికులను సినిమా రంగంలోనికి నడిపించింది. కొమురం భీం సినిమా 20 ఏండ్ల తర్వాత తిరిగి విడుదల అయి ప్రజల ముందుకు వచ్చింది. బతుకమ్మ, ఇంకెన్నాళ్ళు తదితర సినిమాలు తెలంగాణ కథాంశాలతో నిర్మాణం అయినాయి. అవి వ్యాపార పరంగా గొప్ప విజయం సాధించలేక పోయినా తెలంగాణ సినిమా పరిశ్రమ నిలదొక్కుకోవడానికి పునాదులు వేసినాయి.

ఈ సాంస్కృతిక వెల్లువలో భాగంగానే బతుకమ్మ పునరుజ్జీవనం పొందడం, బోనాల పండుగ , పీర్ల పండుగ, నాగోబా జాతర, సమ్మక్క సారలమ్మ జాతర, కొమురవెల్లి జాతర, ఏడుపాయల జాతర, తెలంగాణలో ఉన్న దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, జలపాతాలు, సాంస్కృతిక విశేషాలు అన్నీ వెలుగులోకి వచ్చినాయి. టిఆర్ఎస్ పార్టీ నిజాం కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సంబురాలు

ఒక సంచలనం. ఒక అపురూప సంరంభం. అక్కడ ప్రదర్శింపబడిన కళారూపాలు ప్రజలకు కనువిందు చేసినాయి. తెలంగాణ వంటకాల రుచి ఆహా అనిపించింది. జొన్నరొట్టే, జొన్నగట్కా, పచ్చి పులుస, సకినాలు, అప్పాలు, పత్తర్ కా గోష్, మేక తలకాయ కూర ప్రజలు సగర్వంగా ఆరగించినారు. ఇక అప్పటి నుండి అన్నీ ఉద్యమ సభల సందర్భంగా భోజనాల్లో జొన్నరొట్టె, జొన్నగట్కా, పచ్చి పులుసు మెనూలో తప్పనిసరి అయినాయి.

స్థూలంగా వ్యాఖ్యానించినప్పుడు 20 ఏండ్ల ఉద్యమ కాలంలో తెలంగాణలో కనిపించిన సాంస్కృతిక పునరుజ్జీవనం లేదా సాంస్కృతిక వెల్లువ దేశంలో మరెక్కడా కానరాదు. ఇది ఉద్యమం సాధించిన అద్భుతమైన ప్రజావిజయంగా చెప్పుకోవచ్చు. అణగారిపోయిన ఒక జాతి లేచి నిలబడి తనని తాను నిలబెట్టుకున్న అపురూపమైన ఛారిత్రిక సంఘటన ఈ తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం.



**తెలంగాణ జాతి భావన :**

'తెలంగానోల్లమ్ వేమంతా ఒక్కటే' అన్న భావన ఉద్యమం సందర్భంగా ఉన్నతంగా వ్యక్తం అయ్యింది. తెలంగాణకు సంభందించిన దేనినైనా ఎత్తిపట్టడం, తెలంగాణేతరమైన దాన్నితిరస్కరించడం అతివాదంగా కనిపించినా అస్తిత్వ ఉద్యమాలకు ఉండే సహజ లక్షణంగా మాత్రమే దాన్ని చూడాలి. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేరింది కనుక ఇప్పుడు విచక్షణతో ఏది మంచి ఏది చెడు, మనలో తిరస్కరించవలసినది, పరిహరించు కోవలసినది ఏమిటనేది బేరీజు వేసుకోవాల్సిన సమయం. ఉద్యమ సందర్భంలో వ్యక్తమైన సామూహిక భావన, తామంతా ఒక్కటే అన్నజాతి భావనని మరింత ఉన్నతీకరించుకోవలసి ఉన్నది. కుల మతాలకు, సామాజిక హెూదాలకు అతీతంగా ఉద్యమంలో వ్యక్తం అయిన సోదర భావం నిజంగా అపూర్వం. తెలంగాణలో శతాబ్దాలుగా ప్రజల ఆచరణలో ఉన్నసంబోదనలు.. అన్నా, తమ్మి, బిడ్డా, ఏమె, రావే, పోవే.. ఇటువంటివి సర్వ సాధారణమైన సంబోధనలుగా వయసుతో, సామాజిక హెూదాతో నిమిత్తం లేకుండా స్థిరపడిపోయినాయి. ఇక్కడ అటువంటి కొన్ని అనుభవాలను పంచుకోవడం వాటిని కొనసాగించుకోవడానికి, ఉన్నతీకరీంచుకోవడానికి ఉపకరిస్తాయి. హైదరాబాద్‌లో ఎర్రంమంజిల్‌లో ఉన్న సాగునీటి శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధ ఒక ఉద్యమ కేంద్రంగా ఉండేది. సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె సందర్భంగా జలసౌధ ఉద్యమ కార్యక్రమాలతో సందడిగా ఉండేది. ఆ సందర్భంగా తరచుగా కనబడే దృశ్యం స్త్రీల బతుకమ్మ. చీపుర్లతో పనిచేసే కాంట్రాక్ట్ లేబర్లతో కలిసి వైట్ కాలర్ ఉద్యోగులు, మహిళా ఇంజనీర్లు బతుకమ్మ ఆడుతూ కనిపించేవారు. సాధారణ సమయంలో మనం చూడలేని అపురూప దృశ్యం అది. అట్లనే కోదాటి శ్రీను రాసిన "అస్సాయిదులా హారతి కాళ్ళగజ్జెల గమ్మతి" పాటకు, గద్దర్ "పొడుస్తున్న పొద్దు మీద .." పాటకు డ్రైవర్లు, అటెండర్లు, ఇతర నాల్గవ తరగతి ఉద్యోగులు, ఎన్‌జివోలు, ఇంజనీర్లు కలిసి ధూలా ఆడడం అతి సాధారణ దృశ్యంగా ఉండేది. ఇటువంటి దృశ్యాలే అన్నీ ఆఫీసుల్లో కనిపించినాయి. ఆఫీసులో సబార్డినేట్, కానీ ఉద్యమంలో నాయకుడు. ఎన్జివోల నాయకత్వంలో గజిటెడ్ ఆఫీసర్లు, క్లాస్ 1 ఆఫీసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు కలసి పనిచేసినారు. ఎక్కడా హెూదాకు లేదా ప్రోటోకాల్ కు సంభందించిన అంశాలు కలసి పని చేయడానికి అడ్డంకి కాలేదు. ఉద్యమానంతరం కాలంలో కూడా ఈ సోదర భావం కొనసాగాలి. అందరం సమానమే అన్న ఈ విలువను తెలంగాణ సమాజం నిలబెట్టుకోవాలి.


అట్లనే తెలంగాణ జెఏసి ఇచ్చిన పిలుపు రోడ్లపై వంటా వార్పు కార్యక్రమం కూడా గ్రామాల్లో ప్రజలను కుల మతాలకు అతీతంగా ఐక్యం చేసింది. బడుల్లో పిల్లలకు పగటిపూట భోజనం దళిత మహిళలు వండితే తిరస్కరించిన సందర్భాలు తెలంగాణలో ఎన్నో ఉన్నాయి. అయితే వంటా వార్పు కార్యక్రమంలో ఈ బేధ భావాలు మర్చిపోయి ప్రజలందరూ కలసి వండుకున్నారు, కలసి సహపంక్తి భోజనాలు చేసినారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ చైర్మన్ ప్రొ. ఘంటా చక్రపాణి గారు నాతో పంచుకున్నతన అనుభవాన్ని ఇక్కడ ప్రస్తావించదలచాను. షామీర్ పేట వద్ద రహదారి మీద గ్రామస్తులు అందరూ కలసి వంటా - వార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కొందరు కూరగాయలు తరుగుతున్నారు. కొందరు అన్నం వండుతున్నారు. అన్నం వండుతున్న వ్యక్తిని "మీరేమిటోల్లే ?" అని చక్రపాణి గారు అడిగితే "మేము హరిజనులం సార్" అని చెప్పిండట. "మీరు వండితే రెడ్డోల్లు, కాపోల్లు తింటరానే" అని సార్ మరో ప్రశ్న. "ఉత్తప్పుడు తినరు గాని ఇప్పుడు తింటరు సార్" అని ఆయన జవాబు. ఉద్యమంలో ఇటువంటి దృశ్యాలు సాధారణమైనవే. మనుషులు వాళ్ళే. కానీ సందర్భం వేరు అయినప్పుడు వారి వ్యవహారంలో మార్పు ఎందుకు చోటు చేసుకుంటుంది? ఉద్యమం మనిషిని డి క్లాసిఫై చేస్తుంది. ఉద్యమానంతరం కూడా ఈ విలువను తెలంగాణ సమాజం నిలుపుకోవాలి. అప్పుడు మాత్రమే ఉద్యమానికి నిజమైన సాఫల్యత. తెలంగాణలో సామాజిక న్యాయానికి గట్టి పునాది పడుతుంది. ఇది అనుకున్నంత సులువైనదేమి కాదు. ఒక్క రోజుతో సాధించేది కాదు. నిరంతరంగా ఈ భావన, ఈ ఉద్యమ స్ఫూర్తి ప్రవాహంలాగా కొనసాగాలి. ఉద్యమ శ్రేణులు ఆ విలువను కొనసాగించడానికి కృషి చెయ్యవలసి ఉన్నది. పదేళ్ళ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమం సాధించిన విలువలు, జాతి భావన ఇంకా కొనసాగుతున్నాయా? అన్న అంశాన్ని తెలంగాణ బుద్ధిజీవులు మథింపు వేయాల్సిన సందర్భం ఇది.

*(తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేండ్లు గడచిన సందర్భంగా..)*

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే,
m : 94910 60585
e : deshpandesri@gmail.com

# సాహిత్యం న్యాయమూర్తులకి కూడా..

న్యాయవాదులకి, న్యాయమూర్తులకి చట్టం శాసనాలు తెలిస్తే సరిపోదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియాలి. సాహిత్యం తెలియాలి. సంస్కృతి, తత్వశాస్త్రం, చరిత్ర, సామాజిక జీవనం కూడా తెలియాలి. ఇవి అన్నీ తెలిసినప్పుడే వారు సరైన తీర్పులని వెలువరించగలరు. చట్టం, సాహిత్యం రెండు వేర్వేరు సబ్జెక్టులుగా కనిపిస్తాయి. కానీ రెండింటికి అవినావభావ సంబంధం ఉంది. చట్టం అనేది సమాజాన్ని నియంత్రించే నియమాలు నిబంధనల గురించి చెబుతుంది. సాహిత్యం అనేది సమాజం గురించి అదే విధంగా సమాజంలోని వ్యక్తులని కళాత్మకంగా వ్యక్తీకరించే ఒక రూపం.




సాహిత్యం తరుచుగా సాంస్కృతిక, సామాజిక, రాజకీయ విలువలని, నిర్దిష్ట సమయంలో ఎలా వున్నాయన్న విషయాలని మనకి చూపిస్తుంది. చరిత్రలో కనిపించని జీవన విధానం వునికి సాహిత్యంలో కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా కథల్లో, నవలల్లో, నాటికల్లో ఇవి ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. విలియమ్ షేక్స్పియర్ రాసిన ‘ది మర్చంట్ ఆఫ్ వెన్సీస్’, మేజర్ ఫర్ మేజర్ వంటి నాటికలు అప్పటి ఇంగ్లాండ్‌లోని న్యాయవ్యవస్థని ప్రతిబింబిస్తాయి. అప్పటి న్యాయ పాలన చక్రవర్తి శక్తి, న్యాయవ్యవస్థ పాత్ర ఈ నవలలు చదివితే మనకు అర్థమవుతుంది.

అదే విధంగా “ప్రైడ్ అండ్ ప్రిజుడీస్” వంటి రచనల ద్వారా 19వ శతాబ్దంలో స్త్రీలు ఎదుర్కొంటున్న చట్టపరమైన విషయాలు, సామాజిక పరిమితులు మనకు కన్పిస్తాయి. సాహిత్యం అనేది చట్టం మీద విమర్శగా కూడా ఉపయోగపడుతుంది. చట్టంలోని లోపాలను పరిమితులను సాహిత్యం ఎత్తి చూపుతుంది. న్యాయం అసమానత, అధికార దుర్వినియోగం వంటి ఇతివృత్తాల మీద ఎన్నో రచనలు వచ్చాయి. చార్లస్ డికెన్స్ రాసిన బ్లీక్ హేవుస్‌లో చాన్సరీ కోర్టులో జరిగే సుదీర్ఘమైన, ఖరీదైన చట్టపరమైన ప్రక్రియను, ఆ కోర్టుల్లో జరుగుతున్న అవినీతిని వ్యంగ్యంగా చూపించాడు.

కోర్టుల్లో బహిరంగంగా విమర్శ చేయలేని విషయాలని సాహిత్యంలో చేయడానికి అవకాశం వుంటుంది. ఈ పనిని ఇంగ్లీషనులో సాహిత్య సృజన చేసే రచయితలే కాదు, తెలుగు వాళ్ళు కూడా చేశారు. తమ రచనల్లో కోర్టులని నిశితంగా విమర్శించారు.

‘ఎవరి కోసం’ అన్న కథలో కోర్టులు ఎవరి కోసం వున్నాయన్న విషయాన్ని రచయిత ఆ కథలోని పాత్రల ద్వారా చెప్పిస్తాడు. కథలోని విషయానికి వస్తే ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ముందు ప్రవీణ్ అతని మిత్రులు ధర్నా చేస్తారు. పోలీసులతో మాటా మాటా పెరుగుతుంది. దానితో పోలీసులు ప్రవీణ్ మీద అతని స్నేహితుల మీద క్రిమినల్ కేసుని పెడతారు. అది పెద్ద సీరియస్ నేరం కాదు. బెయిల్ తీసుకోవడానికి అవసరమైన అన్ని చర్యలని ప్రవీణ్ తీసుకుంటాడు. పోలీసులు ఒక వేళ అరెస్టు చేస్తే, మెజిస్ట్రేట్‌ని బెయిల్ ఇవ్వమని కోరాలని అనుకుంటాడు. అతని న్యాయవాది కూడా అదే సలహా ఇస్తాడు. జామీన్ కాగితాలని కూడా తయారు చేసుకుంటాడు.

శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రవీణ్‌ని అతని స్నేహితులు నలుగురిని పోలీసులు అరెస్టు చేస్తాడు. ఆ తరువాత రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో మారేడ్‌పల్లిలో వున్న మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తారు. రిమాండ్ చేసే ముందు రొటీన్‌గా అడిగే ప్రశ్నలను మేజిస్ట్రేట్ వాళ్ళని అడుగుతాడు. పోలీసులు కొట్టినారా? ఆ తరువాత వాళ్ళని రిమాండ్ చేయడానికి ఉద్యుక్తుడవుతాడు. అది గమనించి ప్రవీణ్ తమకు బెయిల్ ఇవ్వండని మేజిస్ట్రేన్‌ను కోరతాడు. ‘ఈ రాత్రి బెయిలా’ అని మేజిస్ట్రేట్ అతని వైపు వింతగా చూస్తాడు. ఇద్దరి మధ్య కొంత సంభాషణ జరుగుతుంది. సోమవారం రోజు కోర్టులో బెయిల్ దరఖాస్తు పెట్టుకోవాలని మేజిస్ట్రేట్ అతనితో అంటాడు. దానితో ప్రవీణ్‌కి ఆవేశం ముంచుకొస్తుంది. అతను మేజిస్ట్రేట్‌తో ఇలా అంటాడు.

‘అవును సార్! బెయిల్ అడుగుతున్నాను. సెలవు రోజుల్లో ఆర్నాబ్ గోస్వామికి సుప్రీంకోర్టు రిట్ పిటీషన్ విచారిస్తూ బెయిల్ మంజూరు చేయగా లేనిది, అదే విధంగా నారాయణ విద్యాసంస్థల యజమాని నారాయణని రాత్రిపూట మేజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేయగా లేనిది మాకు బెయిల్ ఇస్తే తప్పేమిటీ? మేమేమీ హత్యలాంటి ఘోరమైన నేరం చేయలేదు. ధర్నా చేసాం అంతే!’ అంటాడు.

అతని మాటలతో మేజిస్ట్రేట్ కొంత ఆలోచనల్లో పడతాడు. కానీ బెయిల్ దరఖాస్తుని అతని నుంచి స్వీకరించడు. అతని

న్యాయవాది కోసం వేచి వుండడు పోలీసులు ప్రవీణ్‌ని, అతని స్నేహితులని తీసుకొని బయటకు వెళ్తారు.

ఇక్కడితో కథ అయిపోదు. మేజిస్ట్రేట్ మనస్సులో ఏముందో రచయిత చెబుతాడు. మేజిస్ట్రేట్ మనస్సులో ఇలా అనుకుంటాడు. 'మీరేమి ఆర్నాబ్ గోస్వాములు కాదు, నారాయణ కూడా కాదు.

పోలీసులు, కోర్టులు ఎవరికోసం వున్నాయో ప్రవీణ్‌కి, అతని మిత్రులకి అర్థమవుతాయి.



చట్టం అనేది సాహిత్యంలో చోటు చేసుకుంటుంది. చట్టపరమైన విషయాలు కూడా సాహిత్యంలో భాగమవుతాయి. తెలుగు కథ మామూలుగా నడుస్తుంది. కానీ న్యాయవ్యవస్థ తీరుతెన్నులని బహిర్గత పరుస్తుంది. కోర్టులు, చట్టాలు, పోలీసులు ఎవరి కోసం వున్నాయో చెబుతుంది. పలుకుబడి, అధికారం, డబ్బు వున్న వ్యక్తుల కోసమే కోర్టులు పని చేస్తున్నాయన్న విషయాన్ని బట్టబయలు చేస్తుంది. మేజిస్ట్రేట్ కోర్టు దగ్గర నుంచి సుప్రీంకోర్టు దాకా కోర్టులు వాళ్ళ కోసమే పని చేస్తున్నాయన్న విషయాన్ని నాలుగు మాటల ద్వారా చెబుతుంది. అంతే కాదు, న్యాయమూర్తుల గురించి కూడా చెబుతుంది. న్యాయమూర్తుల వైఖరులని చర్చించడానికి ఇది ఉపయోగపడుతుంది.

చివరికి చెప్పేది ఏమంటే సాహిత్యానికి, చట్టానికి సంక్లిష్టమైన సంబంధం వుంది. చట్టంలోని లోపాలను పరిమితులని సాహిత్యం విమర్శిస్తుంది. వ్యాసానికి, సాహిత్యానికి భేదం వుంది. వ్యాసంలో జీవన విధానం మానసిక పరిశీలన, సంఘర్షణ కన్పించదు. కథలో నవలలో అది కన్పిస్తుంది. సాహిత్య అధ్యయనం ద్వారా సమాజ స్వభావం తెలుసుకోవడానికి వీలు చిక్కుతుంది. సాహిత్యంలో చట్టం వుండటం వల్ల ఫలప్రదమైన దృక్పథం ఏర్పడుతుంది.

న్యాయమూర్తికి చట్టం మాత్రమే తెలిస్తే సరిపోదు. సాహిత్యం తెలియాలి. మానవ భావోద్వేగాలు తెలియాలి. అవి తెలియ డానికి అతని అనుభవమే కాదు సాహిత్యం దోహద పడుతుంది. సాహిత్యం మాత్రమే కాదు చరిత్ర తెలియాలి, భావ్యం తెలియాలి. న్యాయమూర్తికే కాదు, న్యాయవాదులకి ఈ విషయాలు తెలియాలి. అప్పుడే సరైన న్యాయం జరిగే అవకాశం వుంది.

-మంగారి రాజేందర్ (జింబో)

m : 9440483001

e : rajenderzimbo@gmail.com

దక్కన్ హెరిటేజ్ అకాడెమీ ప్రచురణ


తొలుత తెలుగు రాతిరాత

తొలుచువాండ్రు

శ్రీరామోజు హరగోపాల్

**పుస్తకం లభించే చిరునామా :**

ప్రముఖ పుస్తక కేంద్రాలు మరియు
దక్కన్ హెరిటేజ్ అకాడెమీ
'భూపతి సదన్' 3-6-716,
స్ట్రీట్ నెం. 12, హిమయాత్‌నగర్,
హైదరాబాద్-500029.
మొ : 9030626288



# చదువులో వెనుక ఉన్న గద్వాల జిల్లాకు

# ప్రత్యేక విద్యా ప్రణాళికను రూపొందించాలి

పూర్వపు (యునైటెడ్) మహబూబ్‌నగర్ జిల్లా నుండి ఏర్పాటైన జోగులాంబ గద్వాల్ తెలంగాణ అక్షరాస్యత చూస్తే రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన జిల్లాలలో ఒకటి. 2011 జనాభా లెక్కల ప్రకారం, జిల్లాలో అక్షరాస్యత రేటు కేవలం 49.87% స్త్రీల అక్షరాస్యత రేటుకు 39.48% మాత్రమే. ఎస్సీ మరియు ఎస్టీ వర్గాల మహిళల్లో ఈ రేట్లు 37.65% మరియు 30.44%తో అత్యంత వెనుకబాటులో ఉంది.

2022-23లో జిల్లాలో 6-14 సంవత్సరాల వయస్సు గల మొత్తం 1,12,312 మంది పిల్లలలో దాదాపు 68.5% (76,907) మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ పాఠశాలలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. UDISE 2021-22 ప్రకారం, జిల్లావ్యాప్తంగా 641 ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 244 పాఠశాలల్లో అవసరమైన ఫర్నీచర్ ఉండగా, 440 పాఠశాలల్లో మాత్రమే క్రీడా మైదానం ఉంది. బాలికల మూత్రశాలలు 399 పాఠశాలల్లో మాత్రమే పని చేస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఉన్నామని చెప్పుకుంటున్న సమయంలో జిల్లాలో 244 పాఠశాలల్లో మాత్రమే కంప్యూటర్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మరియు వీటిలో 118 మాత్రమే ఇంటర్నెట్ కనెక్టివిటీని కలిగి ఉన్నాయి. మౌలిక వసతులు లేక ఉపాధ్యాయులు విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. అంతే కాకుండా ఇలాంటి స్థితిగతులను చూసి ఉపాధ్యాయులు జిల్లా నుండి బదిలీ అయి వెళ్లిపోతున్నారు.



ఇక జిల్లాలలో ఉపాధ్యాయుల కొరత రాష్ట్రంలోనే అత్యధికం. విద్యా హక్కు చట్టం ప్రకారం ఒక అంచనా ప్రకారం కావలిసిన ఉపాధ్యాయులను అంచనా వేసినట్లయితే జిల్లాకు 3,522 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. అవసరం బట్టి కాకుండా విద్యా శాఖ మాత్రం ఉన్న ఖాళీలనే భర్తీ చేస్తామని జిల్లాకు కేవలం 176 మంది ఉపాధ్యాయుల కోసమే నోటిఫికేషన్ వేశారు. ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షణ అధికారుల కొరత కారణంగా గద్వాల జిల్లా విద్యార్థుల విద్యా ప్రమాణాలు అతి తక్కువగా ఉన్నాయని జాతీయ, రాష్ట్ర స్థాయి నివేదికల ద్వారా అర్థం అవుతుంది.

తెలంగాణ విద్యాశాఖ మరియు SCERT సంయుక్తంగా మూడవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వార్షిక ఎఫ్, ఎల్, ఎన్ అసెస్‌మెంట్ నివేదిక ప్రకారం తెలుగులో కేవలం 16% మంది విద్యార్థులు గణితంలో కేవలం 23% విద్యార్థులు మాత్రమే మూడవ తరగతి స్థాయి సామర్థ్యాలు కలిగి ఉన్నారని తెలిసింది. అంటే అత్యధిక శాతం మంది విద్యార్థులకు చదవడం రాయడం రాదని అర్థం.

ఇక నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (NAS) - 2021 యొక్క ఫలితాలు ఇంకా ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. జిల్లాలో 10వ తరగతి విద్యార్థులు తెలుగులో 33%. మంది గణితంలో కేవలం 27%. మంది విద్యార్థులు మాత్రమే పదవ తరగతి సామర్థ్యాలు కలిగి ఉండడం విచారకరం. SC, ST మరియు BC వర్గాల విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు ఇంకా తక్కువని ఈ నివేదికలు తెలియ చేస్తున్నాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ జిల్లాల పనితీరు గ్రేడింగ్ ఇండెక్స్ ప్రకారం ప్రకారం కూడా మౌలిక సదుపాయాల విషయంలో దేశంలో ఉన్న 738 .జిల్లాలకు గద్వాల జిల్లా 605 స్థానం ఉంది.

విద్యా స్థితి గతులు సరిగ్గా లేని కారణంగా బడిలో చేరని పిల్లలు కొందరైతే చేరిన పిల్లలు కూడా బడి మానేసి సీడ్ పత్తి తోటలలో వ్యవసాయ పనులలో బాల కార్మికులుగా మారిపోతున్నారు. అంతే కాకుండా జిల్లాలోని దాదాపు మొత్తం 13 మండలాల నుండి పిల్లలు వివిధ రంగాలలో పని చేయడానికి గణనీయమైన సంఖ్యలో జిల్లా మరియు దేశంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

జిల్లాలో విద్యార్థులకు ఇంకో ప్రధాన సమస్య ప్రజా రవాణా సౌకర్యాలు మరియు రోడ్డు కనెక్టివిటీ అందుబాటులో లేకపోవడం వలన ఉన్నత పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు ఇంటర్ చదివే



విద్యార్థులు అనేక ఇబ్బందులకు ఎదురుకుంటున్నారు. గ్రామాల గుండా ప్రజా రవాణా యొక్క ఫ్రీక్వెన్సీ తక్కువగా ఉంది మరియు రద్దీ కారణంగా కొన్ని ప్రదేశాలలో బస్సులు ఆగవు. వారి షెడ్యూల్ కళాశాల సమయాలకు అనుగుణంగా లేదు మరియు కళాశాలకు వెళ్లే చాలా మంది విద్యార్థులు ఆలస్యంగా చేరుకుంటారు. కొన్ని రూట్లలో బస్సులు కూడా నిలిపివేయబడ్డాయి. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి తర్వాత బాలికల హాజరు మరియు నిలుపుదలపై ప్రభావం చూపింది. అంతే కాకుండా ఆడపిల్లలు చదువులు మానేయవలసి వస్తుంది. బాల్య వివాహాలకు కూడా ఈ పరిస్తితికి ఒక కారణమే.

ఇలాగే పరిస్థితులు కొనసాగితే ఒక తరాన్ని విద్యకు దూరం చేసిన తరంగా అందరం చేరిపోతున్నాం. ఈ పిల్లలంతా అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, పేదవర్గాల బిడ్డలు. తక్షణం చర్యలు తీసుకోకపోతే ఈ విష వలయంలో తిరుగాడుతూనే ఉంటారు. ఈ నిర్లక్ష్య ప్రభావం ఇప్పుడు కాదు, ఇంకో పదేళ్ళకు తెలుస్తుంది. రాబోయే తరం విద్యలేక, ఉపాధి అవకాశాలు లేక లక్షలాది మంది చాలా ఇబ్బంది పడతారు. నైపుణ్యం లేని నిర్లక్ష్య రాన్యులుగా, అసంఘటిత రంగంలో నిస్సహాయంగా దోపిడీ గురి కాబడే రెండవ తరగతి పౌరులుగా, వలస కూలీలుగా మిగిలిపోతారు. అతి పేదరికంలోకి నెట్టి వేయబడుతారు.



అందుకే ఈ పరిస్తితిని ఎడ్యుకేషన్ ఎమర్జెన్సీగా గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలి. జోగులాంబ గద్వాల జిల్లా విద్యా సమస్యలు అన్ని జిల్లాలకంటే భిన్నంగా ఉన్నందు వలన ఈ సంక్షోభ పరిస్థితిని ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిగణించాలని జిల్లాకు ప్రత్యేక అదనపు నిధులు కేటాయిస్తూ జిల్లాకు "ప్రత్యేక విద్యా ప్రణాళిక" రూపొందించాలి. ఈ విషయంలో జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ చాలా అవసరం. ఈ పరిస్థితిని గట్టు కె.టి దొడ్డి మండలాల యువతి యువకులకు వివరించినప్పుడు మంచి స్పందన వచ్చింది. మా వంతుగా ఎండా కాలం సెలవులలో మా మండల విద్యార్థులకు చదువులతో పాటు ఆట పాటలను అందిస్తామని ముందుకు రావడం ఎంతో సంతోషించ వలసిన అంశం.

### వేసవి చదువుల పండుగ

### బాల్యానికి భరోసా నిస్తామని కదిలిన యువత:

భారత ప్రజలమైన మేము.... అంటూ హాలు నిండా ఉన్న యువతి యువకులు భారత రాజ్యాంగ పీఠికను చేతులు ముందుకు చాచి గర్వంగా చదువుతుంటే దేశ యువత సామాజిక స్పృహతో లేరనే వాదనలన్ని తప్పు వాదనలని అనిపించింది. గద్వాల జిల్లా కె.టి. దొడ్డి, గట్టు మండలం బాలలకు రక్షణగా ఉంటామని ఎండాకాలంలో ప్రతి గ్రామంలో బాలలను ఆట పాటలు ఆడిస్తూ చదువులో ఆసక్తిని పెంచి మళ్ళీ తిరిగి బడికి ఆత్మ విశ్వాసంతో తరగతిలోకి మా మండలాల పిల్లలు అడుగు పెట్టాలని 'వేసవి చదువుల పండుగ' అనే విన్నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టటానికి దాదాపు 150 మంది యువతి యువకులు తరలి వచ్చారు. జిల్లా విద్యా శాఖ ఈ ఉత్సాహాన్ని చూసి ఎం.వి. ఫౌండేషన్ తీసుకున్న ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ రిసోర్స్ పర్సన్స్ బాలలకు నేర్పే మెళుకువలను శిక్షణ ఇవ్వడానికి అనుమతిచ్చారు.

శిక్షణ కంటే ముందు యువతి యువకులకు కార్యక్రమ ఉద్దేశ్యాన్ని చెప్పడానికి గ్రామాలలో యువతీ యువకులకు సమావేశాలు పెట్టడం జరిగింది.

ఇలాంటి సమావేశాలు చాలా చూసాము ఏం ఉపయోగపడవు అన్నారు. వారికి తమ గ్రామములలో ఉన్న పిల్లల గురించి అని చెప్పడం జరిగింది. పిల్లలు చాలా మంది వివిధ రకాల పనులు చేస్తున్నారని. రోజు బడికి పోతున్న పిల్లలకి తరగతికి దగ్గ చదువు రావడం లేదని ఎండా కాలంలో పిల్లలు ఎండకు తిరుగుతూ చదువుకు దూరం పనికి దగ్గర అవుతారని. అంతకు ముందు నేర్చుకున్నది కూడా మరచి పోతారని ఈ పిల్లల తల్లిదండ్రులు నిరక్ష రాశుయులని వారికి ఈ పిల్లలకు చదువులో సహాయం చేయడం తెలియదని వివరించడం జరిగినది.

ఇలాంటి నేపథ్యం ఉన్న పిల్లల కోసం రోజుకు రెండు గంటలు స్వచ్ఛందంగా ఏమి ఆశించకుండా బాధ్యత తీసుకోవచ్చా అని అడిగినప్పుడు వారికున్న సందేహాలను క్లియర్ చేసినంక యూత్





స్పందించి పిల్లలకు నేర్పిస్తే బాగానే ఉంటుంది అన్నారు. రోజు రెండు గంటలు అయితే చెప్పగలుగుతాము అని అన్నారు. అలాగే మా గ్రామ పిల్లలకు మేము చదువుతో పాటు ఆట పాటలు నేర్పించడం మాకు సంతోషం అన్నారు. ఉదయం చెప్పుతామని కొంతమంది అన్నారు. మరి కొంత మంది సాయంత్రం చెపుతాము అన్నారు. ఈ విధంగా అన్ని గ్రామాల నుండి సమావేశాలు పెట్టి యూత్‌ను ఒప్పించడం జరిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి అంటే ఇందులో మహిళా యూత్ ఎక్కువగా ముందుకు రావడం జరిగింది.



ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో Dial your village సభ్యులు పదకొండు రోజుల 'పాలమూరు యాత్ర'లో భాగంగా ఈ రెండు మండలాలలోని కొన్ని గ్రామాల యువతీ యువకులు తమ గ్రామం కోసం ఏదో ఒకటి చేయాలానే స్ఫూర్తి పొందినట్లు చెప్పారు.

మొత్తం వంద మంది సిద్ధమయ్యారు. ఇందులో 54 మంది యువకులు 66 మంది యువతులు పాల్గొన్నారు. అందరు కూడా ఇంటర్, డిగ్రీ, BED, TTC చేసిన వాళ్ళు ఉన్నారు. అందరు కూడ తెలుగు, గణితం మీద ప్రభుత్వ ఉపాధ్యాయులతో ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ట్రైనింగ్ తర్వాత మరింత ఉత్సాహంతో అందరు పిల్లలకు నేర్పిస్తాము అన్నారు. ప్రతి గ్రామానికి ఇద్దరు, ముగ్గురు, నలుగురు ముందుకు రావడం జరిగింది. 58 గ్రామాలలో దాదాపు 103 మంది నమోదు చేసుకున్నారు. రెండు మండలాలలో 3,654 మంది పిల్లలకు 103 సెంటర్స్ ప్రారంభించడం జరిగింది. ఈ పిల్లలు 5వ తరగతి నుండి 8వ తరగతి చదువుతున్న పిల్లలు వేసవి చదువుల పండుగలో పాల్గొంటున్నారు. మొదలు పెట్టి మూడు నాలుగు రోజులే అయినా యువత పిల్లలతో మమేకమైన తీరు గ్రామస్థులను తల్లిదండ్రులను అబ్బుర పరుస్తుంది. పిల్లల కేరింతలు ఆటలు పాటలు ఈలలతో గ్రామాలు బాల్యానికి భరోసా నిస్తున్న యువతి యువతులకు నీరాజనాలు పడుతున్నారు. వేసవి సెలవులు అయిపోయి మళ్ళీ బడులు తెరిచే వరకు ఈ చదువుల పండుగ కొనసాగుతుంది.

ముగింపు సమావేశంలో గట్టు, కె.టి.దొడ్డి యువతి యువకులమైన మేము బాల్యానికి భరోసా నిచ్చామని రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన మూల సూత్రాల స్ఫూర్తి అయిన సమానత్వాన్ని భావితరాలకు అందిస్తూ, సమాజ ప్రజాస్వామీకరణలో తమ వంతుగా భాగ్యస్వామ్యం అయ్యామని తలెత్తుకుని గర్వంగా ఈ దేశ యువతకు సందేశం ఇస్తారనే గట్టి విశ్వాసం కలిగింది. యువత తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా కలెక్టర్ గారు, జిల్లా విద్యా శాఖ అధికారులు, మండల అధికారులు సానుకూలంగా స్పందించి అన్ని రకాల సలహాలు సూచనలు చేయడంతో యువతకు మరింత ఉత్సాహన్ని ఇచ్చింది.

జిల్లాలో రెండు మండలాల యువత చేపట్టిన చదువుల ఉద్యమం మరింత మందికి స్ఫూర్తి నివ్వాలని అదే విధంగా ప్రజా ప్రతినిధులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గారు, మంత్రి, ముఖ్య మంత్రి గారు జోగులాంబ జిల్లాకు ప్రత్యేక విద్యా ప్రణాళికను రూపొందించి విద్యార్థులకు అండగా ఉంటారని ఆశిద్దాం.

**–ఆర్.వెంకట్ రెడ్డి**
జాతీయ కన్వీనర్, ఎం.వి.ఫౌండేషన్
m: 9949865516
e: venkatmvf@gmail.com

# బాల కార్మిక నిర్మూలన




ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం జూన్ 12న జరుపుకుంటారు. దీనిని ఎందుకు సమర్థించాలో తెలుసుకుందాం. ప్రతి సంవత్సరం జూన్ 12న బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రపంచ బాల కార్మిక దినోత్సవం జరుపుకుంటారు. చిన్నారులను పనిలో చేర్చడానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త ఉద్యమానికి ఉత్ప్రేరకంగా పనిచేయడం దీని లక్ష్యం. ప్రజలు, ప్రభుత్వాలు దీనికి మూలకారణంపై దృష్టి సారించి, సామాజిక న్యాయం, బాల కార్మికులు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని అర్థం చేసుకుంటే బాల కార్మిక వ్యవస్థను ప్రపంచం నుండి నిర్మూలించవచ్చని ఐక్య రాజ్యసమితి విశ్వసిస్తోంది.

సామాజిక న్యాయాన్ని సాధించడానికి ఐక్య రాజ్య సమితి ఈ రోజు పిలుపునిస్తోంది. సామాజిక న్యాయం దిశగా బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పిల్లలందరికీ చట్టపరమైన రక్షణను అందిస్తుంది.

ఈ సంవత్సరం 21వ ప్రపంచ బాల కార్మికుల వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దాదాపు రెండు దశాబ్దాలుగా బాల కార్మికులను తగ్గించడంలో స్థిరమైన పురోగతి కనిపిస్తోంది. అయితే సంఘర్షణలు, సంక్షోభాలు, కోవిడ్-19 మహమ్మారి మరిన్ని కుటుంబాలను పేదరికంలోకి నెట్టాయి. లక్షలాది మంది పిల్లలను బాల కార్మికుల వ్యవస్థలోకి నెట్టాయి.

ఇది తీవ్రమైన సమస్య అని ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం గుర్తుచేస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. చిన్నారుల హక్కులను, సాధారణ బాల్యాన్ని దోచుకుంటున్నారు. వారు కఠినమైన పరిస్థితులలో పని చేయవలసి వస్తోంది. తరచుగా ప్రమాదాలకు, గాయాలకు గురవుతున్నారు. ఈ అమానవీయ ఆచారాన్ని నిర్మూలించే సందేశాన్ని విస్తరించడానికి ఈ రోజును సమర్థించడం, పాటించడం చాలా ముఖ్యం.

ఐక్యరాజ్యసమితి యొక్క అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు 160 మిలియన్ల మంది పిల్లలు బాల కార్మికులుగా మారారు. అంటే ఇది ప్రతి10 మంది పిల్లలలో ఒకరు బాలకార్మిక వ్యవస్థలో మగ్గుతున్నారని సూచిస్తోంది.

2000 నుండి 2020 వరకు బాల కార్మికులు 85.5 మిలియన్ల మేర తగ్గారు. ప్రపంచవ్యాప్తంగా 26.4 శాతం మంది పిల్లలు మాత్రమే సామాజిక రక్షణ నగదు ప్రయోజనాలను పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లల సామాజిక రక్షణ కోసం జీడీపీలో 1.1 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ఇక ఆఫ్రికాలో పిల్లల కోసం జీడీపీలో 0.4 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ఇది గమనించదగిన విషయం.

– దక్కన్‌న్యూస్

m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# కరీంనగర్ జిల్లాలో కనుగొన్న
# పురాతన నాణేల చారిత్రక ప్రాముఖ్యత

**పరిచయం:**

గతంలో ఎలగందల్‌గా పిలువబడిన కరీంనగర్ చరిత్రలో ఎంతో గొప్పది. ఈ ప్రాంతం పేరు మార్పు అసఫ్ జా VI, మీర్ మహబూబ్ అలీ ఖాన్ (1800-1911), పాలనలో జరిగింది. ఆయన ఇతర తెలంగాణ పట్టణాలు మరియు నగరాల పేర్లను కూడా మార్చారు. ఇందూర్ (నిజామాబాద్) బీ మహబూబ్ నగర్ (పాలమూరు), మెతుకు (మెదక్), మానుకోట (మహబూబాబాద్), భువనగిరి (భోంగిర్ ), ఎద్దులాపురం (ఆదిలాబాద్), పొనుచెర్ల (హుజూర్‌నగర్).

ఎలగందల్ కోట సామన్య శకం 1303లో ఢిల్లీ సుల్తాన్ జలాలుద్దీన్ ఖాల్జీ అల్లుడు గార్షస్ప్ మాలిక్ సైన్యాలతో భీకర యుద్ధాన్ని ఎదుర్కొంది. కాకతీయ సైన్యాలు శత్రువులను ఓడించాయి. పురాతన భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ రాజ వంశాలలో శాతవాహన ఒకటి. ఇది భారతదేశంలో అర్ధభాగం నుంచి మూడో వంతు భూభాగాన్ని రెండు వందల సంవత్సరాలు పాలించింది. ఇది పురాతన భారతీయ చరిత్రలో అత్యంత శాంతియుత, సుసంపన్నమైన కాలం. శాతవాహనులు అమరా వతి అని పిలువబడే ఒక రకమైన కళను పోషించారు. ఈ కళారీతి శిల్పాలు బ్రిటిష్ మ్యూజియంలోని భారతీయ పెవిలియన్‌లో కొలువుదీరాయి.



శాతవాహనుల మొదటి రాజధాని గోదావరి నది ఒడ్డున కరీంనగర్‌కు ఉత్తరాన 85 కిలోమీటర్ల దూరంలోని కోటలింగాలలో ఉంది. వారి రెండవ రాజధాని కరీంనగర్ నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దబొంకూరులో ఉంది. కరీంనగర్ జిల్లాలో నిధి నిక్షేపాల్లో, అలాగే ఈ జిల్లాలోని త్రవ్వకాలలో దొరికిన పురాతన నాణేలను ప్రజెంట్ కమ్యూనికేషన్స్ వర్ణిస్తుంది మరియు వాటి ప్రాముఖ్యత డాక్యుమెంట్ చేయబడింది:

కరీంనగర్ సెంట్రల్ ట్రెజరీ సూపరింటెండెంట్ 1921 జూలై 16వ తేదీన హైదరాబాద్‌లోని పురావస్తు శాఖకు ఉత్తరం నం.446లో 367 పంచ్ మార్క్ నాణేలతో కూడిన కరీంనగర్ నిధిని రిఫర్ చేశారు. పురావస్తు శాఖ వార్షిక నివేదికలో ఆ సంవత్సరంలో ఈ జిల్లాలో దొరికిన 20 బంగారు నాణేలతో పాటు ఈ నాణేలను శ్రీనివాస్ జాబితా చేశారు. ఆయన 1928-1929 వార్షిక నివేదికలో కరీంనగర్‌తో సహా 420 పంచ్ మార్క్ నాణేలను విశ్లేషిం చారు. ఆయన ఈ నాణేలను ఐదు సమూహాలుగా విభజించారు. వాటి బరువులు 39-53 గింజల మధ్య ఉన్నాయి. ఈ నాణేల సగటు బరువు 46 గింజలు. 58 గింజల బరువు ఈ నాణేల ప్రామాణిక మింట్ బరువుగా తీసుకోబడింది.

ఈ నాణేలు 5-6 శతాబ్దాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం చెలామణిలో ఉన్నాయని, 100 సంవత్సరాల చలామణిలో సగటు బరువు నష్టంను 1 - 1/2 గింజలుగా లెక్కించాలని ఆయన సూచించారు. ఆ రోజుల్లో మన దేశంలో పంచ్ మార్క్ నాణేలపై ఇది చాలా ముఖ్యమైన అధ్యయనం. ఈ పంచ్-మార్క్ నాణేలు మగధ, నంద, మౌర్య, సుంగ, కణ్వ రాజవంశాల నుండి ప్రారంభమైన మొదటి జాతీయ కరెన్సీ నాణేలు. 2000 సంవత్సరాల క్రితం ఉత్తరాది - దక్షిణం మధ్య చురుకైన వాణిజ్యం ఉందని రుజువు చేసిన హైదరా బాద్ మ్యూజియంలోని పంచ్ మార్క్ నాణేలలో ఈ నాణేలలో అపారమైన రకాలు, తక్షశిలా వంటి ఉత్తరాదిలో మాత్రమే లభించిన కొన్ని రకాలు ఉన్నాయి.

చిహ్నాల ఆధారంగా వివిధ రకాలైన పంచ్ మార్క్ నాణేలు మన దేశంలోని పెద్ద ప్రాంతాలను పాలించిన రాజవంశాలచే జారీ చేయబడతాయని కూడా ఈ అధ్యయనం వెల్లడించింది. 1960లో ప్రచురించబడిన పరమేశ్వరి లాల్ గుప్తా ఈ నాణేల అధ్యయనంలో ఈ నాణేలు ప్రధాన భాగమయ్యాయి. కరీంనగర్ నిధులలో లభించిన నాణేలు మౌర్యులు, వారి కాలం నాటివిగా విభజించబడ్డాయి. ఆంధ్ర అశోక సామ్రాజ్యంలో భాగమని అందరికీ





తెలుసు. జొన్నగిరి వద్ద ఉన్న ప్రధాన శిలా శాసనం, రాజుల మందగిరి వద్ద మైనర్ శిలా శాసనాన్ని బట్టి ఈ విషయం నిరూపించబడింది. ఈ రెండు ప్రదేశాలు కర్నూలు జిల్లాలో ఉన్నాయి.

అశోకుని మూడవ శాసనం అమరావతిలో కనుగొనబడింది. జొన్నగిరి అశోకుని దక్షిణ రాజధాని. కరీంనగర్‌లో లభించిన మౌర్యుల నాణేలు ఈ ప్రాంతం అశోక సామ్రాజ్యంలో భాగమని రుజువు చేస్తుంది. ఈ ప్రాంతాలు ఎప్పుడు మగధ రాజుల పాలన కిందకు వచ్చాయో తెలియదు. ఈ ప్రాంతా న్ని స్వాధీనం చేసుకోవడానికి అశోకుడు కళింగ లాంటి యుద్ధం చేయ లేదు. కరీంనగర్ మరియు ఆంధ్రాలోని ఇతర ప్రాంతాలలో మౌర్యుల పూర్వ కాలపు నాణేలు కనుగొనడాన్ని బట్టి చూస్తే అశోకుడు ఈ ప్రాంతాలను వారసత్వంగా పొందాడు. భవిష్యత్ అధ్యయనాలు ఈ పరిశీలనలను స్పష్టం చేయవచ్చు.



సామాన్యశకం 1952 లో ముప్పై ఎనిమిది రోమన్ వెండి నాణేలతో పాటు ఎనిమిది పంచ్ మార్క్ నాణేల నుస్తులాపూర్ నిధి ఒక ముఖ్యమైన ఆవిష్కరణ. రోమన్ నాణేలు 1వ, 2వ శతాబ్దాలకు చెందినవి. పంచ్ మార్క్ నాణేలు 5వ-3వ శతాబ్దపు మౌర్యులు, పూర్వ మౌర్యుల కాలానికి చెంది నవి. ఈ నాణేలు మునుపటి కాలంలోని నాణేలు తదుపరి కాలంలో కరెన్సీ గా కొనసాగాయని నిర్ధారించాయి. నుస్తులాపూర్ నిధి మరొక ముఖ్యమైన ఆవిష్కరణ. దక్షిణ భారతదేశంతో రోమన్ వాణిజ్యం సముద్రం ద్వారా జరిగింది. అది భారతదేశానికి అనుకూలమైనది. రోమన్ నాణేలు రోమన్ రాజు బొమ్మపై కత్తిరించబడ్డాయి, ఆ తరువాత కరెన్సీగా చెలామణిలో కొనసాగాయి. పెద్ద సంఖ్యలో రోమన్ నాణేలు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో నిధినిక్షేపాలుగా లభించాయి. నాగార్జునకొండ, పెద్దబంకూరు మొదలైన తవ్వకాల్లో కనుగొనబడ్డాయి.

భారతదేశంలో పురాతన నాణేలపై మొట్టమొదటి కథనం సామాన్య శకం 1790 నాటిదని గుర్తుచేసుకోవడం ఆసక్తికరంగా ఉంది. ఈ నివేదిక సామాన్య శకం 1786లో నెల్లూరులో లభించిన రోమన్ నాణేల గురించి ఈ కథనం వచ్చింది. మానేరు నది ఒడ్డున ఉన్న నుస్తులాపూర్‌తో సహా తెలంగాణ లోని వివిధ ప్రాంతాలలో రోమన్ నాణేలు కనుగొనబడ్డాయి. మూసీ నదిపై పొడిచేడుకు సమీపంలోని నల్గొండలోని అక్కెనపల్లిలో రోమన్ నాణేల అతిపెద్ద భాండారం లభించడం విశేషం.

ఆ రోజుల్లో మూసీ నది వెంబడి వాణిజ్యం చురుగ్గా సాగేది. రోమన్ నాణేలు వాటి అనుకరణలతో సహా కనుగొనబడటం రోమ్ పురాతన తెలంగాణతో అటువంటి వాణిజ్యానికి రుజువు. నుస్తులాపూర్ మానేరు ఒడ్డున ఉంది. పంచ్ మార్క్, రోమన్ నాణేలు దొరకడాన్ని బట్టి చూస్తే అప్పట్లో ఇది ఒక ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ఉండాలి.

పెద్దబంకూరు తవ్వకంలో పురాతన నాణేల తదుపరి ప్రధాన ఆవిష్కరణ జరిగింది. ఈ నాణేల ఆవిష్కరణ కచ్చితమైన కాలం తెలియదు. పెద్దబంకూరు గుట్ట పక్కనే ఉన్న హనుమాన్ దేవాలయంలోని పూజారితో మాట్లాడినప్పటి దాన్ని బట్టి నేను గ్రహించింది ఏమిటంటే, నేల ఉపరితలంపైనే ఈ నాణేలు కనుగొనబడ్డాయి, ఇది సుమారు 40 సంవత్సరాల క్రితం నాటి తవ్వకాలకు దారితీసింది.

1960లలో ప్రభుత్వ మ్యూజియం క్యాబినెట్‌లోని 38512 నాణేలలో 24345 శాతవాహన నాణేలు పెద్దబంకూరుకు చెందినవి. ఈ నాణేలు శాతవాహన రాజులైన గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిస్ఠిపుత్ర పులుమావి, శాతకర్ణి IV, శివశ్రీ పులుమావి, యజ్ఞ శాతకర్ణి, మత్తరీపుత్ర శాతకర్ణికి చెందినవి.

ఈ రాజులు శాతవాహన వంశానికి చెందిన తదుపరి కాలపు రాజులు. తరువాతి పాలకుల నాటి నాణేలను కనుగొనడం వలన ఇది కోటలింగాల సమయంలో కాకుండా ఆ తరువాతి కాలంలో ఒక ముఖ్యమైన పట్టణంగా మారిందని రుజువు చేస్తుంది. విల్లు, బాణం, ఉజ్జయిని, నాగలి, చక్ర చిహ్నాలు కలిగిన రెండు

లిఖించబడని టెర్రకోట ముద్రలు పెద్దబంకూరు తవ్వకాల్లో కనుగొన బడ్డాయి. ఈ ప్రదేశంలో తవ్వకాలలో "కామస" అని చెక్కబడిన రాతి ముద్ర కనుగొనబడింది. పెద్ద బంకూరులో జరిపిన తవ్వకాల ఫలితాలను కృష్ణశాస్త్రి 1983లో ప్రచురించారు.

రామారావు 1960లలో హైదరాబాద్, మద్రాసు మ్యూజియంలలో శాతవాహన నాణేలను అధ్యయనం చేశారు. తెలంగాణలో శాతవాహన వంశానికి చెందిన పూర్వపు పాలకుల నాణేలు కనుగొనడం, తీరప్రాంత జిల్లాలలో అవి లేకపోవడం ఆధారంగా తెలంగాణ శాతవాహనుల నివాసంగా ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. 1978లో కోటలింగాల నాణేలు కనుగొనడం ద్వారా ఇది మరింత రుజువు చేయబడింది. పెద్దబంకూరు సైట్ కూడా ముద్రలు, రోమన్ నాణేలను అందించింది.



పెద్దబంకూరు శాతవాహనుల నాణేలను పెద్ద సంఖ్యలో అందించిన ముఖ్యమైన ప్రదేశం. శాతవాహనుల నాణేలు మన చరిత్ర జ్ఞానానికి గొప్పగా దోహదం చేశాయి. మత్స్య, వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత వంటి పురాణాలలో అందించబడిన శాతవాహన రాజుల సమాచారాన్ని అవి ధృవీకరించాయి. ఈ రాజులు ఉన్నారని, వారు పౌరాణిక వ్యక్తులు కాదని అవి నిరూపించాయి.

శాతవాహన రాజులకు సంబంధించిన అనేక అంశాలు ఈ నాణేల ద్వారా వెలుగు లోకి వచ్చాయి. ఉదాహరణకు శాతవాహనులది మాతృస్వామ్య సమాజం. వారు గౌతమీపుత్ర, వాసిస్తిపుత్ర మొదలైన వారి తల్లుల పేర్లను తీసుకున్నారు. వారు నాణేల తయారీకి సీసాన్ని ఇష్టపడ్డారు. ఇవి వేల సంవత్సరాల పాటు కొనసాగి ఆ రోజుల్లోని మెటలర్జికల్ నైపుణ్యాలను వెల్లడిస్తున్నాయి. ఈ నాణేలకు సంబంధించి అనేక ఇతర అంశాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. కర్ణుడి నాణేలను బట్టి చూస్తే పురాణాలలో ఆయన పేరు పేర్కొనబడలేదని కనుగొన్నారు. తద్వారా ఇది పురాణాలలో ఈ రాజుల జాబితా క్షుణ్ణంగా లేదనే విషయాన్ని రుజువు చేస్తుంది. ఇవన్నీ పెద్దబంకూరు నాణేలు వెల్లడించిన అంశాలు. సైట్‌లో మరింతగా తవ్వకాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ధూళికట్ట తవ్వకం, నాణేలను కనుగొనడం ఈ జిల్లాలో మరొక ముఖ్యమైన ఆవిష్కరణ. ధూళికట్ట స్థూపం వద్ద ఉన్న బౌద్ధ ప్రదేశం మౌర్యుల అనంతర కాలానికి చెందినది కానీ ఈ ప్రాంతం పూర్వ సామాన్య శకం ప్రదేశానికి చెందినది. ఇది పూర్వ సామాన్య శకం రెండవ శతాబ్దంలో బౌద్ధమతానికి చెందిన హీనయాన దశను అందించింది. అమరావతి, బట్టిప్రోలు స్థూపాలు మౌర్య కాలం నాటి హీనయాన దశకు చెందినవి అయితే తరువాతి కాలపు శాతవాహన మరియు ఇక్ష్వాకు ప్రాంతాలు బౌద్ధమత మహాయాన కాలాన్ని సూచిస్తాయి. ధూళికట్ట స్థూపం పక్కనే హుస్సేన్ మియా వాగు నది ఒడ్డున 36 ఎకరాల విస్తీర్ణంలో భారీ కోట ఉంది.

ఇది ఉత్తర-దక్షిణ దిశగా వెళ్లే ఆరు దశల రాళ్ల పునాదిపై ఇటుక గోడతో కూడిన ఒక మట్టి కోట. దీని చుట్టూ లోతైన కందకం ఉంది. తవ్వకాల్లో దక్షిణ ద్వారం, సైనికుల గదులు, కేంద్ర మార్గం పక్కనే ఉన్న నిర్మాణాలు బయట పడ్డాయి. గేట్‌వేకి ఉత్తరాన 100 మీటర్ల దూరంలో ఐదు దశల నిర్మాణ కార్యకలాపాలతో ప్యాలెస్ కాంప్లెక్స్ ఉంది. శాతవాహనుల కంటే ముందరి రాజులు, శాతవాహనుల నాణేలు ధూళికట్ట తవ్వకాల్లో కనుగొనబడ్డాయి. అయితే చిముక నాణేలు కోట లింగాలలో మాత్రమే లభించడం గమనార్హం.

ధూళికట్ట కూడా నల్గొండలోని ఫణిగిరి వంటి తెలంగాణలోని ఇతర బౌద్ధ స్థలాల మాదిరిగానే ఉంది. తెలంగాణలో బౌద్ధమతం కోస్తా ప్రాంతాల్లో విస్తరించినంత బలమైన మూలాలను తీసుకోలేదు. జైనమతం తెలంగాణలో చాలా ఎక్కువగా ఉంది. ఇది ప్రాచీన కాలం నాటి బోధన్ లేదా పొధనం, కొలనుపాకు మొదలైన ప్రదేశాల ద్వారా నిరూపించబడింది. తెలంగాణలో ఇతర బౌద్ధ స్థలాలు ఉన్నాయి, వీటిని భవిష్యత్తులో అధ్యయనం చేయాలి.

1978లో కోటలింగాల నాణేల ఆవిష్కరణ ఆంధ్ర నాణ శాస్త్రంలో ఒక ముఖ్యమైన సంఘటన. ఈ సైట్‌లో వెలికితీసిన వివిధ రకాల నాణేలు అబ్బురపరిచేలా ఉన్నాయి. వాటిలో పంచ్ మార్క్ చేయబడినవి, లిఖించబడని మరియు లిఖించబడిన నాణేలు ఉన్నాయి. లిఖించిన నాణేలు గోబద, నరన, కంవయస, సిరివయస, సామగోప, చిముక, శతస, శాతకర్ని, వసిష్టిపుత్ర పులుమావి, వాసిష్టిపుత్ర శాతకర్ణికి చెందినవి. మహాతలర్వరా, మహాసేనాపతి మరియు సెబాక నాణేలు కూడా ఉన్నాయి. ఈ స్థలంలో శాతవాహనుల తదనంతర రాజుల నాణేలు కనుగొన బడలేదు.

**(తరువాయి వచ్చే సంచికలో)**

**- డా॥ దేమె రాజారెడ్డి,**
m : 9848018660
e : palvashareddy@gmail.com

# ప్రకృతితో ఐక్యమయ్యేది యోగ

## జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2024 యొక్క థీమ్ "మానవత్వం ". యోగా దినోత్సవ వేడుకలు యోగా యొక్క సంపూర్ణ స్వభావం గురించి అవగాహన కల్పించడం మరియు మెరుగైన శ్రేయస్సు కోసం వారి దైనందిన జీవితంలో చేర్చుకునేలా ప్రజలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

'అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014లో ఆమోదించబడింది. 2015 జూన్ 21న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకున్నారు. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు.



2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తన ప్రసంగంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ యోగాకు అంకితమైన అంతర్జాతీయ దినోత్సవం ఆలోచనను ప్రతిపాదించినప్పుడు అంతర్జాతీయ యోగా దినోత్సవం చరిత్రను గుర్తించవచ్చు. అతను యోగాను "భారతదేశపు ప్రాచీన సంప్రదాయానికి అమూల్యమైన బహుమతి" గా అభివర్ణించాడు. ఇది "ఆరోగ్యకరమైన గ్రహాన్ని సృష్టించేందుకు దోహదపడుతుందని" చెప్పాడు. యోగా అనేది శారీరక వ్యాయామం మాత్రమే కాదని, తనతో, ప్రపంచంతో మరియు ప్రకృతితో ఐక్యతను గుర్తించే సాధనమని ఆయన నొక్కి చెప్పారు.

మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21, 2015న జరుపుకున్నారు, 190కి పైగా దేశాల్లో కార్యక్రమాలు జరిగాయి. అప్పటి నుండి, అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపుకునే వార్షిక కార్యక్రమంగా మారింది.

యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చైతన్యం కలిగించడమే అంతర్జాతీయ యోగా దినోత్సవం ముఖ్యోద్దేశం. యోగా అనే పదం సంస్కృతంలోని యుజ అనే దాని నుంచి వచ్చింది. యుజ అంటే చేరడం లేదా ఏకం చేయడం అని అర్థం. శరీరం, మనసును ఏకచేయడమే యోగాలోని పరమార్థం. దాదాపు 5000 ఏళ్ల చరిత్ర కలిగిన యోగశాస్త్రం ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక.

### యోగా అంటే ఏమిటి?

యోగా, భారత దేశంలో ఉద్భవించిన పురాతన అభ్యాసం, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అంశాలను కలిగి ఉంటుంది. "యోగ" అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. శరీరం మరియు స్పృహ యొక్క ఐక్యతను సూచిస్తుంది. ఇది వారి సామరస్య సంబంధాన్ని సూచిస్తుంది.

### 21 జూన్ 2024 ప్రత్యేక రోజు

మేము 2024లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నందున జూన్ 21 ప్రపంచ ఆరోగ్య ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఏటా వేసవి కాలంతో సముచితంగా జరిగే ఈ స్మారకార్థం ఆరోగ్యం మరియు శ్రేయస్సు కోసం యోగా యొక్క బహుముఖ ప్రయోజనాలను నొక్కి చెబుతుంది. పురాతన అభ్యాసం యొక్క సంపూర్ణ ప్రయోజనాలకు సంబంధించి అవగాహనను వ్యాప్తి చేయడానికి అనుకూలమైన సమయం సరైన సమయాన్ని అందిస్తుంది. యోగా అభ్యాసకులు, సంస్థలు ఈ నిర్దిష్ట 2024 తేదీలో అంతర్జాతీయంగా ఏకమవుతున్నందున, సందేశం స్పష్టంగా ప్రతిధ్వనిస్తుంది – యోగా మనస్సు, శరీరం, ఆత్మను పెంపొందిస్తుంది.

– సత్య ప్రసన్న
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామ నామాలు

ఖమ్మం తెలంగాణ గుమ్మం అనే పలుకుబడి ఉన్నది. స్తంభశిఖరి, సాల గ్రామాద్రి, నృహర్గిరి, స్తంభగిరి అను ప్రాచీన వ్యవహార నామాలున్నవి. హరిభట్టు రచించిన వరాహపురాణంలో కంబముమెట్టు, స్థంభచల అని ప్రస్తావించబడినది. 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణ దేవరాయలు ఖమ్మం కోటను జయించాడని నంది తిమ్మన పారిజాతాపహరణం ప్రబంధంలో ఒక పద్యంలో 'కంబంబుమెట్ట' అని ప్రస్తావించి ఉన్నాడు. నిజాం రాష్ట్రం 1870 రైల్వే మ్యాప్ ప్రకారం ఈ పట్టణం ఖమ్మం మెట్టుగా పేర్కొనబడింది. "కృష్ణానదిని దాటి తెలంగాణలోకి అడుగుపెట్టే దారిలో ఖమ్మం ఉంది. ఖమ్మంలో ఎత్తైన గుట్ట, గుట్ట మీద ఉన్న నారసింహుడిని స్థానిక క్షైత్రియతుల ప్రకారం త్రేతాయుగం నాటి దేవుడని చెప్పుకుంటారు. ఈ పట్టణంలోని నరసింహుని గుట్ట కింద కనిపించే నిలువురాయి దండుబాట మీద, వ్యాపార రహదారి మీద బాటసారులకు కొండ గుర్తుగా నిలిచి ఉంది. ఇదే కంభం (స్తంభం)మెట్టు. మెట్టు అంటే పైకి వెళ్ళడానికి ఎక్కే ఎత్తు అరుగు. స్తంభానికి నరసింహావతారానికి పౌరాణిక బంధముంది. కంభం మెట్టు ఖమ్మం మెట్టయింది. ఇప్పుడు ఖమ్మం అనే పేరు ఒకటే మిగిలింది. ఇక్కడి నరసింహాలయం నుండే మండపాలకు, స్తంభాలకు కావాల్సిన రాళ్ళు తరలినట్టు ఉండేవారట. అందు వలన స్తంభ గిరి గానూ, స్తంభాద్రి' గానూ ప్రాచీన నామం ఉంది. ఖమ్మం పాలించిన రాజవంశాలు బౌద్ధ జైన మతాలు చారిత్రక అవశేషాలు ఎన్నో బయలు పడినాయి. ఖమ్మం కోటను రెడ్డిరాజులు, వెలమలు, నందవాణి, కాళ్లూరు, గుడ్లూరు వంశాల వారు పాలించారు. 1531లో షితబ్ ఖాన్ అనబడే సీతాపతి రాజు పరిపాలించాడు." (తెలంగాణ చరిత్ర తొవ్వల్లో : శ్రీరామోజు హరగోపాల్. పుట. 132-138) 1905 వరకు వరంగల్ జిల్లాలో ఖమ్మం భాగంగా ఉండేది. 2011 జనాభా లెక్కల ప్రకారం నాలుగు రెవెన్యూ డివిజన్లు, 46 మండలాలు, 1223 గ్రామాలున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఉమ్మడి జిల్లాను ఖమ్మం జిల్లా మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలుగా విభజించారు.



**అశ్వరావు పేట:-** వెలమ సామాజిక వర్గం పద్మనాయక వంశస్థులు పాల్వంచ సంస్థాన పాలకులుగా ఉన్నప్పుడు కాకతీయ ప్రతాపరుద్రుని సైన్యాధ్యక్షులుగా పనిచేసారు. రెండవ ప్రతాపరుద్రుని వద్దనున్న ఒక అశ్వాన్ని లొంగదీసినందున ఈ వంశానికి అశ్వారావు బిరుదు ఇవ్వబడింది. అందువల్ల వీరిని అశ్వారావు వారంటారు. ఈ వంశీయుల పేరు మీదుగానే అశ్వారావుపేట, అశ్వాపురం నామాలు ఏర్పడి ఉండవచ్చు.

**కూసుమంచి:-** మండల కేంద్రమిది. "శక సంవత్సరం 1160 కాలం కాకతీయ గణపతి దేవ చక్రవర్తి కాలం నాటి కూసుమంచి శాసనంలో ఎనిమిదవ పంక్తిలో ఈ గ్రామ నామ రూపం కూచమంచ్చి' అని ప్రస్తావించబడినది. ఈ శాసనంలో మాంగల్లు, జన్నవాడ, నేరడ, బిరప్రోలు, గోరింటిపల్లి, తాడితోట, కొల్లి గుబ్బలి, కొండ మడంగిడ్ల, పెద్దచెల్క, మోకలదేవి గణపయ్య చుందరేపల్లి, దొడ్డిబండ, బండపిల్ల గుండ్లు వంటి మరి కొన్ని గ్రామ నామాల ప్రస్తావనలున్నాయి. పెద్ద చెరువు, కారమండి కాలువ, గణప సముద్రం వంటి చెరువుల నామాలున్నాయి." (కొత్త తెలంగాణ శాసనాలు: శ్రీరామోజు హరగోపాల్. పుట. 102-114)

**చొప్పకట్ల పాలెం:-** బోనకల్ మండలంలోని గ్రామమిది. "క్రీ.శ. 1315 ప్రతాప రుద్రుని కాలం నాటి శాసనం 12,13 పంక్తులలో ఈ గ్రామ నామం చొప్పకట్లపాళము' అని ఉన్నది. పించిగంచిప్రోలు, తేర్నాన గ్రామ నామాల ప్రస్తావనలు కూడా ఉన్నాయి." (తెలంగాణ చరిత్ర తొవ్వల్లో శ్రీరామోజు హరగోపాల్. పుట-205, 210)

**నాగులవంచ:-** చింతకాని మండలంలోని గ్రామమిది. విదేశీ పాలకులు ఉచ్చారణ కోసం నాగుల్వాంచా, నాగులవాంజె అని రాసేవారు. క్రీ.శ. 1687 కంచెర్ల గోపన్న కాలంలో ఈ గ్రామంలో 19 ఏళ్ళుగా నడిచిన డచ్ వారి ఫ్యాక్టరీని నేలమట్టం చేయడానికి స్వదేశీ కాంక్షతో కార్మికులు వీరోచితంగా పోరాడిన గ్రామమిది. ప్రముఖ చరిత్రకారుడు కట్టా శ్రీనివాస రావు గారు 2019 అక్టోబర్ 13 వ తేదీన డచ్ వారిని తరిమి కొట్టిన రోజుకు గుర్తుగా 'చరిత్రకెక్కని సమరం తలవంచని నాగులవంచ' పుస్తకాన్ని విడుదల చేశారు. డచ్ వారిని వలందులు అంటారు. అందువల్ల ఈ గ్రామాన్ని వలందుల వారి పట్నం, వలందులోరి పట్నం'గానూ పిలిచేవారు.

**నేలకొండ పల్లి:-** మండల కేంద్రమిది. "శక సంవత్సరం 1162 గణపతి దేవ మహారాజు కాలం నాటి నేలకొండపల్లి చెరువుగట్టు శాసనంలో 5, 6 మరియు 19,20 పంక్తులలో కొండపల్లి' అని ప్రస్తావించబడింది. శాసనం 65 నుండి 70 పంక్తుల వరకు 'శ్రీ కొండపల్లి పురము.... మెచ్చన్' అను కంద

పద్యమున్నది.” (కొత్త తెలంగాణ శాసనాలు : శ్రీరామోజు హరగోపాల్. పుట.117-124) శాసనంలోని ప్రాచీన రూపం కొండపల్లి కాలక్రమంలో నేలకొండపల్లి'గా మారింది.

**బయ్యారం:-** “క్రీ.శ.13వ శతాబ్ది కాలానికి చెందిన కాకతి మైలమ బయ్యారం చెరువు శాసనం గణపతి దేవుని వరకు గల కాకతీయ వంశవృక్షాన్ని వివరిస్తుంది. ఈ శాసనం 47వ పంక్తిలోని బయ్యాంబ ప్రస్తావన ఉన్నది.” (మీరూ శాసనాలు చదువొచ్చు: కూర్పరి-ఈమని శివనాగిరెడ్డి స్థపతి. పుట-394)” “గణపతి దేవుని సోదరి మైలాంబ బయ్యారం వద్ద ఒక పెద్ద చెరువు త్రవ్వించి వేయించిన మూడు శాసనములలోని ఒక శాసనంలో మైలాంబ శ్రీశైలాది క్షేత్రములందు శివ ప్రతిష్టలు చేయుట, తన తండ్రి మహాదేవుని పేరున మహదేవపురము, తల్లి బయ్యాంబ పేరు మీదుగా బయ్యవరం, బయ్యారం, తన బిరుద నామమైన ధర్మకీర్తి పేరు మీదుగా ధర్మకీర్తి పురం/ధర్మవరం గ్రామంలో ప్రతిష్టించిందని శాసనం రాసిన రామ దేవుడను కవి వర్ణించాడు.” (కాకతీయ శాసన సాహిత్యం, పి.వి.పరబ్రహ్మ శాస్త్రి. పుట-54) శాసనం ద్వారా మూడు గ్రామ నామాలు ఏర్పడిన విధం తెలుస్తున్నది.



**భద్రాచలం:-** భద్రగిరి అను రూపాంతరమున్నది. “మూడు వేల సంవత్సరాల సంవత్సరాల క్రితం భదళపురి'గా పిలువ బడినది.” (తెలంగాణలో కొత్త చారిత్రక స్థలాలు: డా. ద్యావనపల్లి సత్యనారాయణ. పుట-156,157) “ఈ భద్రాచలం ప్రాంతాన్ని విసురునాడు అని కూడా వ్యవహరించే వారు.”(తెలంగాణ చరిత్ర తొవ్వల్లో : శ్రీరామోజు హరగోపాల్. పుట-226)పూర్వం భద్రుడు అనే భక్తుడు శ్రీ రాముని కోసం తపస్సు చేసి కొండగా మారినాడని ఆ కొండకే భద్రుడి పేరు మీదుగా భద్రగిరి, భద్రాచలం'గా మారిందని స్థల పురాణం, స్థానిక ఐతిహ్యమున్నది.



**ముదిగొండ:-** మండల కేంద్రమిది. బృహత్ శిల అను నామాంతరమున్నది. “ముదిగండ, ముదిగొండూరు, ముదిగాండూరు అని ప్రాచీన వ్యవహార నామాలున్నవి. ఈ ముదిగొండతో పాటు కొరవి బొట్టు తదితర పట్టణాలను చాళుక్యులు రాజధానులుగా చేసుకొని పరిపాలించినందు వలన ముదిగొండ చాళుక్యులు అయ్యారు.” (తెలంగాణ చరిత్ర సంస్కృతి వారసత్వం: వై.వై.రెడ్డి యానాల. పుట-160) “క్రీ.శ. 12వ శతాబ్ది కాలం నాటి ముదిగొండ చాళుక్య కుసుమాదిత్యుని కుక్కునూరు రాగిరేకు తెలుగు గద్య శాసనంలో ముదిగొండ చాళుక్యుల వంశ వృక్షాన్ని, విజయాలను, భాషను చెప్పడం జరిగింది. ఈ శాసనంలో క్రివ్వక అను మరో గ్రామ నామ ప్రస్తావన ఉన్నది. క్రివ్వక'యే క్రమంగా కివ్వక' గా మారిందని స్పష్టమౌతున్నది.” (అలనాటి మేటి తెలంగాణా శాసనాలు: ఈమని శివనాగిరెడ్డి-స్థపతి. పుట-100)

**రాజేశ్వరపురం:-** నేలకొండపల్లి మండలంలోని గ్రామమిది. శక సంవత్సరం “1151 కాలం నాటి ఈ గ్రామ శాసనంలో కట్టంగూరు, తాటితోట, కొండపల్లి (నేలకొండపల్లి), సూరాదేవి పల్లి, ముకింద పాయు, దేవరబండ, బొల్లికుంట, ఇప్పల ఎల్లంగుంట స్థల నామాల ప్రాచీన రూపాలు ఉన్నాయి.” (తెలంగాణ చరిత్ర తొవ్వల్లో శ్రీరామోజు హరగోపాల్. పుట. 151-155)

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డా. మొరంగపల్లి భాగయ్య గారి పర్యవేక్షణలో డా. యద్దనపూడి గాయత్రి గారు 2015లో ‘ఖమ్మం జిల్లా గ్రామ నామాలు’ అంశంపై Ph.D పరిశోధన పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామ నామాలపై అటవీ ప్రాంత ప్రభావం, ఆదివాసీ, గిరిజన జీవన సంస్కృతి, జల శిల పర్వత, భూ, వృక్ష, జంతు, పక్షి, వస్తు, వంశ, కుల, జాతి, మత, జానపద సంస్కృతి ప్రభావం కనబడుతుంది. పర్ణశాల ప్రాంతాన్ని రథచరగిరి, ధూరపాతకం, పాప ప్రణాశన తీర్థం, గాలవము అను పేర్లతో పిలిచేవారట. కిన్నెర సాని ప్రవాహం ప్రభావంతో ఏర్పడిన కిన్నెర సాని గ్రామం. థంసా ప్రభావంతో థంసలాపురం, బౌద్ధ మత ప్రభావంతో మజ్జి గూడెం, మధిరను నతవాటిసీమ, మధురాపురి'గా వ్యవహరించగా కట్టకూరు-కట్టగూరు, చింటూరు-చింతూరు, టేకులపల్లి-టేక్లపల్లి, పాల్వంచ-శంకరగిరి, బాణాపురం-బాణాలపురం, యటపాక-జటపాక, రేఖపల్లి-రెక్కపల్లి, సత్తుపల్లి-సత్తువపల్లి వంటి ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామ నామాలను పరిశోధిస్తే మరిన్ని వాస్తవ రూపాలు చూడవచ్చు.

-డా. మండల స్వామి
m : 9177607603
e : mandala.smy@gmail.com

# చారిత్రక నగరం ఆకునూరు

ఆకునూరు చరిత్రలో చెరగని చారిత్రకాధారాలున్న పాతనగరం. చరిత్ర సంపన్నమైన ఈ గ్రామంలో రాష్ట్రకూట చక్రవర్తి అమోఘవర్షుని రాజప్రతినిధి, బంధువు అయిన శంకరగండరస శాసనముంది. కాకతీయుల కాలంలో కాకతీయ సైనికులు ఎక్కటీలు (ఒక్కరే అనేక ఆయుధాలతో పోరాడగల సైనికులు, ఇప్పటి కమెండోలవంటివారు) రుద్రదేవుని పేరన ఆకునూరులో రుద్రేశ్వరాలయం కట్టించినపుడు వేసిన కాకతీయశాసనం వుంది. ఈ రెండు శాసనాలు చారిత్రకంగా చాలా విలువైనవి. ఈ శాసనాలలో మనం ఆనాటి సామాజిక సంస్కృతిని తెలుసుకునే ఆధారాలున్నాయి.

**ఆకునూరు శాసనాలు:**

తేదీలేని ఆకునూరు మొదటి శాసనం మహాసామంతాధిపతి, రట్ట శూరరు, జయధీర, విట్టి నారాయణ, ధర్మరత్నాకర, బిరుదులున్న శంకరగండరస కొలనుపాక-20,000ను పాలిస్తున్న సమయంలో ఆకునూరు పాలకుడు ఇందుపయ్య కొలనుపాకలోని జైనబసదికి ఇచ్చిన దానం, త్రవ్వించిన రట్టసముద్రం చెరువు గురించి తెలియజేస్తున్నది.

ఆకునూరులోని రెండవ శాసనం క్రీ.శ.1172 మార్చి 31నాడు వేయబడ్డది. మహామండలేశ్వరుడు, అనుమకొండ పురవరాధీశ్వరుడు, శ్రీ కాకతీయ రుద్రదేవ మహారాజు పాలనాకాలంలో ఆకునూరుకు వచ్చి తనపేరిట ఎక్కటీలు కట్టించిన రుద్రేశ్వరదేవరకు మ్రొక్కి, అంగరంగభోగానికి ఆయం (ఆదాయం) ఏర్పాటు చేసినాడు. రాటనాలు నడిపేవారు మాడలు, తోట రాట్నాల రాటనానికి 3సిన్నాలు, తమ్మళివారు 8గద్యాణాలు, గొల్లవారు 2గద్యాణాలు, అనామికులు 4గద్యాణాలు, కుమ్మరులు 1గద్యాణం, శ్రీమంగలి 5రూకలు, వసదివారు 5రూకలు, సంకటేలు 5రూకలు, మాలకరులు 5రూకలు, మాచరాశి 5రూకలు, ఎక్కటీలు 12గద్యాణాలు, ఇంకా కొన్ని సుంకాలు వసూలు చేయడం ద్వారా దేవాలయానికి ఆదాయం కల్పించాడు. బ్రాహ్మణులకు ప్రిత్తులు ఏర్పరచినాడని శాసనసారాంశం.



ఆకునూరు
కాకతీయ శాసనం

ఆకునూరులో రెండు దేవాలయాలున్నాయి. ఒకటి శివాలయం. రెండవది రామాలయం. రెండు గుడుల మంటపాలలో ఒకేవిధమైన చాళుక్య, పూర్వకాకతీయశైలి రాతిస్తంభాలున్నాయి. శివాలయంలో చాళుక్యశైలి శివలింగం, కాకతీయశైలి శివలింగం వేర్వేరు గర్భగుడులలో వుండడం విశేషం.

**శివాలయం:**

శివాలయ ప్రవేశద్వారానికి రెండువైపుల ఉన్న శైవద్వారపాలకులు చతుర్భుజులు. పై చేతులలో శంఖువు, ఢమరుకాలు, అభయహస్తం, త్రిశూలాలతో ఊర్ధ్వజానుభంగిమలో నిల్చునివున్నారు. శిల్పాలులేని చాళుక్యశైలి స్తంభాలు మంటపంలో అగుపిస్తున్నాయి. జైనమతప్రభావం ఉన్నటువంటిది. పూర్తిగా కాకతీయులశైలి కలశంగా మారని పూర్వరూప కలశం దేవాలయద్వారం మీదున్నది. సర్వతోభద్రగోపురంలో, మూలబంధాసనంలో కూర్చున్న గజలక్ష్మి లలాటబింబంగా ఉన్నది. రెండువైపుల రెండు ఏనుగులచేత అభిషేకించబడుతున్న ద్విభుజి లక్ష్మీదేవి రెండు చేతులలో తామరపూమొగ్గలున్నాయి. గర్భగుడి ద్వారబంధం గజలక్ష్మి, కలశాలు కాక నిరాలంకారంగా వుంది. ఈ తీరు ద్వారబంధాలు జైనబసదులకు కనిపిస్తుంటాయి. కాకతీయశైలిలలో చెక్కిన ద్వారబంధమైతే కాదు. గర్భగుడిలో కాకతీయశైలి లింగం, లింగవేదికలున్నాయి. భద్రలింగపీఠంలో ప్రతిష్ఠించిన సమలింగం రుద్రభాగం శిరోవర్తనంతో వున్నది. లింగంపై బ్రహ్మసూత్రమున్నది. ఈ శివాలయాన్నే ఆకునూరులో ఎక్కటీలు నిర్మించారు.

కొత్త వినాయకుని విగ్రహం. చతుర్భుజుడు. కుడివైపుతొండం కలవాడు. కొత్తగా గుడులలో పెడుతున్న లక్ష్మీగణపతి శిల్పం. దేవాలయప్రాంగణంలో గణపతిసహిత సప్తమాతృకల శిల్పఫలకం గోడలో వుంది. గోడలోనే చిన్న వీరభద్రుని ప్రతిమ వుంది.

భద్రపీఠం మీద ప్రతిష్ఠించబడిన వీరభద్రుని శిల్పం 3 అడుగుల ఎత్తైనది. త్రిభుజశీర్ష, కీర్తిముఖతోరణంతో అలంకరించబడి వున్నాడు. దక్షసహిత, చతుర్భుజ వీరభద్రుడు. సరులు, మణులతో అలంకృతమైన ముఖపట్టం, మూపుమీద దర్భముడితో ముందుకు మెడకిందకు, మూపురం వెనకకు అలంకరించిన మువ్వలపట్టెడలు, కుచ్చులతో అచ్చమైన నంది కళ్యాణమంటపంలో వుంది. దేవాలయంలోని మరొక గర్భగుడిలో మూడంచుల, వర్తులాకార లింగపీఠంలో శివలింగం ప్రతిష్ఠితమైనది. ఈ గుడిముందరున్న నంది చిన్నది. మూపుమీద నుంచి ముందుకు, వెనకకు అలంకరించిన గజ్జెలపట్టెడ లున్నాయి.

గుడి ప్రాంగణంలో చతుర్భుజుడైన భైరవుడు



సప్తమాతృకలు



శాతవాహన నాణెం



టెర్రకోట ముద్ర



టెర్రకోట యక్షిణి

జటామండలంతో, పై చేతులలో ఢమరుకం, త్రిశూలాలు, ముందు చేతుల్లో ఖడ్గం, రక్తపాత్రలతో, మెడలో నాగహారాలతో, నడుమున, భుజాల నుంచి ముండమాలతో అతిభంగ భంగిమలో నిలబడి వున్నాడు. దేవాలయం ఆవరణలో కనిపిస్తున్న శాసనస్తంభం కాకతీయులది. గుడి ముందర ఎత్తైన రాతిధ్వజస్తంభముంది.

**రామాలయం:**

గుడి ఎదురుగా రెండు ధ్వజస్తంభాలున్నాయి. ఒకటి రాతిస్తంభం. స్తంభశీర్షంలో శిఖరశిలమీద గరుడుని శిల్పం వుంది. దేవాలయ మంటపంలోని స్తంభాలు చాలుక్యశైలిలో వున్నాయి. గుడి ద్వారానికి రెండువైపుల చక్ర, శంఖువు, గద, అభయహస్తాలతో కరండమకుటంతో స్వస్తికాసనంలో ఇద్దరు వైష్ణవద్వారపాలకులు నిల్చునివున్నారు. దేవాలయుద్వారానికి రెండువైపుల కలశాలు, లలాటబింబంగా అష్టదళపద్మం వున్నాయి. చక్ర, శంఖువులతో ఉత్తరాభిముఖుడైన భక్తాంజనేయుని విగ్రహముంది. 16వ శతాబ్దానికి చెందిన రెండు వైష్ణవద్వారపాలకుల విడిశిల్పాలున్నాయి.



లింగరూపాలు

దేవాలయం గోడలకు చేర్చిన నాగశిల్పం వుంది. చతుర్భుజాలతో చేతులలో పరశువు, అంకుశం, విరిగిన దంతం, మోదకాలతో ఎడమవైపు తిరిగిన తొండంతో లలితాసనంలో ఉన్నాడు గణపతి.

విడి శిల్పాలలో ఆకునూరి ప్రజలు ఎల్లమ్మగా కొలిచే నాగశిల్పాలున్నాయి. వీటిలో కొన్ని రాష్ట్రకూటులనాటి శిల్పాలున్నాయి. గుడిలో కూడా నాగదేవతా శిల్పాలే వున్నాయి. పోచమ్మగుడిలో దుర్గావిగ్రహమున్నది. ఆ గుడికి ప్రవేశమార్గానికి రెండువైపుల చండి, ముండి శిల్పాలుండడం విశేషం. మరొకచోట ముగ్గురు అమ్మదేవతల్లో ఇద్దరు చాముండలు, ఒక దుర్గ విగ్రహాలున్నాయి. జనగామ జిల్లా కొన్నెగ్రామంలో వున్నట్లు లలితాసనంలో కూర్చున్న తలలేని చాముండ విగ్రహం ఆకునూరులో కనిపించడం ప్రత్యేకం. అక్కడే మరొక సప్తమాతృకా శిల్పఫలకం వుంది. శిల్పశైలినిబట్టి ఈ ఫలకం 10వ శతాబ్దానికి చెందింది.

**ఆకునూరు పాటిగడ్డపై జైనం:**

ఆకునూరుకు రెండు పాటిగడ్డలున్నాయి. అందులో ఒకదానిపేరు 'కోటిలింగాల గడ్డ'. పోచమ్మగుడి దగ్గరలో వుంటుంది. ఇక్కడ కొత్తగా జైన తీర్థంకరుడు మహావీరుని విరిగిన ధ్యానాసన శిల్పం, జైన సర్వతోభద్రశిల్పం గుర్తించడమైనది. అంటే 9వ శతాబ్దంలో శంకరగండరసకాలంలో ఇక్కడ జైనమతం ఎంతో ప్రాభవంతో వుండేదని తెలుస్తున్నది. ఇప్పటివరకు సర్వతోభద్ర జైనశిల్పాలు కొలనుపాక, వేములవాడలలో కనిపించాయి.

గ్రామం బయట 'కోటిలింగాల గడ్డ'గా పిలువబడే పాటిగడ్డమీద 5అడుగుల ఎత్తైన జైన చౌముఖి వుంది. కొలనుపాక జైన సంగ్రహాలయంలో, వేములవాడలో బౌద్ధుల ఉద్దేశికస్తూపాలను పోలిన ఇటువంటి జైనచౌముఖ శిలలు కనిపించాయి. వీటినే జైనులు 'సర్వతోభద్ర' అంటారు. అరుదైన ఈ శిల్పాలున్నచోటు జైనధర్మకేంద్రం అని చెప్పవచ్చు. అందువల్ల ఆకునూరు ఒక ప్రసిద్ధ జైనక్షేత్రమని చెప్పవచ్చు.

'బౌద్ధులవలెనే జైనులుకూడా స్తూపాలు, చైత్యాలు నిర్మించుకునేవారు. జైనులు చైత్యాలయాలు నిర్మించు కొన్నట్లు బైరాన్ పల్లి శాసనం(వరంగల్ జిల్లా శాసనసంపుటి, పే.43, శా.సం.18, 23-28పంక్తులు) వల్ల తెలుస్తున్నది. జైనులు చైత్యాలయాలకంటె జినాలయాల మీదనే శ్రద్ధ ఎక్కువ చూపారు.' అంటారు బీఎస్ఎల్ హనుమంతరావు. (ఆంధ్రదేశంలో జైన, బౌద్ధ మతాలు, జైనమతవ్యాప్తి-కారణాలు, పే.141)

ఈ జైన సర్వతోభద్ర శిలమీద నలువైపుల 24వ జైనతీర్థంకరుడు మహావీరుని శిల్పాలున్నాయి. సర్వతోభద్ర శిల శిఖరాన రుషభుని మూర్తి నలువైపుల చెక్కివుంది. అక్కడే విరిగిపోయిన జైన మహావీరుని ధ్యానాసనశిల్పం ఉదరం నుంచి కిందిభాగం మిగిలి కనిపిస్తున్నది.

**ఆకునూరులో వీరగల్లులు:**

ఆకునూరులో గ్రామం 'సోమరాజుల కుంట'లో 4శిల్పాలు లభించాయి. వాటిలో రెండు వీరగల్లులు, 3వది నాగముచులింద పోలికలున్న నాగవిగ్రహం, 4వది రాష్ట్రకూటులనాటి కాలభైరవశిల్పం.

రెండు వీరగల్లులలో ఒకటి రాష్ట్రకూట కాలానికి చెందిన అలంకృత వీరశిల. ఒకటే అంతస్తున్న ఈ వీరశిలలో వీరుడు సర్వాభరణాలు ధరించివున్నాడు. కుడిచేతిలో బాణం, ఎడమచేతిలో విల్లు ధరించి డాకాలు సాచి యుద్ధ సన్నద్ధుడై వున్నాడు. నడినెత్తిన



గణపతి-1



గణపతి-2



చాముండి



బైరవుడు -1



బైరవుడు -2



వైష్ణవమూర్తి



వీరభద్రుడు



ఆకునూరు వీరగల్లు

కొప్పు, మూపున వీరశృంఖల, నడుమున పట్టాకత్తి ధరించివున్నాడు. ఈ వీరుడు అమరుడైనాడని తెలుపడానికి సూచనగా ఇద్దరు అప్సరాంగనలు వీరుని తలకు రెండువైపుల నిల్చుని వింజామరలు వీస్తున్నారు. ఇటువంటి వీరగల్లు చాలా అరుదు.

రెండవ వీరగల్లులో వీరుని సిగ కుడిపక్కకు కట్టివున్నది. వీరుడు బల్లెంతో శత్రువుమీద దాడికి సిద్ధంగా వున్నాడు. వీరుని నడుమున పెద్దకత్తి వుంది. వీరుడు అంతగా అలంకరింపబడలేదు. ఇది కాకతీయపూర్వశైలిలో చెక్కబడిన వీరగల్లు.

**ఆకునూరులో శాతవాహన కాలం నాటి ఆనవాళ్లు:**

కోటిలింగాల పాటిగడ్డమీద కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ ఒక నాణెం, కుండపెంకులను సేకరించాడు. ఇవి శాతవాహనకాలం నాటివని గుర్తించాడు. లభించిన నాణెం 'ఫోటీన్'లోహంతో చేయబడినది. దానిమీద బ్రాహ్మీలిపిలో లెజెండ్ అస్పష్టంగా కనిపిస్తున్నది. నాణానికి ఎడమవైపు తొండం ఎత్తివున్న ఏనుగుబొమ్మపైన 'స...క...' అనే బ్రాహ్మీ అక్షరాలు అగుపిస్తున్నాయి. నాణానికి వెనకవైపు ఉజ్జయిని చిహ్నం ఉన్నది. సాతకర్ణి నాణెమిది. ఇటువంటి నాణాలు సాతవాహన సామ్రాజ్య నాణాలని చరిత్రబృందం నాణకవేత్త (న్యూమిస్మాటిస్టు) కందుల వేంకటేశ్ గారు అన్నారు. నాణెం దొరికిన పాటిగడ్డమీదనే సాతవాహనకాలంనాటి గోటినొక్కులు, పూల డిజైన్లతో కుండ పెంకులు లభిస్తున్నాయి. ఇక్కడ సాతవాహనకాలంనాటి పురా వస్తువుల కొరకు తెలంగాణ వారసత్వశాఖ వారు పరిశోధన జరిపితే మరిన్ని విశేషాలు లభిస్తాయి.



శివాలయం

ఆకునూరులో ఒక పురావస్తువు లభించింది. ఈ వస్తువు కాల్చిన బంకమట్టితో చేసిన బొమ్మ. చూడడానికి పచ్చీస్, చదరంగం ఆటలలో పెట్టే పావులెక్కనే కనబడుతున్నది. కాని, స్వరూపభేదంవల్ల ఆకునూరు పాటిగడ్డమీద దొరికిన చిన్న మట్టిబొడ్డె లింగరూపాన్ని తలపిస్తున్నది. ఈ కాల్చిన మట్టిముద్ద గొబ్బెమ్మ ఆకారంలో కనిపిస్తున్నది. అడుగున సమతలంగా వుంది. ఈ మట్టిబొమ్మ అడుగున సన్నని తిన్నె వుంది. 5,6 సెం.మీ.ల ఎత్తు, 2 సెం.మీ.ల వ్యాసం కలిగివున్న ఈ టెర్రకోటలింగాకారం కలకత్తా మ్యూజియంలో కనిపించే (నం.6570/ఏ6417) మొహంజొదారొ పురుషావయం (ఫాలస్)తో పోలివుంది. మొహంజొదారొ మట్టిబొమ్మ 4,500సం.ల పాతది. కాల్చిన బంకమట్టి బొమ్మ. ఆకునూరులో దొరికిన మట్టిబొమ్మ కూడా కాల్చిన బంకమట్టిబొమ్మే. రెండింటికి ఉన్న సామ్యాన్ని బట్టి ఆకునూరు బొమ్మ కూడా 4వేల సం.రాల నాటి పురావస్తువుగానే ఎంచవలసివుంది. టీఎల్టీ (థర్మో ల్యూమినెన్స్ టెస్ట్) పరీక్ష చేయిస్తే ఈ బొమ్మ వయస్సు ఖచ్చితంగా చెప్పవచ్చు. గతంలో సాతవాహన కాలంనాటి టెర్రకోటబొమ్మలు, తర్వాత కాలానికి చెందిన లజ్జాగౌరి రాతిబొమ్మ దొరికిన చోటనే ఈ లింగాకృతి దొరకడం విశేషం. ఇవన్నీ ఆ స్థల ప్రాచీనతకు, చారిత్రక ప్రాధాన్యతకు నిదర్శనాలు. ఈ ప్రదేశాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు తప్పక పరిశోధించాల్సిన అవసరముందని ప్రఖ్యాత పురాశాస్త్రవేత్త రవి కోరిసెట్టర్ (కర్ణాటక)గారు అన్నారు.

పాటిగడ్డ మీద సాతవాహనకాలంనాటి గోటినొక్కుల డిజైన్ల ఎరుపురంగు కుండ పెంకులు, కొన్ని కుండల కంఠాలు, నీటికూజా ముక్కు (నీళ్ళుపోసే గొట్టం), ఎన్నో సాతవాహన కాలంనాటి ఇటుకల ముక్కలు, నూరుడు రాళ్ళు, దంపుడురాళ్ళు, దొరికాయి. ఇవికాక కొత్తరాతియుగంనాటి రాతిగొడ్డలిముక్క ఒకటి దొరికింది. అంటే ఆకునూరులో రాతియుగాలనాటినుంచి మానవుల ఆవాసాలిక్కడ వుండేవని చెప్పడానికి ఆధారాలు లభించినట్లయింది.

**ధన్యవాదాలు:**

**క్షేత్రపర్యటన, ఫోటోగ్రఫీ:** కొలిపాక శ్రీనివాస్, అహోబిలం కరుణాకర్, సామలేటి మహేశ్.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com




## టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2024 గ్రహీత

# కమతం మహేందర్‌రెడ్డి

జియాలజీ మరియు జియో సొల్యూషన్స్ విభాగంలో అవార్డు గ్రహీతగా టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024ని కె. మహేందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ GSI (జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నిపుణుల బృందం సభ్యుడు. క్రిటికల్ మినరల్ ట్రాకర్స్ ప్రతిష్ఠాకరమైన టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024కి నేపాల్‌లోని ఖాట్మండులో పురస్కారం అందుకున్న శుభ సందర్భంలో అభినందనలు... శుభాకాంక్షలు!

కమతం మహేందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్, GSI గారు నాకు జియలాజీకల్ సర్వే ఆఫ్ ఇండియాలో నా పై అధికారి. నేను వారితో రెండు శతాబ్దాలకు పైగా సన్నిహితంగా, డ్రాఫ్టుమాన్ హోదాలో చాలా ప్రాజెక్ట్స్‌లో ఎన్నో జియలాజికల్ మ్యాప్స్ గీయడం జరిగింది. వారు అందరితో ఎంతో సౌమ్యంగా, స్నేహంగా ఉండేవారు. వారికి ఈ పురస్కారం లభించడం మాకందరికీ ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఏప్రిల్ 27, 2024న నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 కోసం కె. మహేందర్ రెడ్డి, ఆహ్వానాన్ని అందుకొని పురస్కారం నేపాల్ టూరిజం హాల్, ఖాట్మండు, నేపాల్‌లో అందుకున్నారు.

మహేందర్ రెడ్డి, గారికి ఈ క్రింది విధంగా ఆహ్వానం పంపింది.

ఈ టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డులు అసాధారణమైన నిబద్ధతను ప్రదర్శించిన ఉద్వేగభరితమైన వ్యక్తులను ఒకచోట చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. వారి కమ్యూనిటీలలో మరియు వెలుపల సానుకూల ప్రభావం చూపుతుంది. వారి ప్రత్యేక సహకారాలు మరియు అంకితభావం ఈ అవార్డుల వేడుక స్ఫూర్తితో సంపూర్ణంగా సరిపోతాయని అవార్డు కమిటీ అభిప్రాయపడింది.

ఈ అవార్డుల ప్రదానోత్సవం నెట్‌వర్కింగ్, నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ మరియు టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు సంబంధించిన వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రయత్నాల గుర్తింపు కోసం ఒక వేదికను అందిస్తుంది. హాజరైనవారు తమ పని యొక్క ప్రభావాన్ని మరింత విస్తరించగల అంతర్దృష్టితో కూడిన చర్చలలో పాల్గొనడానికి, అనుభవాలను పంచుకోవడానికి, సహకారాన్ని ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుంది.

టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024లో మీ ఉనికి ఈవెంట్‌ను సుసంపన్నం చేయడమే కాకుండా, మెరుగైన భవిష్యత్తును రూపొందించడంలో సమిష్టి కృషికి దోహదపడుతుంది అని సంస్థ నమ్ముతున్నది. సాంకేతిక నైపుణ్యం పట్ల వారి నిబద్ధత అవార్డు కమిటీ దృష్టిని ఆకర్షించింది. ఈ స్ఫూర్తిదాయకమైన సందర్భంలో అవార్డు గ్రహీతలు వాటితో చేరే అవకాశం గురించ సంతోషిస్తున్నది.

మహేందర్ రెడ్డికి జియాలజీ మరియు జియో సొల్యూషన్స్ విభాగంలో అవార్డు గ్రహీతగా టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024ని అందజేయాలని అవార్డు కమిటీ వినమ్రంగా, హృదయపూర్వకంగా వారిని అభ్యర్థిస్తూ, అవార్డు గ్రహీతల మద్దతు, ప్రోత్సాహం లేకుండా, మా భాగస్వామ్య లక్ష్యాలను సాధించడం అసాధ్యం. మేము మిమ్మల్ని ఖాట్మండుకు స్వాగతించడానికి మరియు ప్రపంచంపై శాశ్వత ప్రభావాన్ని చూపడానికి సమిష్టిగా కృషి చేస్తున్నందున సాంకేతికతలో అభివృద్ధిని కలిసి జరుపుకోవడానికి మేము ఎదురుచూస్తున్నాము.

సానుకూల మార్పు కోసం మీ అంకితభావానికి ధన్యవాదాలు. ఈ పరివర్తన ఈవెంట్‌లో మీ భాగస్వామ్యాన్ని మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము అని అవార్డు కమిటీ స్వాగతం పలికింది.

– మహమ్మద్ గౌస్
m : 9949668154

ప్రకృతే సౌందర్యం! 25 ప్రకృతే ఆనందం!!

# ఎల్లలెరుగని పక్షులం! కల్లలెరుగని జీవులం!!

అది వాగా సరిహద్దు. అమృత్‌సర్‌కు, లాహోర్‌కు మధ్యన వుండే భారత్, పాక్‌ల సరిహద్దు. రోజు సాయంత్రం ఇక్కడ ఇరు దేశాల పతాకాల అవనతం వుంటుంది. దినమంతా ఇరుదేశాల సైనికులు తప్ప జనాలు కనపడరు. అటు నుంచి మహమ్మద్ అలీ జిన్నా, ఇటు నుంచి మహాత్మా గాంధీ చిత్రపటాలు ఒకరినొకరు పలకరించుకుంటున్నట్లుగా వుంటాయి. సాయంత్రం ఇటు నుంచి హాజరైన జనాలు కేరింతలు, చప్పట్లు, ఈలలు, పాక్ వ్యతిరేక నినాదాలు పైనున్న మేఘాల్ని కూడా కదిలిస్తాయి. రోజా సినిమాలోని పాటల బ్యాండ్ మేళం ఆ నినాదాలకు తాళం వేస్తాయి. అదే సంధ్యా సమయంలో ఇరు ప్రాంతాల్లో ఎత్తుగా వున్న చెట్లపైన ఓ అలజడి, ఆహ్లాదం మొదలైతుంది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటూ రకరకాల పక్షులు గుంపులు గుంపులుగా, సైనిక విమానాల విన్యాసాల్లా ఎగురుతూ తమతమ గూళ్లను చేరుకుంటాయి. వాటి కిలకిలారావములు జనాల హోరులో, బ్యాండ్ చప్పుళ్లలో ఎవరి చెవికెక్కని వైనం! అలా ఓ రెండు గంటల పాటు సాగే నిత్య నాటకంలో ప్రకృతి ఒడిలోని పక్షులు భేషజాలు లేకుండా, మతాల పట్టింపు లేకుండా, జాతి భేధాల్ని దరిరానీయకుండా దేశాల సరిహద్దులంటూ గిరిగీసుకోకుండా తమతమ గూళ్ళల్లోకి, స్థావరాల్లోకి చేరడం సహజమే అయినా, మానవుల వక్రబుద్ధికి ఓ చెంపపెట్టు లాంటిదే!




ఈ తతంగం తర్వాత తిరుగుముఖం పట్టిన జనాల్లో, ముఖ్యంగా యువతలో కట్టలు తెంచిన ఆవేశం, దేశభక్తి ఇరు దేశాలగుండా పారే జీలం నదినే మంచెత్తేలా వుంటుంది. ఇవేవి పట్టని విహంగాలు, తమకేవి ఎల్లలంటూ, తమ దేశాలేవంటూ జనాలవైపు చూస్తూ నిద్రకు ఉపక్రమించడం ఓ ప్రకృతి వింతకాదా..!

ఇంతటి విశాల దేశభక్తిగల యువతను '...మీలో ఎంతమంది సైన్యంలో చేరుతారని..' పక్షులు ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానాలు వస్తాయో ఊహించవచ్చు! అయినా, అటు పక్కనేగల లాహోర్ జైల్లో అమరులైన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజుగురువులు ఎంతమందికి గుర్తుకు వస్తారో కూడా తెలియని విషయమే! పక్షులకు, ప్రకృతికి లేని పట్టింపులు అతి తెలివిపరులమని విర్రవీగే మానవులకెందుకో తెలియదు.

ఈ సందర్భంగా వివిధ రకాల పక్షులు వివిధ ఖండాల్ని, దేశాల్ని ఎలా స్వంతం చేసుకుంటాయో చూస్తే మనం సిగ్గుతో తలవంచు కోవాల్సిందే! రాచరిక ఠీవిలేదు, సైన్యం లేదు, కవాతులేదు, యుద్ధం లేదు. దేశాల సరిహద్దుల లెక్కలేదు. భూగోళమే ఆవాసంగా, ధృవాలే సరిహద్దుగా ఎలా విహరిస్తాయో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఉత్తరార్ధగోళంలో శీతాకాలం వచ్చిందంటే చాలు, వేలాది పక్షులు భూమధ్యరేఖ ప్రాంతాల్లోని తూర్పు, పశ్చిమ ఆసియా దేశాలకు, భారత ఉపఖండానికి వలసలు వచ్చేది తెలిసిందే! జాతి, మత, ప్రాంతీయ బేధాలు లేని ఈ పక్షిజాతి వలసలు వాటి మనుగడకే అయినా, ప్రకృతి పరంగా, పర్యావరణ విషయంగా ఎంతో దోహదపడడమే కాక, ఆహారపు గొలుసు నియంత్రణలో, మానవ మనుగడకు సహకరించడంలో వాటికవే సాటి! ఈ సృష్టిలో పక్షుల గమనం, గమ్యంలో మార్పులు వచ్చినా గతి తప్పినా, భౌగోళిక జీవరాశిపై ఎలాంటి విపత్తులు వస్తాయో ఊహించడం కష్టమే!

అలాంటి కొన్ని పక్షుల్ని చూద్దాం!

**ఒంటి దాన్నే! అయినా గతి తప్పలేదు (ఒమిడ్ – Omid పక్షి)**

సైబీరియా దక్షిణ ప్రాంతంలోని మనోవాట్ నది తీర ప్రాంతంలో వుండే నేను ఓ కొంగ (Crane) జాతి పక్షిని. నేను ఒంటరి దాన్ని ఎందుకయ్యానో మీ మొద్దుబారిన బుర్రలకు అర్థం చేసుకునే శక్తి, ఓపిక లేదు. వందలాది సంవత్సరాలుగా, మాపై జరిగిన వేటలో అన్ని కనుమరుగు కాగా, నేనొక్క దాన్నే మిగిలాను. ప్రతీ శీతాకాలంలో సైబీరియా నుంచి సుమారు 5,000 కి.మీ. ప్రయాణించి ఇరానుకు చేరుకుంటాను. గత 16 సం॥లుగా నా ఒంటరి జీవితాన్ని పరిశీలించిన, ఇరాన్ పక్షి ప్రేమికులు నాకు ఒమిడ్ (Omid), అనగా నమ్మకం (Hope) అనే పేరు పెట్టారు. నాతో జతగా వుండే ఆడ కొంగ (Arezoo – కోరిక (desire) 2008 చివర్లోనే నన్ను వీడి శాశ్వతంగా వెళ్లిపోయింది. ప్రకృతి పరంగా అందుకే నేను ఒంటరి దాన్ని అయ్యాను. అయినా నిరాశపడకుండా, బెంగపడకుండా ప్రతీ చలికాలంలో సైబీరియా

నుంచి బయలుదేరి ఉత్తర, పశ్చిమ ఖజికిస్తాన్, వోల్గానది (రష్యా)ను దాటి, దక్షిణ అజర్‌బైజాన్ ద్వారా ఇరాన్ చేరుకొని, తిరిగి వసంతంలో (spring) నా జన్మ స్థలానికి వెళ్ళడం నా జీవన చర్యగా మారిపోయింది.

నా ఒంటరి జీవితాన్ని పరిశీలించిన ఇంటర్నేషనల్ క్రేన్ ఫౌండేషన్ (ICF) బెల్జియం నుంచి రొయా (Roya) అనే ఆడ కొంగని నాకు తోడు చేసారు. సుమారు 34 రోజులు కలిసి మెలిసి తిరిగిన మేము, సైబీరియా వెళ్ళాల్సిన సమయం ఆసన్నం కావడంతో బయలుదేరాం. కాని, నా సహచరి నాతో కొంత దూరం వరకు వచ్చి ఆగిపోయి వుంటుంది. ICF పరిశీలకుల ప్రకారం, రొయా మార్చి 5, 2023న ఇరాన్‌లోని టోన్‌కాబన్ (Tonekabon) ప్రాంతంలో కనబడినట్లుగా చెపుతున్నారు. ఏమి జరిగిందో తెలియదుగాని, మా జంట తిరుగు ప్రయాణంలో అజర్‌బైజాన్‌లో చూసినట్లుగా, రాజస్థాన్‌లోని కియోలాడియో ప్రాంతంలో చూసినట్లుగా చెప్పుకుంటున్నారు. వచ్చే శీతాకాలంలో తప్ప మా గూర్చిన సమాచారం తెలియక పోవచ్చు. (నోటు: సహజంగా ఆడ పక్షులు సంతానోత్పత్తి సమయంలో ఎగరలేవు).



ఒమిడ్


సారస్

### గగనతలంలో ఎగిరే అతిపెద్ద పక్షి – సారస్ (Sarus)

సుమారు అయిదు అడుగుల ఎత్తులో 1.5 మీ. చొప్పున గల రెక్కలతో వుండే నేను ప్రపంచంలోనే ఎగిరే అతి పెద్ద పక్షిగా గుర్తింపు పొందాను. సరస్సులను ఆధారంగా చేసుకొని జీవనం సాగించడంతో నన్ను సారస్, అనగా సరస్సు (lake) అని పిలుస్తారు. భారత్‌లోని ఉత్తరప్రదేశ్‌లోని మెటవా, మణిపూర్ ప్రాంతాల్లో దక్షిణ తూర్పు ఆసియాలో, నేపాల్, ఆస్ట్రేలియాలో కనపడే నేను, ఈ మధ్యన కనపడని జాబితాలోకి చేరుతున్నట్లుగా కథనాలు. 15వ శతాబ్దంలో నా ఉనికిని గుర్తించారు. శతాబ్దాల క్రితం కొంగ జాతుల వారసురాలిగా నన్ను ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఒరింతాలోజిష్ట (Orinthologist) ఎవో హ్యూమ్ (AO Home) చెపుతూ వుండేవాడు. ఒకప్పుడు భారత్ ఉపఖండంలో 40 వేలకు పైగా వున్న మా సంఖ్య తుది దశకు చేరుకున్నట్లుగా అంటున్నారు. బాతుల్లా, కోళ్లలా నేను ఓ సంఘజీవినే. 1972లో అటవి జీవుల

## పక్షుల నివేదిక – 2023

(The State of Indian Birds)

- ప్రకృతిలో ఏ జంతువర్గానికి లేనంత అభిమానులు, పరిశీలకులు పక్షులకు వున్నారు.
- భారత్‌లో 30 వేలకు పైగా పక్షి ప్రేమికులు, అభిమానులున్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారిదాకా, ఢిల్లీ నుంచి గల్లీ దాకా గల ఈ అభిమానులు సుమారు 30 మిలియన్ల పరిశీలనలను వివిధ పక్షులపై చేసారు.
- వీరితో పాటు ఆరు ప్రభుత్వ, ఏడు స్వచ్ఛంద (NGOs) సంస్థలు కూడా పక్షులపై వాటి జీవన విధానంపై మనుగడపై పరిశీలనల్ని చేస్తున్నాయి.
- 2023 సంవత్సరపు నివేదిక ప్రకారం వీరు 942 రకాల పక్షుల్ని పరిశీలించి, వాటి సమాచారాన్ని e Bird - on line - Citizen Scientist అనే పోర్టల్‌లో పెట్టారు.
- ఈ నివేదిక ప్రకారం
  - ❖ 204 పక్షిజాతులు గత మూడు దశాబ్దాలలో క్షీణ (extinit) దశకు చేరుకున్నాయి.
  - ❖ 182 పక్షి జాతులను రెడ్ జాబితాలో, అత్యంత ప్రమాదకర స్థితిలో వున్నాయని ప్రకటించారు.
- అత్యంత ప్రమాదకర స్థితిలో వున్న పక్షులు
  - ❖ రాబందు (Indian Vulture)
  - ❖ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్
  - ❖ సైబీరియన్ క్రేన్
  - ❖ జర్డాన్స్ కర్సర్
  - ❖ గుడ్లగూబ (Owlet)
- కనుమరుగైన ఎగురలేని పక్షి – డొడొ (dodo)
- తడి నేలల, గడ్డి ఆవాసాల పక్షులు అత్యధికంగా కనుమరుగైతున్నాయి.
- కళేబరాలను తినే పక్షులైన (పారిశుద్ధ) రాబందులు, ఓ రకం కాకులు, గద్దలు మొ॥ అతిశీఘ్రంగా అంతరించి పోతున్నాయి.
- కీటకాల్ని తినే భిన్నరకం పక్షులు – పిచ్చుకలు, గోరెంకలు, గువ్వలు, మైనాలు ప్రమాదపుటంచున వున్నాయి.

**ఆశాజనకం :**

- నెమళ్ళు, కోయిలల, పావురాలు, అడవి రామచిలుకలు పెరుగుతున్నాయి.

**పరిశీలించిన వాటిలో 178 జాతి పక్షుల్ని అత్యధిక ప్రాధాన్యతతో కాపాడుకోవాలి.**

**పక్షుల స్థితిగతులపై ఎన్విరాన్‌మెంటల్ అండ్ రిసోర్సెస్ అనే ప్రపంచస్థాయి సంస్థ ఓ సమీక్షను ప్రచురించింది. పక్షు జాతుల్లో 48 శాతం అంతరించిపోయినట్లుగా ఆ రిపోర్టు తెలిపింది.**

సంరక్షణ చట్టంలో నన్ను చేర్చినా ఆశించిన ఫలితాలు లేవు. దీనికి కారకులు ఎవరో ఊహించండి.

### ధృవాలే సరిహద్దుగా ఆర్కిటిక్ టెర్న్ (Arctic Tern)


బహుష భూమిపై చలించే జంతువులలో నా లాగా వలస వెళ్ళే జంతువులు లేవనుకుంటాను. నిజానికి నా ఆవాసం ఉత్తరధృవపు గ్రీన్‌లాండ్. కాని శీతాకాలంలో ఇతర పక్షుల్లా నేను సంతానోత్పత్తికై ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిందే! అయితే, అత్యధికంగా పక్షులు సైబీరియా నుంచి, భూమధ్యరేఖ ప్రాంతాల ఆవాసాలకు వలస వెళ్ళుతాయి. కాని నా విడిది దక్షిణ ధృవపు అంటార్కిటాలోని వెడ్డెల్ (Weddle) సముద్రం. సుమారు 6 వేల కి.మీ. దూరాలకు వలస వెళ్ళే పక్షులే ఎంతో విశిష్టతను కలిగి వుంటాయి కదా! కాని నా పయనం ఏకంగా సుమారు 90వేల కిలోమీటర్లు. మీకిది ఆశ్చర్యం కావచ్చు! కాని, మీ పక్షి ప్రేమికుల్ని అడిగి తెలుసుకోండి. ఇంత వైవిధ్య జీవితాన్ని గలిగిన నన్నన్నా రేపటి తరానికి సజీవంగా చూపించండి!



ఆర్కిటిక్ టెర్న్

### నింగిలోనే నిద్ర – బార్ టేయిల్డ్ గాడ్‌విట్

సుమారు 15 అంగులాల పొడవుండే నేను అలస్కా వాసిని. ఇతర పక్షుల్లాగానే నేను ఆస్ట్రేలియాకు వలసపోతాను. పోతే, ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేనెక్కడా ఆగను. మరి నిద్ర, ఆహారమంటారా..? ఈ పయాణంలో ఆహారం తీసుకోకుండా, స్కాండినేవియా నుంచి ఆస్ట్రేలియాకు, సుమారు 30 వేల కి.మీ. ఎగురుతూనే నిద్రపోతాను తెలుసా! ఇది ఎలా అంటారా... నా అంతర్గత అవయవాల జీవక్రియల్ని కుంచించుకోవడంతో, నా మెదడులో కొంత భాగం నిద్రపోయేలా చేస్తాయి. ఇది ప్రకృతి ప్రసాధించిన గొప్పవరం కదా! నా గమన మార్గం కూడా అతి పెద్ద సముద్రమైన పసిఫిక్ సముద్రమే! వాతావరణం అనుకూలిస్తే, నా వేగం గంటకు 100 కి.మీ. అందుకే కాబోలు నన్ను మీ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చేర్చారు.



బార్ టైల్డ్ గాడ్‌విట్

నాలాగే ఆల్‌బట్రాస్ పక్షి కూడా ఎగురుతూనే నిద్రపోతుంది. మాలా మీకు ఈ కళ అబ్బితే... మరెంత విధ్వంసకులు అవుతారో? మా పరిస్థితి కూడా, IUCN జాబితాలోని రెడ్‌లిస్టులో చేర్చారు కదా!

### పిల్లల పెంపకంలో తండ్రులమే గొప్ప

### (Winter tailed - white -(erowned sparrow))

పిచ్చుకల జాతికే చెందిన నేను ఉత్తర ధృవ ప్రాంతంలో, కెనడా, అలస్కాలలో వుంటూ కాలిఫోర్నియాకు వలసపోతూ వుంటాను. నా ప్రత్యేకత ఏమంటే, నా సహచరి పెట్టిన గుడ్లను రక్షించి పొదగడం. పిల్ల పక్షులకు గూళ్ళు నిర్మించడం. వాటికి ఆహారాన్ని అందించడం. ఇలా ఏ పక్షి చేయని పనిని నేను ఆరు మాసాలు చేస్తాను సుమా! నన్ను చూసైనా, మీ మగజాతి కొంచెం ఆలోచించాలి.

### అనుకరించుటలో వేణుమాధవ్‌కు గురువులం (Mimicry Birds)

మాకున్న కంఠంతో మమ్మల్ని అనుకరణ (మిమిక్రి) పక్షులని అంటారు. సంగీత పరమైన గొప్ప శక్తిని, పాడే చక్కని గొంతును ప్రకృతి మాకు ప్రసాధించడమే కాక, ఇతర పక్షులలా మేము వాటి కూతల్ని అనుకరిస్తాం! చాలా పక్షులు, మమ్మల్ని వాటి సహచరులని భ్రమిస్తాయి. మా కళనే మీరు అనుకరిస్తూ, ఎంతో పేరు ప్రఖ్యాతులు ఆపాధించు కుంటారు. మరి మమ్మల్ని మీ రేపటి వారసులకు భద్రంగా చూపలేరా..?

### నేతగాళ్ళ గురువుని (Weaver Bird)

ఆఫ్రికా, ఆసియా ఖండాలలో మా జాతి పక్షులు సుమారు 100 రకాలు అని మీ లెక్కలు చెపుతున్నాయి. ప్రకృతి ప్రసాధించిన నైపుణ్యతతో మేము ఏ ఇంజనీరింగ్ డిగ్రీ చేయకున్నా అందమైన గూళ్ళను మా పిల్లలకై నిర్మిస్తాం. మా కళ ఇంతవరకు మీ మానవులకు అబ్బలేదు. లేకుంటే, మా గూళ్ళ (Nests) పేటెంట్లుగా మీరే చలామణి అయ్యేవారు. ఒక్కొక్క గూటికి సుమారు వెయ్యి గడ్డి పరకల్ని సేకరించాలి. సేకరించడానికి సుమారు 500–1000 చక్కర్లు కొట్టాలి. ఇలా ఓ 20 రోజులు పాటు శ్రమించి గుండ్రని ద్వారాన్ని, ఓ వరండాను, లోపల నివసించడానికి గదిని నిర్మిస్తాం. ఈ పనిని కూడా, మా మగజాతి చేపడితే, మధ్యలో ఆడపక్షి వచ్చి చేరుతుంది. అలా ఆ గూడు నచ్చుతే, సంసారం చేస్తుంది. మరి మీరో! నమ్మి వచ్చిన సహచరిని అవసరమైతే ఇంటి నుంచి తన్ని తరిమేస్తారు కదా! దీన్ని కూడా కథలుగా, గాధలుగా చెప్పుకుంటారు.

### మగాళ్ళమే! అయినా వయ్యారులమే! (Flamingos)

అందమైన ఆడవారి నడకను మా జాతితో (హంస) పోలుస్తారు. కాని మీకు తెలియని అసలు విషయం మా మగజాతి

గూర్చి. ఆడ పక్షిని ఆకర్షించడానికై మా మగజాతి సంప్రదాయబద్ధమైన (ritual) నాట్యాన్ని చేస్తాయి. ఆడజాతిని ఆకర్షించి జతకడుతాయి. ఇదంతా ఓ అనుకూలమైన ప్రాంతంలో, సరస్సుల తీరాన జరుగుతుంది. ఈ క్రతువుకై 50వేలకు పైగా పక్షులు ఒక దగ్గరకు చేరుతాయి. దీన్నే మీరు హంసలదీవి అని అంటారు. మాలో పశ్చిమఆఫ్రికా నుంచి ప్రతీ శీతాకాలంలో వస్తాం. మమ్మల్ని చూడాలనుకుంటే, అక్టోబర్, నవంబర్ మాసాల్లో పోరుబందర్ రండి! మా విన్యాసాల్ని తిలకించండి. ఆనందించండి. అసూయపడి మారణకాండ మాత్రం సాగించకండి.



మిమిక్రీ పక్షి

**రాజ హంసలమే! కాని, సరస్సుల్లో, మడుగుల్లో కలుపుతీసే కూలీలం:**

మాకు రాజహంస (Flamingo) అని ఎందుకు పేరు పెట్టారో తెలియదు. కాని, ఆహారపు వేటలో మేం సరస్సులను, నీటి మడుగలను, సముద్ర తీరాల్ని అన్వేషిస్తాం. స్వచ్ఛమైన నీటిలో కన్నా, బురద నేలలు మాకు ఇష్టం. మా పొడుగాటి కాళ్ళు, నీటి లోతుల్లోకి వెళ్ళి, అడుగు నేలను గుల్లబార్చును. మా పొడవాటి మెడ, ముక్కుచే, కొంకిలా మార్చి, నేలను సారవంతం చేస్తాం. దీంతో నీటి, బురద అడుగు భాగానికి ఆక్సిజన్ అందేలా చేయడంతో, లోపల ఆల్గే భాగా అభివృద్ధి చెందుతాయి. ఈ ఆల్గేను చేపలు, వెన్నముక లేని జీవులు ఆహారంగా తీసుకుంటాయి. అంటే, మా ఆహారంతో పాటు, ఇతర జల జీవులకు ఆహారాన్ని సమకూర్చే తల్లి పాత్రను పోషిస్తామన్న మాట!



నేత పక్షి

ఇప్పటికే చాలా విషయాల్ని మీ దృష్టికి తెచ్చాం! చివరగా చైనా కథ చెప్పి ముగిస్తాం!

**పిచ్చుకలా.. మజాకా..?**

మేం 5-10 సెం.మీ. పొడవుంటే చిన్న జీవులం. మానవులతో మా సహవాసం పదివేల సంవత్సరాలుగా అని అంచనా! మా గూర్చిన 'కిచకిచలు' మీకు తెలిసినవే! చిన్న చిన్న కీటకాలతో పాటు, మేం పంట చేళ్ళ ధాన్యాల్ని తిని జీవిస్తాం. అయితే, గియితే మా ద్వారా కొంత పంట నష్టం జరగవచ్చు! పెద్ద ఎత్తున ఆలోచిస్తే, ఈ నష్టం టన్నుల్లో వుండవచ్చు! దీన్ని తీవ్రంగా పరిగణించిన చైనా 1950లో పిచ్చుకల నిర్మూలనా కార్యక్రమాన్ని చేపట్టింది. లక్షలాది పిచ్చుకల్ని నిర్మూలించింది. కాని, కథ అడ్డం తిరిగింది. మా జాతి ఎలా అంతరించిందో, అంతకన్నా ఎక్కువ మోతాదుల్లో పంటల దిగుబడి దారుణంగా పడిపోయింది. కారణం – మా కన్నా, క్రిములు, కీటకాలు, చీడపురుగులు పంటలను అధికంగా ధ్వంసం చేసాయి. దీన్ని గుర్తించిన చైనా ప్రభుత్వం, నాలికను కర్చుకొని, లెంప లేసుకుంది. మాజాతి పునరుద్ధరణకు నడుం బిగించింది.

**అటవి సంపదకు మేమే కారకులం!**

అశోకుడు చెట్లు నాటించెను. హరితహారానికి కర్తలం! ఇలా ఎన్నో అభూత కల్పనలు మీ పుస్తకాల్లో వుంటాయి. కాని, ఏ చరిత్ర రచయిత గాని, పర్యావరణ వేత్తలుగాని, అటవి సంపదకు ప్రధానకారణం పక్షి అని రాయని మీ నిజాయితిని ఏమనాలి..?

ప్రపంచ వ్యాపితంగా పేరుగాంచిన, అమెజాన్ అడువులు గావచ్చు, దండకారణ్యం కావచ్చు. ఇదంతా మా పక్షులచే జరపబడిన బీజవ్యాప్తి అని గుర్తించండి! వేలాది, లక్షలాది మొక్కల్ని, చెట్లని, వృక్షాల్ని (ఏక, బహు వార్షికాలు) యావత్ భూగోళానికి పరిచయం చేసింది, పంపిణి చేసింది మేమే! ఇప్పటికి చేస్తున్నది కూడా మేమే! అలాంటి మమ్మల్ని విచక్షణ రహితంగా నిర్మూలిస్తే అటవి సంపద అంతరిస్తుంది. అప్పుడు మీ మనుగడ ఎలా వుంటుందో ఆలోచించండి. కాబట్టి, అడవులు మీ సొత్తు కాదు. మా సొత్తుగా గుర్తించండి.

చివరగా, 1854లో అమెరికా లోని ఓ ఆదివాసి పెద్దాయన (Head), నాటి అమెరికా, అధ్యక్షునికి రాసిన లేఖలోని ఓ వాక్యంతో ముగిస్తాం. **"భూమి మానవుల్ని సృష్టించింది గాని, మానవుడు భూమిని సృష్టించలేదు."**

(వచ్చే సంచికలో కీటకాల సేవల్ని చూద్దాం!)

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com

# భూతాపం భవిష్యత్తు తరాలకు శాపంగా మారుతోందా!

అసాధారణ అతి ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలం కొనసాగుతున్న వడగాలులు, తీవ్రమైన వాతావరణ మార్పులతో ప్రపంచ మానవాళి, ప్రాణి కోటి నిప్పుల కొలిమిలో నివసించాల్సిన అగత్యం ఏర్పడుతున్నదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ ప్రతికూల మార్పులతో ప్రతి వేసవిలో దేశాల గరిష్ఠ ఉష్ణోగ్రతలు అస్థిరంగా, అవాంఛనీయంగా, అనారోగ్యకరంగా మారుతూనే ఉన్నాయి. భూతాపాన్ని అంచనా వేయడం, హరితగృహ ప్రభావాన్ని (గ్రీన్ హౌజ్ ఎఫెక్ట్) తగ్గించడం లాంటి లక్ష్యాలను అధ్యయనం చేయడం, పరిష్కారాలు ఇవ్వడానికి పలు దేశాల మహానగరాల్లో 'చీఫ్ హీట్ ఆఫీసర్' ఉద్యోగులను నియమించాల్సిన అగత్యం ఏర్పడింది. కార్చిచ్చులు, హరికేన్లు, వరదలు లాంటి విపత్తులతో అధిక ఆస్తి, ప్రాణ నష్టాలు నమోదు అవుతున్నప్పటికీ నేడు వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడం, వడగాడ్పులు వీచడంతో నకల ప్రాణికోటి ఉనికి ప్రమాదంలో పడనుందనే తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నుంచి 2050 మధ్య కాలంలో ప్రతికూల వాతావరణ మార్పులతో పోషకాహారలోపం, మలేరియా, డయేరియా, ఉష్ణోగ్రత ఒత్తిడుల (హీట్ స్ట్రెస్) కారణంగా అదనంగా 2.5 లక్షల మరణాలు నమోదు కావచ్చనే భయానక వార్తలను వెల్లడిస్తున్నారు.



### అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు:

"ఐరాస ఇంటర్‌గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమెట్ చేంజ్ (ఐపిసిసి)" నివేదిక ప్రకారం ఇండియా, యూయస్, స్పేయిన్ లాంటి దేశాల్లో రికార్డు స్థాయిలో పాదరస మట్టాలు (ఉష్ణోగ్రతలు) పైపైకి పొంగడం జరుగుతూనే ఉన్నది. వేసవి కాలంలో స్పేయిన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు 47.2 డిగ్రీ సెంటిగ్రేడ్, ఇండియాలో 45.8 డిగ్రీలు చేరడం, అమెరికాలో 40 డిగ్రీలు తరుచుగా దాటడం సర్వసాధారణమైంది. ఉష్ణోగ్రతలతో పాటు వడగాడ్పులు తోడై ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఆసియా ఖండంలో వడగాడ్పులు, నీటి తేమ సమస్యలతో రాజస్థాన్, గుజరాత్, యూపీ, ఢిల్లీ రాష్ట్రాల్లో పాదరస మట్టాలు పరుగులు తీయడం, వడగాలులు వీచడం చూస్తూనే ఉన్నాం. గత 122 ఏండ్లలో ఎన్నడూ చూడని వడగాడ్పులను మార్చి-2022లో చూసాం. గత 72 ఏళ్ళలో అత్యధికంగా 09 ఏప్రిల్ 2022న ఢిల్లీలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఏప్రిల్-1941లో ఢిల్లీలో 45.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత రికార్డుగా ఇప్పటికీ రికార్డుల్లో ఉంది. రాజస్థాన్‌లో గరిష్టంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని గమనించాలి. అమెరికాలో వడగాలులతో ఏడాది సగటున 702 మంది మరణించగా, 2004-18 మధ్య కాలంలో మాత్రమే 10,527 మంది వేడి గాలులకు ప్రాణాలు అర్పించారని గణాంకాలు తెలుపుతున్నాయి. 1880 నుంచి ప్రతి దశాబ్దకాలంలో భూ ఉష్ణోగ్రతలు 0.08 డిగ్రీలు పెరుగుతుండగా, గత నాలుగు దశాబ్దాల్లో సగటున 0.18 డిగ్రీలు పెరగడం ప్రమాదకర భవిష్యత్తును సూచిస్తున్నది. ప్రతి ఏట మార్చి నుంచి జూన్ వరకు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

### హరిత గృహ ప్రభావ భూతాపం:

అతిశీతల చలికాలం, అత్యధిక వేసవి ఉష్ణోగ్రతలు, కరువులు, కార్చిచ్చులు, తుఫాన్లు, వరదలు లాంటి విపత్తులు అసాధారణ వాతావరణ ప్రతికూల మార్పుల వల్ల జరుగుతున్నాయని నిర్ధారణ అయ్యింది. భూతాపంతో ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధృవాల్లో మంచు కరగడంతో సముద్రమట్టాలు క్రమంగా పెరుగుతూ తీరప్రాంతాలను సముద్ర నీరు ముంచనుందని ఐపిసిసి నివేదిక వివరిస్తున్నది. 1990-2019 కాలంలో మానవ ప్రేరేపిత గ్రీన్ హౌజ్ వాయువుల (కార్బన్ డై ఆక్సైడ్, ఓజోన్, హైడ్రోకార్బన్లు, నైట్రోజన్ ఆక్సైడ్లు, నీటి ఆవిరి లాంటివి) కారణంగా ఉష్ణోగ్రతలు 45 శాతం పెరుగుతున్నాయని, వీటిలో కార్బన్ డై ఆక్సైడ్ మూలంగానే 36 శాతం హరిత గృహ ప్రభావం పెరిగిందని తెలుస్తున్నది. హరిత

గృహ వాయువులు పెరగడంతో ఉష్ణోగ్రతలు అధికం కావడమే కాకుండా వాతావరణం, నేల, సముద్ర జలాలు ప్రతికూల మార్పులను పొందుతున్నాయని గమనించాలి. 2030 నాటికి భూతాపంతో క్రమంగా మొక్కజొన్న లాంటి ధాన్య దిగుబడులు 24 శాతం వరకు తగ్గవచ్చనే కఠిన వాస్తవాన్ని వెళ్ళడిస్తున్నారు. ఆఫ్రికాలోని సోమాలియా, ఇథియోపియా లాంటి దేశాల్లో అత్యంత పొడి గాలుల అసాధారణ వాతావరణం నెలకొంటున్నట్లు తేలింది.

**సముద్రమట్టం పెరుగుదల:**

ఐపిసిసి హెచ్చరిక ప్రకారం శిలాజ ఇంధనాల విచక్షణారహిత వినియోగం, మానవ ప్రమేయ పర్యావరణ కాలుష్యాలతో వాతావరణ ప్రతికూల మార్పులతో తీవ్ర వడగాలులు వీచడం జరుగుతోంది. స్విస్జర్లాండ్‌లోని విజోల్ మంచుకొండలు హరితగృహ వాయువులతో 2006 నుంచి నేటి వరకు 80 శాతం వరకు కరిగాయని, రానున్న దశాబ్దాల్లో 90 శాతం వరకు కరిగిపోవడంతో 2100 వరకు సముద్రమట్టం 2 మీటర్లు పెరిగి 63 కోట్ల జనులు తమ నేలను కోల్పోయే ప్రమాదం ఏర్పడనుంది. ప్రపంచ దేశాలు గ్రీన్ హౌజ్ వాయువులను నియంత్రించకపోతే ప్రపంచ మానవ మనుగడ ప్రశ్నార్థకం కానుందని ఐపిసిసి హెచ్చరిస్తున్నది. భూతాపం ఇలాగే పెరిగితే రానున్న దశాబ్దాల్లో మానవ ఆవాసాలు, గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలు, నగరాలు సముద్ర జలాలతో నిండనున్నాయని, నైజీరియా లాంటి కొన్ని దేశాలు తమ తీరప్రాంత రాజధానులను కోల్పోనున్నాయని తెలుస్తున్నది. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో 30 శాతం చైనా బొగ్గు ఆధార పవర్ కేంద్రాలు కలిగిస్తున్నాయి. 2060 నాటికి జీరో-కార్బన్ ఉద్గారాల దేశంగా చైనా, 2070 నాటికి ఇండియాలను మార్చుటకు చర్యలు చేపడుతున్నారు.



**సానుకూల చర్యలే శ్రీరామరక్ష:**

పారిస్ అగ్రిమెంట్ సిఫార్సు ప్రకారం 2050 నాటికి కార్బన్ ఉద్గారాలను తగ్గించాలని, లేనియెడల ప్రస్తుత కార్బన్ ఉద్గార రేటు ఇలాగే కొనసాగితే 2100 వరకు ఉష్ణోగ్రతలు 3-4 డిగ్రీలు పెరుగుతాయని సూచిస్తున్నారు. నగరాల్లో విస్తారమైన రోడ్లు, అధిక జనాభా, వాహనాల గుంపులు, సిమెంట్ కాంక్రీట్ భవనాలు, స్టీల్ వాడకాల వల్ల వాతావరణ ఉష్ణోగ్రతలు ప్రభావితం అవుతున్నాయి. హరిత క్షేత్రాల పెంపు, అడవుల సంరక్షణ, అడవుల నరికి వేతను కట్టడి చేయడం, నగరాలను నందన వనాలుగా మార్చడం, గ్రీన్ స్పేన్‌లను నిర్మించడం, నిర్మాణరంగంలో సానుకూల మార్పులు చేపట్టడం, కాంక్రీట్/స్టీల్ వాడకాన్ని తగ్గించడం, కిటికీల వైశాల్యాలు/వెంటిలేషన్లను పెంచడం, తక్కువ శక్తి వినియోగంతో గ్రీన్ గృహాల నిర్మాణం, కృత్రిమ మేధో ఆధార హీటింగ్/కూలింగ్/ లైటింగ్/ఏయిర్/మేయింటెనెన్స్‌లతో కనిష్ట శక్తిని వినియోగించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని కట్టడి చేయడం, నీటి వినియోగాన్ని నియంత్రించడం, ప్రైవేట్ వాహన వినియోగాన్ని తగ్గిస్తూ ప్రజారవాణాకు పట్టం కట్టడం, ఫ్లైఓవర్ల నిర్మాణాలను నియంత్రించడం, నెట్-జీరో ఎనర్జీ కాలనీలను నిర్మించడం, కనిష్ట శక్తి వినియోగ పట్టణీకరణ ప్రణాళికలు చేపట్టడం లాంటి పలు జాగ్రత్తలు చూసుకోవలసిన సమయం ఆసన్నమైందని పౌరసమాజం తెలుసుకోని ఆ దిశగా స్పందించాలి.

-డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
m : 9949700037
e: burramsreddy@gmail.com

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

# భూమి పునరుద్ధరణ


## జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**థీమ్:** ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రచారం "మా భూమి" అనే నినాదంతో భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ మరియు కరువును తట్టుకునే శక్తిపై దృష్టి పెడుతుంది.

**హోస్ట్:** సౌదీ అరేబియా దేశం ఆతిథ్యం ఇస్తుంది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణానికి అతిపెద్ద అంతర్జాతీయ దినోత్సవం. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) నేతృత్వంలో 1973 నుండి ప్రతి సంవత్సరం నిర్వహించ బడుతుంది. ఇది పర్యావరణ వ్యాప్తికి అతిపెద్ద ప్రపంచ వేదికగా అభివృద్ధి చెందింది. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు జరుపుకుంటారు.

సౌదీ అరేబియా రాజ్యం భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ మరియు కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారించి 2024 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. భూమి పునరుద్ధరణ అనేది UN దశాబ్దపు పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ (2021-2030)లో కీలకమైన స్తంభం. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యావరణ వ్యవస్థల రక్షణ మరియు పునరుజ్జీవనం కోసం ఒక ర్యాలీ పిలుపు, ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలకం.



ఈ సంవత్సరం జూన్ 5వ తేదీన సౌదీ అరేబియా రాజ్యం ఆతిథ్యమిస్తున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సన్నాహాల్లో భాగంగా రియాద్‌లో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

2024 రోజు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ మరియు కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారిస్తోంది. క్షీణత, ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కొంటున్న దేశంగా, సౌదీ అరేబియా రాజ్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు భారీ పెట్టుబడులు పెట్టింది. సౌదీ గ్రీన్ ఇనిషియేటివ్ మరియు మిడిల్ ఈస్ట్ గ్రీన్ ఇనిషియేటివ్ ద్వారా రాజ్యం జాతీయంగా మరియు ప్రాంతీయంగా వ్యవహరిస్తోంది. G20 యొక్క సౌదీ ప్రెసిడెన్సీ ఫలితంగా గ్లోబల్ ల్యాండ్ రిస్టోరేషన్ ఇనిషియేటివ్‌ను స్వీకరించినప్పుడు మనం చూసినట్లుగా ఇది ప్రపంచవ్యాప్తంగా పని చేస్తోంది.


వాతావరణ మార్పుల సంక్షోభం, ప్రకృతి సంక్షోభం, జీవవైవిధ్య నష్టం, కాలుష్యం, వ్యర్థాల సంక్షోభం వంటి ట్రిపుల్ గ్రహాల సంక్షోభం యొక్క ఆందోళనకరమైన తీవ్రతను మనం ఎదుర్కొంటున్నందున ఇటువంటి చర్య మరియు నాయకత్వం చాలా ముఖ్యమైనవి. ఈ సంక్షోభం ప్రపంచ పర్యావరణ వ్యవస్థలను దాడికి గురిచేస్తోంది. బిలియన్ల హెక్టార్ల భూమి క్షీణించింది. ఇది ప్రపంచ జనాభాలో దాదాపు సగం మందిని ప్రభావితం చేస్తుంది. ప్రపంచ GDPలో సగానికి ముప్పు కలిగిస్తుంది. గ్రామీణ సముదాయాలు, చిన్నకారు రైతులు, అత్యంత నిరుపేదలు తీవ్రంగా దెబ్బతిన్నారు.

భూమి పునరుద్ధరణ, భూమి క్షీణత, కరువు మరియు ఎడారీకరణ యొక్క క్రీపింగ్ ఆటుపోట్లను తిప్పికొట్టగలదు. పునరుద్ధరణలో పెట్టుబడి పెట్టిన ప్రతి డాలర్ పర్యావరణ వ్యవస్థ సేవలలో US$ 30 వరకు పొందవచ్చు. పునరుద్ధరణ జీవనోపాధిని పెంచుతుంది. పేదరికాన్ని తగ్గిస్తుంది. విపరీత వాతావరణాన్ని తట్టుకునే శక్తిని పెంచుతుంది. పునరుద్ధరణ కార్బన్ నిల్వను పెంచుతుంది. వాతావరణ మార్పును తగ్గిస్తుంది. కేవలం 15 శాతం భూమిని పునరుద్ధరించడం, తదుపరి మార్పిడిని నిలిపివేయడం వలన ఆశించిన జాతుల వినాశనాన్ని 60 శాతం వరకు నివారించవచ్చు.

పర్యావరణాన్ని కాపాడేందుకు, సంరక్షించేందుకు ప్రతిఒక్కరి బాధ్యతను గుర్తు చేస్తూ ఏటా జూన్ 5న జరుపుకునేదే ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఈ ప్రత్యేక రోజున అనేక స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థలు పర్యావరణం ప్రాముఖ్యత గురించి తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. అయితే ఈ ఏడాది మనం జరుపుకోబోయేది 51వ వార్షికోత్సవం.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# కాలుష్యంపై యుద్ధం





*పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు.,కథల పుస్తకాలే. పాఠ్య పుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి.*

*పిల్లలలో నైతికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.*

*ఈ మే నెలలో బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు - 2023 నిర్వహించింది. తక్కువ సమయంలోనే, వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 51 కథలు వచ్చాయి. కథలన్నీ చాలా బావున్నాయి. బాల సాహిత్య నిపుణులు ఈ కథలను చదివి, చర్చించి ప్రచురణకు 24 కథలు ఎంపిక చేశారు. ఈ కథల పోటీలు నిర్వహించి మరియు పుస్తక రూపాన్నిచ్చింది బాలచెలిమి.* **- వేదకుమార్ మణికొండ**

అదో పల్లెటూరు. పేరు రఘురామాపురం. ఆ ఊరు చూడముచ్చటగా వుంటుంది. చాలా చక్కని దృశ్యాలు కనిపిస్తాయి. అక్కడి ప్రజలు కలిసిమెలిసి వుంటారు. శ్రమ చేస్తూ బతుకుపోరు కొనసాగిస్తున్నారు. ఆ ఊరిలో ఒక పెద్ద చెరువు వుండేది. ఆ చెరువు యించు మించు 3-4 ఊర్లకు జీవనాధారం. ఆ చెరువును ఆనుకొని ఎన్నో సారవంతమైన పొలాలు వుండేవి. రైతులు ఏడాదికి 3 పంటలు పండించేవారు. ఆ ఊరికి దగ్గరలో ఒక అడవి కూడా వుండేది. అక్కడి ప్రజలు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సుఖ సంతోషాలతో తమ జీవితాన్ని గడుపుతున్నారు.



కొన్నేళ్ల తర్వాత ఆ ఊరికి దగ్గరలోని అడవిని కొట్టేసి ఒక ప్రైవేటు కంపెనీ వారు అక్కడ ఒక ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీని నిర్మించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాలను చెరువులోకి వదిలేస్తున్నారు. దీనితో జల కాలుష్యం ఏర్పడి చెరువులోని ప్రాణుల జీవనానికి పెను ప్రమాదంగా మారింది. చెరువు నీరు పొలం పనులకు ఉపయోగపడట్లేదు. పంటలు పండక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. వారి జీవనోపాధికి పెను ప్రమాదం ఏర్పడింది.

ఆ ఫ్యాక్టరీ నుంచి వచ్చే విష వాయువులు అక్కడి ప్రజలకు ఆరోగ్య సమస్యలను కూడా తెచ్చి పెట్టింది. వాయు కాలుష్యంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అప్పటి వరకు ఎటువంటి ఆరోగ్య సమ్యలు లేని వారు ఎన్నెన్నో జబ్బుల బారిన పడ్డారు.

అక్కడి ప్రజలు ఎంతో బాధగా ఇంతకు ముందు జీవితాన్ని స్మరించుకుంటూ ఉండేవారు. ఆ ఊరికి వేసవి సెలవుల్లో అమ్మమ్మ వాళ్ళ ఇంటికి రాజేష్ అనే అబ్బాయి వచ్చాడు. అక్కడ జరిగిన మార్పులు రాజేష్‌ను తీవ్ర నిరాశకు గురిచేశాయి. రాజేష్ తన స్నేహితులు అక్కడి ప్రజలను ఫ్యాక్టరీ మూసివేయడం కోసం ప్రయత్నించమని ప్రోత్సహించారు. వారంతా కలిసి చుట్టుపక్కల మూడు నాల్గు గ్రామాలలోని ప్రజలను కలిసి ఫ్యాక్టరీ వల్ల కలిగే దుష్పరిణామాలపై తెలిపి ధర్నా చేయ తలపెట్టారు.

అందరూ కలిసి పెద్ద ఎత్తునధర్నా మొదలెట్టారు. ఏడాది పొడువునా ఆ ధర్నా కొనసాగించారు. దానితో ప్రభుత్వం ఆ ప్లాస్టిక్ తయారీ ఫ్యాక్టరీని మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో అందరూ ఎంతో ఆనందపడ్డారు. కొన్నేళ్ల తర్వాత రఘురామాపురం పూర్వ వైభవాన్ని పొందింది. అందరూ రాజేష్ తన స్నేహితులకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

- బి తనుశ్రీ,
m : 9490172574

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - May 2024
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar